


22-3-50

విషయానుక్రమణిక

22 మార్చి 1950




భారతప్రభుత్వ పరిశ్రమల శాఖామంత్రి డా॥ శ్యాంప్రసాద్ ముఖర్జీ యీనెల 18 న న్యూఢిల్లీలో జరిగిన శాస్త్ర పారిశ్రామికపరిశోధనబోర్డుసమావేశాన్ని ప్రారంభించినప్పుడు తీయబడిన చిత్రం. ముఖర్జీగారు ప్రారంభోపన్యాస మొసంగుచుండుట చిత్రములో కానవగును.

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0 విడిప్రతిక 4 అణాలు	**ప్రతిబుధవారము ప్రకటింపబడును.** ఒరులేయవియొనరించిన నరవర యప్రియము తనమనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్. (మహాభారతము) **Founder : K. NAGESWARA RAO.**	సంపుటము **42** సంచిక **29**

వికృతి సంవత్సర చైత్ర శుద్ధ చవితి బుధవారము



భారతీయ వాణిజ్య సంఘముల ఫెడరేషన్ 23 వ వార్షికసభను పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రారంభించారు. నెహ్రూ వెనుకగా కుర్చీలో ఫెడరేషన్ నూతనాధ్యక్షుడు తులసీదాస్ కిలాచంద్ కూడా కూర్చుని ఉన్నారు.



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ మార్చినెల 22-వ తేది బుధవారము

ఉగాది

గతించిన విరోధిసంవత్సరము వికృతిని తన యనంతరాధికారిగా మనకు చూపి విరమించినది. జగత్తునకు కాలము మూలమని తత్వజ్ఞుల నిర్వచనము. భూత-వర్తమాన- భవిష్యత్తులు మూడును సృష్టి-స్థితి-లయముల పరివర్తనానుభవజ్ఞానమేగాని తద్భిన్నములు కావు. సృష్టి స్థితి లయముల "మూలకారణంబెయ్యది? యనాదిమధ్యలయు డెవ్వడు?" తుది మొదలు లేని కాలస్వరూపమే భగవత్స్వరూప మని జ్ఞానులు గ్రహింపగల్గిరి. నూత్నవత్సరారంభము పర్వదినముగ సర్వత్ర వర్తించుచున్నది. ఇతరపండుగదినములవలె ఉగాదినాడు విశిష్టమైన విగ్రహారాధన మనకు లేదు. ఈ పర్వదినమునకు ప్రత్యేకించిన పురాణశ్రవణము కూడ లేదు. కాలస్వరూపునిగా భగవంతుని స్మరించుటయే ఉగాదికి యుక్తమైన మనన విశేషము. పంచాంగపారాయణమే యీనాడు పవిత్ర కాలక్షేపము. ఇది ఆర్యసంప్రదాయము.

గతించినవి సుదినము లనుటయును, ముందున్నవి గడ్డుదినము లనుటయును సహజమానవమతము. కాని అది అధైర్యసూచకము. నిజతత్వవిచారణ చేసినచో యావనుల కోరిక లీరికలెత్తి "బ్రతికియుండిన భాగ్యముల్ బడయవచ్చు" నని భవిష్యత్తున కెదురు చూచుచు, ఆశలు వేపపూతవలెను సంకల్పములు మామిడిపిందెలవలెను నవవసంతనివేదనలరీతి ప్రత్యక్షమగుచుండును. ఇది ఆత్మధైర్యలక్షణము. కాని, కర్మయోగికి ఆశ లేదు. ఆశాభంగమును లేదు. జయాపజయంబులు దైవాధీనంబులని యెరింగి కర్మపరతంత్రుడై స్వధర్మనిరతుడై కృషిచేయుటమాత్రమే తన విధియని మహాత్ముడగు కర్మయోగి ధర్మసాధనానిమగ్నుడగును.

ఉద్యమము ఉత్తమమైనదని సాధింప సమకట్టవలెను. స్వరాజ్య మింత త్వరలో సిద్ధించునని మన మూహింపజాలకపోయినప్పుడు, కాలము పరిపక్వమైన తోడనే కాకతాళీయముగా సిద్ధించినదని తోచవచ్చును. ఆంధ్రరాష్ట్రము అరచేతివైకుంఠముగా సుసాధ్యముగా స్వయంసమృద్ధముగా గుణింపబడినప్పటికిని, మన స్థితి అందని పండుకొరకై అర్రుజాపిన వెర్రిగతి గన్పించుచున్నది. కాని, మనము సంకల్పించిన సంకుచితాంధ్రరాష్ట్రమునకు మించిన విశాలాంధ్రరాష్ట్రమే అచిరకాలమున పరిపక్వమై ఆంధ్రుల పూజాఫలమై అవతరించవచ్చు. చేసిన తపస్సు, సాగించిన ధర్మసాధన వ్యర్థమగు ననుట దుర్భ్రమ. ఆంధ్రోద్యమపరిణామావస్థలయం దిది యొక ఘట్టము. గడచినజనవరికి జరుగనిపని కిక జవ ముడిగిన దను జనవాక్య మజ్ఞానసంజనితము. ఆంధ్రోద్యమము ఆంధ్రులకు నిత్యయావనప్రదాయిని. అది ఆంధ్రతేజమునకు అమరత్వము ఘటించును. ఈ నూతనసంవత్సర మాంధ్రుల నిరాశను వికృత మొనర్చి ముందంజ వేయుటకు దీక్షాకంకణముల ప్రసాదించుగాక!

క్రొత్త పంచాంగముల గ్రహసంపుటి ఎట్లున్నదను పరిశీలన సులభసాధ్యము. కాని ప్రపంచ రాజ్యాంగతంత్రముల సంగ్రహసమీక్షలు దూరదృష్టిగల తంత్రజ్ఞులకైనను తలమున్కలుగా నున్నవి. యుద్ధకాలమునందుకంటె యుద్ధానంతరమునందు సమస్యలతిదుష్కరము లగుచున్నవి. ఆహారసమస్య మొదలుకొని అన్ని వ్యవహారసమస్యలును అంతర్జాతీయ సమస్యలుగా పరిణమించినవి. మనరాష్ట్రప్రభుత్వములును, కేంద్రప్రభుత్వమును, యీ క్రొత్తసంవత్సరమునందు ఆయవ్యయములను సరిపుచ్చుటకు శ్రద్ధ

వహించినవి. ఆర్థికాభివృద్ధికై ఆశించినవి కాని, సాహసించుటకు పూనుకొనలేదు. నూతననిర్మాణపథకములను మెలకువతో మేలుకీళ్ళను గమనించి నెహ్రూ ప్రభుత్వము నిర్ణయించి మున్ముందు ముందంజ వేయ దలంచినది. ప్రపంచఆర్థికవ్యవహారసూత్రమును తన చేతిలోని కల్లెమువలె అమెరికా ఆడించుచున్నది. ఆర్థికసంక్షోభముల నాధారముగా గైకొని అంతర్యుద్ధముల పురిగొల్పి తన కమ్యూనిస్టుతంత్రమున కాహుతి చేయవలెనని రష్యాప్రభుత్వప్రేరిత అంతర్జాతీయకమ్యూనిస్టుసమాజము తన వ్యూహసన్నాహములను సాగించుచున్నది. ఈ ఆర్థికసమస్య వికృతరూపము దాల్చకుండుటకు ప్రతిరాజ్యమునందును పాలితపాలకులు సమష్టికృషి చేయవలసియున్నారు. ఆర్థికాభ్యుదయమే ప్రజల కుపదేశింపబడుచున్న పారమార్థికముగా నున్నది. వస్తుసంపద్వృద్ధికై సమస్త శక్తులను కేంద్రీకరింపవలె ననుటయే ఈనాటి ప్రపంచ పంచాంగశ్రుతిఫలితాంశము. భారతావని అన్నవస్త్రముల కొరత లేక, సస్యశ్యామలమై సుభిక్షమై వర్ధిల్లుటకు ప్రజాసంకల్పబలము ప్రస్ఫుటము కావలెను. "సత్యమేవ జయతే" యను నినాదమే ఈశ్వరాశీర్వాదము. "స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః"

అమెరికావిధానం

"సోవియట్ రష్యా యుద్ధమును ప్రారంభించుటకు తగిన సమయముకొరకు ఎదురుచూచుచున్నది. కనుక మనము ఆయుద్ధముకొరకు సన్నద్ధులమై యుండవలెను" అని అమెరికా నౌకాశాఖాకార్యదర్శి ఫ్రాన్సిస్ మాథ్యూస్ అమెరికనుప్రజలకు చేసిన హెచ్చరికలో క్రొత్తదనము ఏమియు లేకపోయినను శాంతిసమస్యలను చర్చించుటకు అటు అమెరికాఅధ్యక్షుడు ట్రూమన్, ఇటు సోవియట్ప్రధానమంత్రి స్టాలిన్ సుముఖముగ నున్నతరువాత అధికారస్థానములందున్నవారు ఇట్టి ప్రకటనలు చేయుట విపరీతముగ నున్నది.


అమెరికా ప్రభుత్వవిదేశాంగశాఖాకార్యదర్శి మొన్నటిదినము శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రకటించినట్లు "ప్రపంచప్రజలందరు తమ ఇష్టానుసారము అభివృద్ధికరమైన జీవితమును గడుపుకొనుటకు వనరు కల్పించుటే అమెరికావైదేశికవిధానలక్ష్యమై"న చైనాలో చాంగ్ కై షేక్ ప్రభుత్వమును నిలుపుటకు, కొరియా విభజనను స్థిరపరచుటకు కోట్లకొలది డాలరులను దుబారాచేయవలసిన అగత్యములేదు. యధార్థముగ ప్రజాస్వామ్యరక్షణకు కృషిచేయుచున్న ఆసియాదేశముల అవసరముల నుపేక్షించుట జరుగదు.

అమెరికా అటు యూరపులో మార్షల్‌పథకమునుగాని, ఇటు ఆసియాలో చతుస్సూత్రప్రణాళికను గాని నిస్వార్థముగ అమలుజరుపుటలేదు. కమ్యూనిజం వ్యాప్తివలన ఎక్కువగ నష్టపడు దేశము అమెరికా. దాదాపు ఇతరప్రజాస్వామికరాజ్యము లన్నింటియందు ప్రయివేటుపారిశ్రామికుల ప్రాధాన్యము తగ్గి కీలకపరిశ్రమ లన్నియు క్రమముగ ప్రభుత్వపరమగుచున్నవి. దాదాపు ఈ దేశము లన్నింటియందు నేడు రష్యాలో అమలునందున్న "స్టేట్ కాపిటలిజమె" ఏర్పడుచున్నది. అమెరికా ఆ పరిణామమును ప్రతిఘటింప నిశ్చయించుకొన్నది. కనుకనే భారతదేశమునకు ఇంతవరకు అమెరికానుండి, ఆర్థిక, సాంకేతికసహాయము లభింపకున్నది. అమెరికావిదేశాంగశాఖ అనుసరించుచున్న ఈ విధానము ప్రజాస్వామ్యరక్షణకు గాక, కమ్యూనిజంవ్యాప్తికే ఎక్కువగ తోడ్పడుచున్నది.

చైనాలో ఈ విధానము విఫలమైనదని అమెరికా ప్రభుత్వ మీసరికి గ్రహించియుండవలసినది. ప్రయోజనకరమైన మరొక విధానమును అనుసరించుటకు ప్రయత్నింపవలసియుండెను. అట్లు గాక పాతవిధానమునే అంటిపట్టుకుకూర్చొనుటవలన అగ్రనాయకత్రయసమావేశములు సాధ్యము గాకపోవుట, అన్ని రాజ్యములు మరొక యుద్ధమునకు సన్నద్ధమగుట జరుగుచున్నది. ఇందుకు అమెరికా, రష్యాలు సమముగ బాధ్యత వహింపవలసియుండును,

మనరాష్ట్రం, మనదేశం:

ఇండో-పాకిస్తాన్ వ్యవహారాలు





భారతప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ మరొకపర్యాయం కలకత్తా వెళ్లి తూర్పుబెంగాల్ నుంచి దినదినం వేలాదిగా వస్తున్న శరణార్థులనుగురించీ, తూర్పు బెంగాల్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో మతకల్లోల పరిస్థితిని గురించీ చర్చించారు. మూడురోజులు పరిస్థితులను పరిశీలించి ఢిల్లీ తిరిగి వచ్చారు. పార్లమెంటులో విదేశాంగశాఖ వ్యవహారాలపై చర్చను ప్రారంభింపచేసినప్పుడు భారతపాకిస్తానులమధ్య గల వ్యవహారాలను, మతకలహాల సమస్యను సమగ్రంగా సమీక్షచేశారు.

తూర్పుపాకిస్తాన్లో హిందువుల క్షేమం గురించి భారతప్రభుత్వం అశ్రద్ధవహించ జాలదని పండిట్ నెహ్రూ స్పష్టపరిచారు. దీనికి పార్లమెంటుసభ్యులు యావన్మందీ హర్షించారు. ప్రస్తుతం ఉభయదేశాలలోనూ హిందూమహమ్మదీయుల మధ్య వచ్చిన తీవ్రద్వేషోద్వేగాలను కొంత ఉపశమింపచేయడానికిగాను, ఉభయ దేశాల ప్రధానమంత్రులూ తమతమ దేశాలలోని అల్పసంఖ్యాకుల రక్షణకు ప్రభుత్వాలు బాధ్యతవహించగలవని సంయుక్త ప్రకటన చేసే విషయమై ఆలోచిస్తున్నట్లు పండిట్ నెహ్రూ చెప్పారు. ఈ ప్రకటనలో ఉండవలసిన ముఖ్యాంశాలపైన ఉభయప్రధానమంత్రులమధ్యనూ ఇంకా ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. తమతమ దేశాలలోని అల్పసంఖ్యాకవర్గాల రక్షణబాధ్యత ఆ ప్రభుత్వాలే పూర్తిగా భరించాలి. నేరస్థుల్ని ప్రభుత్వాలు శిక్షించాలి. బాధితులకు పరిహారమిచ్చి, వారి పునరావాసబాధ్యతను ఆప్రభుత్వాలే వహించాలి. లూటీచేయబడిన ధనసంపదలకోసం ఆ ప్రభుత్వాలు వారి దేశాలలో తీవ్రంగా శోధించి, అవి ఎవరిఅధీనంలో ఉన్నాయో వారిని శిక్షించాలి. అపహృతస్త్రీలను వెదకి వారిని వారి బంధువులకు ఒప్పగించడానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. బలాత్కారమతపరివర్తనలు నిషిద్ధాలని నియమం విధించాలి. వదంతులను వ్యాపింపచేసే వ్యక్తులను వార్తాపత్రికల అధికారులను శిక్షించాలి.

అయితే ఈ అంశాలపైన ఉభయప్రభుత్వాలమధ్యనూ అంగీకారం ఇంకా కుదరలేదు. ఈ అంశాలపైన భారతమంత్రివర్గంలోనూ, పార్లమెంటులోనూ తీవ్రమైన అసంతృప్తి కలుగుతున్నట్లు వార్తలు వస్తూన్నాయి.

పండిట్ నెహ్రూ తెలిపిన ఈప్రకటనాంశాలు అంతకుముందు వారు చేసిన ప్రకటనా పరస్పరవిరుద్ధంగా ఉన్నట్లు గోచరిస్తున్నాయి.

పాకిస్తాన్ పరిపాలనావ్యవహారాలలో జోక్యంచేసుకోడం భారతప్రభుత్వాని కిష్టంలేకపోయినప్పటికీ, అక్కడి హిందువుల స్థితిపట్ల అశ్రద్ధవహించలేరనీ, భారతదేశానికి రాగోరే హిందువుల్ని నిరాక్షేపణగా రానివ్వగలరనీ పండిట్ నెహ్రూ ముందుగా చెప్పారు. కాని సంయుక్తప్రకటనాంశాలు తద్భిన్నంగా ఉన్నాయి. అల్పసంఖ్యాకవర్గాల రక్షణబాధ్యత, వారిలో బాధితుల పునరావాసబాధ్యత పూర్తిగా ఆ ప్రభుత్వాలే వహించాలని ఈ ప్రకటనలో సూచించబడనున్న దన్నారు. అంటే ఇకనుంచి భారతదేశంలో మహమ్మదీయుల స్థితిగతులనుగురించి పాకిస్తాన్ ప్రభుత్వం గాని, పాకిస్తాన్లోని హిందువుల స్థితిగతుల

(39-వ పేజీ చూడుడు)

ఉగాది దేవత

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

గొప్ప అయిదంతస్తులమేడ కెదురుగా చిన్నగుడిసెముందు బక్కచిక్కిన అబ్బాయి ఒకడు కూచుని తదేకధ్యానంతో చూస్తున్నాడు. ఎందుకు చూస్తున్నాడంటే, ఆ మేడలోకి ఒక దేవత వెళ్ళింది. ఆవిడ మళ్లీ ఎప్పుడు బయటికి వస్తుందా అని అబ్బాయి చూస్తున్నాడు.

ఆ దేవత కాళ్లకి పసుపూ పారాణీ పెట్టుకుని, కొత్తచీరె కట్టుకుని, అనేక నగలూ ఆభరణాలూ పెట్టుకుని, మెడలో ఆకుల తోరణాలు ధరించి, శిఖలో పూత తురిమి, అంతదూరానికే భక్ష్యాల వాసనకొట్టింది.

త్వరలోనే ఆ దేవత ఆ మేడలోనుంచి బయటికి వచ్చి ఎదురుగా ఉన్న పూరిగుడిసెకేసి చూడకుండా పక్కగాఉన్న మరొక మేడకేసి మళ్లుతున్నది.

"ఓ దేవతా!" అని పిలిచాడు అబ్బాయి.

దేవత ఆగి అబ్బాయిని చూసింది.

"ఇట్లారా!"

దేవత వచ్చింది.

"నువ్వెవరు?"

"నేను ఉగాదిదేవతను."

"వగసగా ఒక్కొక్క మేడలోకీ వెళ్లి వస్తున్నావు, దేనికి?"

"ఇవాళ సంవత్సరాది కాదూ?"

"మేడల్లో ఉండేవాళ్లకేనా సంవత్సరాది?"

"అందరికీనీ."

"అయితే గుడిసెల్లోకి దేనికి రావూ?

"రాకూడదు."

"ఏం? నువ్విచ్చే బహుమానాలన్నీ ఆ మేడల్లోవాళ్లకే ఇవ్వాలా?".

"నే నేమీ బహుమానా లివ్వటంలేదే, ఎవరి బహుమానాలు వాళ్లే సంపాదించుకుంటారు."

"అయితే మరినువ్వు వెళ్లి ఏం చేస్తావు?"

"ఏం చేస్తానా? విను. ఆ ఇళ్లలోఉన్న వారికి ఒక కొత్త ఉత్సాహం కలిగిస్తాను. అప్పుడు వాళ్లు పండగఉత్సాహంలో పడతారు. వాళ్లల్లో వాళ్లకు మామూలుగా ఉండే స్పర్ధలు ఇవాళ లేనట్టు నటిస్తారు. నన్ను ఇంటికి పోతే ఎంతో ఆదరంతో చూస్తారు, ఆరాధిస్తారు, నాకోసం పాటలు పాడుతారు. ఈవాళ్లలా నన్ను మరిచిపోరు. రేపూ ఎల్లుండీకూడా నేను వాళ్లమనస్సుల్లో మెదులుతూ ఉంటాను. ఇందుకే నేను వాళ్ల గడప తొక్కేది."

"నువ్వు నాతో అబద్ధాలాడుతున్నావు. నువ్వు దేవతవు. ఆ మేడల్లోవాళ్లకేదో మేలు చేసివస్తున్నావు. గుడిసెల్లోవాళ్లంటే నీకు లోకువ. అందుకనే నువ్వు గుడిసెల్లో అడుగు పెట్టవు."

"నే నబద్ధం ఆడటంలేదు. కావటానికి నేను దేవతనేగాని, అందరు దేవతలల్లేనే నేనుకూడా ప్రజల ఆరాధన కోరుతానుగాని ప్రజలకేమీ ఇవ్వను. ఇస్తున్నానని వాళ్లు భ్రమపడతారు. గుడిసెల్లోవాళ్లు నన్ను ఆరాధించరు. భ్రమపడరు."

"ఒక్కసారి మా గుడిసెలో అడుగుపెట్టు, ఉగాది దేవతా! మేం కూడా నిన్ను ఆరాధిస్తాం. రేపూ ఎల్లుండీ కాదు ఏడాది పొడుగునా నిన్ను జ్ఞాపకం ఉంచుకుంటాం."

ఉగాదిదేవత కొంచెం తటపటాయించి, "సరే వస్తున్నా పద," అంటూ ఆ అబ్బాయి గుడిసెలో ప్రవేశించింది.

మరుక్షణమే ఆమెతలలో ఉండినపూత వాడిపోయింది. ఆమెజుట్టు ఎండి అట్టలు కట్టుకుపోయింది. మెడలో ఆకుతోరణాలు మాయమైనాయి. కొత్తచీరె కాస్తా చింకిపాత అయింది. పాదాలమీద పసుపూ, పారాణీ ఉండటానికి బదులు అడుసున్నది. దేవతవొంటిన ఒక్క నగగాని ఆభరణం గాని లేదు.

అబ్బాయి నిర్ఘాంతపోయి, "ఏమిటీమాయ వేషం?" అన్నాడు.

"అవును, నాయనా! మాయవేషమే! కాని నువ్వు చూసేదిమాత్రం మాయవేషం కాదు. ఆ మేడల్లోవాళ్లు చూసినదే మాయ వేషం... నేను వేషం వేసుకుతిరుగుతున్న మామూలురోజునే!" అంటూ ఉగాది దేవత అంతర్ధానమయింది.

ప్రకృతిలో జీవాల ప్రజ్ఞావిశిష్టతలు

ప్రకృతిలోని ప్రతిజంతువూ, జంతువు అంగాంగాలుకూడా, కొంచెం ఆలోచనాపరుడైనవానికి ఆశ్చర్యవిభ్రమాలు కొలిపేవే. కాని ఉండిఉండి, ఆశ్చర్యాలు చాలవా అన్నట్లు, ప్రకృతి, ఒక్కొక్క మహాద్భుతమైన విశిష్టవిశేషాన్ని తయారుచేసి తక్కిన వెందుకు పనికిరాకుండా చూపిస్తూఉంటుంది.

"కన్ను" నిర్మాణం, మనుష్యుని కన్నే కానీయండి, లేదా పీతకు నెత్తిమీద గొట్టాల చివర అమరినట్లు కనబడే కన్ను కానీయండి లేదా గుండ్రంగా ఉబ్బి వెనక్కువారి, వెనకచూపు చూసే కుందేలుకన్ను కానీయండి, ప్రతీ ఒక్కకంటి నిర్మాణమూ ఆశ్చర్యమే కొలుపుతుంది. కాని "అనాబెల్లెప్స్" అనే చేపకంటి నిర్మాణముందు తక్కిన ఏ జీవజంతువుకంటి నిర్మాణముకూడ పేలవంగానే కనబడుతుంది. ఈచేప తన కంటిలో సగం నీటిపైకి, తక్కినసగం నీటి క్రిందికి పెట్టి చూస్తూ ఈదుతూటుంది. ఒక్కొక్క కంటిగ్రుడ్డులో నీటిపై భాగానికి ఒక "కంటిపాప" నీటిక్రిందిభాగానికి ఒక "కంటిపాప" ఉంటాయి. ఒకేసారి, నీటిమట్టంపైనా, నీటిలోపలాకూడా చూసుకోగలుగుతూ ఈ చేప పోతోంటుంది. గ్రుడ్డులో క్రిందిపాప నీళ్ళల్లో చూసేందుకు అనువుగానూ పైప గాలిలో చూసేందుకు అనువుగాను—నిర్మించబడిఉన్నాయి.

*　　*　　*

ఇల్లాగే జీవజంతువుల నాలుకలలోకూడా ప్రకృతి అపారమైన వింతలు నిర్మించింది. కప్పనాలికమూలం కంఠంలో కాకుండా నోటిలో ముందుభాగంలో పెదవులదగ్గరగా ఉంటుంది. అందుకనే పురుగులను పట్టుకొనేందుకు కప్ప నాలుకను పూర్తిగా నోటివెలుపలికి జాపకలుగుతుంది. ఒక తొండ (గెకో లిజర్డ్) నాలుక ఎంత పొడుగ్గా ఉంటుందంటే, ఆ తొండ నాలుకతో కళ్లు తుడుచుకోకల్గుతుంది. నాలిక కదలికకూడా అతిచలాకీగా ఉంటుంది. అన్నిటికన్నా, చీమలు తినే అంటుఈటర్ అనే జంతువుంది. ఈ జంతువుకు తల పెద్దదేగాని, దీని నాలుక తలమాత్రంలో పట్టనంత పొడుగుంటుంది. ఈలికతో చీమలపుట్టల్లో ఎంతో లోతున ఉన్న చీమల్నికూడా ఈ జంతువు పట్టకలుగుతుంది. దీని నాలుక మూలం నోటిలోగాని కంఠంలోగాని ఉండదు. రొమ్ముఎముకల లోపల ప్రారంభమవుతుంది.


*　　*　　*

కొన్ని జీవాలలో నాలికా పళ్లూ, ఒక నాలికగానే కలిసిపోయిఉంటాయి. పెంగ్విన్ పక్షిలో, నాలుక వెన్నెముకవంపులతో ఉంటుంది. నాలుకమీద పడ్డ కీటకం జారిపోయేందుకు వీలు లేకుండా! ఫ్లామింగో పక్షి నాలికలో వెన్నెముక వంపులన్నీ ఉండీ, ఆహారాన్ని గుడ్డతో పిండినట్లు నాలుకతో పిండటానికి వీలుగా ఉంటుంది. బాతులాగే ఈ పక్షికూడా, ఇన్ని బురదనీళ్లు ముక్కుతో పీల్చుకొని ముక్కుమూసి, నీళ్లను కార్చేసి పురుగులను మిగుల్చుకొంటుంది. వీట్లన్నిటి నాలుకలకన్నా మన దొడ్లల్లో వానాకాలంలో కనబడే కొండజలగనాలిక మరీ విచిత్రం. ఈ జలగనాలికలో 185 వరుసల పళ్లుంటాయి. ఒక్కొక్క వరుసలో 105 పళ్లుంటాయి. మొక్కలను కొరికేటప్పుడు, ఈ పురుగు 14,175 పళ్లు వాడుతుంది.

*　　*　　*

నీటిపైపైన తిరుగుతూ నేలమీది ఆహారంతోపాటు, నీటితటంలో దొరికే ఆహారాన్ని ఒక్క మునకమాత్రంలో మునిగి తేలి, ఆహారంపట్టే, నీటిపక్షులను, బాతులు, కొంగలు, లకుముకుపిట్టలులాంటివాటివి చాలా చూసిఉంటాము. కాని ఈనీటి ఊజెల్ అనే పిట్ట మరీ విచిత్రంచేస్తుంది. సరాసరి నీటిలో మునిగి, నదీగర్భం చేరుకొని, నేలమీద నడుస్తున్నంత తీరుబడిగానూ అడుగున సంచరిస్తూ ఆహారం వెదుకుకొంటుంది. ఈ పక్షి రెక్కలు అతివట్టంగా ఉండటంవల్ల, దేహం ఏమాత్రమూ తడవదు.

*　　*　　*



జెరోబా (చిట్టెలుకజాతిజంతువు)

జంతువుల పక్షుల దేహవర్ణాలు, పరిసరాలలో కప్పిపడిపోయేట్లుగా అమరిఉండటం, పెద్దపులి అడవిలో దాక్కొనేందుకు, సింహం ఎడారిలో ఉండటానికి, ఆకుల నీడలలో తొండలూ పురుగులూ కనబడకుండా అమరి నిలవటం, అందరూ ఎరిగి ఉన్న విషయమే. కొన్ని కొన్ని జంతువులు అవసరాలకు రంగులు మార్చుకొంటాయనేదీ తెలిసినవిషయమే. కాని ఈ మార్పులు అతిశీఘ్రంగా తెచ్చుకోగల జంతువులు సముద్రంలో కనబడుతాయి. ఇందులో ఒక జంతువు ఈదుతూంటే దేహంమీద నీటి వరుసనే వెలుగునీడలు కల్పిస్తూ, నీటిలో కదులుతున్న అలలతో రూపం కలిసిపోతుంది. ఇది ఈదటం ఆపి నిలవగానే, ఈ చారలు నీడలు నిలువుగా తేరి నాచు మొదలైనవాటి మాదిరిగా నీటిలో నిలచినట్లు భ్రమకల్పించి, జంతుస్వరూపం కనిపెట్టలేనట్టుగా చేస్తూంది.

*　　*　　*

గమనవేగంలో ప్రకృతిలో ప్రసిద్ధికెక్కిన మృగపక్షిజాలాలు ఉన్నాయి. మనమటుకు మనమే, నూరు గజాలు రెండువందల గజాలు మాత్రపు దూరాలు గంటకు 25 మైళ్ళ వేగంతో కూడా పరుగెత్తగలం. పందెపుగుఱ్ఱాలు, గంటకు 45, 50 మైళ్ళ వేగపు పరుగుతో పందెపు పరుగులు తీయగల్గుతాయి. కాని ప్రకృతిలోని కొన్ని జంతువుల వేగంముందు ఇది పనికిరావు.

(36-వ పేజీ చూడుడు)

ఉగాది లేవన్నెలు

(ఎస్పార్)

విరోధి గడిచి వికృతి ప్రవేశించింది. విశ్వాన్నొక రేణువులో సాక్షాత్కరింప చేసుకోవాలంటే, ఒక్క పుష్పరేఖలో విశాలగగనాన్ని వీక్షించాలంటే అనంతాన్ని అరచేతిలో పెట్టుకోమన్నాడొక కవి. కాని పరిమితమైన బుద్ధిగల మానవుడు సమస్తవిషయాల్నీ తన మూరతో కొలవడానికి చూస్తాడు. తరంగమయమైన అనంతవాహినిలో, ఒక్క తరంగంలోని ఉచ్చగతిని గడిచి తరువాత నిమ్నగతిని గడిచి, తిరిగి ఉచ్చగతిలో ప్రవేశించగానే, గడచిన తరంగాన్ని ముందధిగమించినవానితో చేర్చి మరొక అంకె కలుపుకుంటాడు. లయాన్వితమైన కాలపురుషుని నృత్యంలో ఇదొక చరణం. ఈ చరణంలోని పల్లవి అనుపల్లవి తిరిగి తిరిగి వస్తూ ఉంటాయి. ఈ నృత్యానికి ఆద్యంతాలుండవు. కాని మన జీవితంలో మాత్రం మరొక క్షణంతం గడిచిపోయినదౌతుంది. ఆయువులో ఒకసంవత్సరం శిరైచపోయిందన్నమాట. ఆద్యంతాలు లేని అనంతకాలపు గణితాన్ని కాలపురుషునికి విడిచి, సూర్యచంద్రులవంక తిరిగి మన గణితం మనం వేసుకుని సంవత్సరాదులూ సంక్రాంతులూ పండుగలూ చేసుకుంటాం.

బ్రతుకు ఝంఝూటంలో పడి, వ్యాపార రాజకీయాల్లో ఉక్కిరిబిక్కిరై, కాలమానాన్నీ ఆయుశ్శేషాన్నీ మరిచిపోవాలనుకున్నా, ధరిత్రీమాత మరిచిపోనియ్యదు. ఒకొక్కప్పుడు ఆహ్లాదంతో, మరొకప్పుడాగ్రహంతో ఋతుపరిణామాల్ని తెలియపరుస్తుంది. అన్ని పండుగల్లోకీ సంవత్సరాది మధురంగా సున్నితంగా వచ్చినట్లేవచ్చి మనకి తెలియకుండా వెళ్ళిపోతుంది. అప్పటికి చలి పూర్తిగా తగ్గిపోతుంది. వేసవి వస్తున్నాదంటున్నా, ఇంకేం ఆకాశంలో మేఘాలతో నిక్కే ఉంటుంది. కాని అప్పుడే విరుచుకు పడదు, వర్షాలుండవు, కాదు అంటే ఎక్కడైనా చిన్న జల్లు పడవచ్చునేమో. గాలిస్తోందంటే భయంపోతుంది. గాలిలో ఉధృతం ఉండదు. చల్లగా మెల్లిగా వీస్తుంది. హాయిగా చేతులెత్తి వాయుప్రసారానికెదురై నిలిచి ఆహ్వానిస్తాం. ఇది శీతోష్ణాలకు మధ్య సంధ్యాకాలం. శీతలవాయుధృతిలో ఉష్ణంకోసం, ఉష్ణవాతోద్ధతిలో శీతలంకోసం వటచ్ఛాయలు, కూపజలాలు, తాంబూలాలు తరుణీస్తనాల ఆశ్రయం పొందవలసిన అగత్యం ఉండదు. వసంతుని ఆహ్లాదంతో ఆహ్వానిస్తాం. పరిసరాలంతా కొత్తపచ్చదనంతో శోభిస్తుంది. చిరుపూలగుత్తులతో పిందెలతో పచ్చనిగుబుర్లతో బరువై వొంగిన మామిడి, వేప మొదలైన వృక్షాలు మెత్తని సూర్యకాంతి నాహ్వానిస్తాయి. పుష్పోద్యానాలలో కొత్త లావణ్యం విరజిమ్ముతుంది. జువ్వి తంగేడుచెట్ల శిఖరాలనిండా ఎర్రని పచ్చని పూవులావరించి ఉంటాయి. సూర్యదేవుడు సాజూకుగా మందహాసం చేస్తాడు. అట్టే భయంలేకుండా ఉదయం సూర్యుని ముఖంలోకి చూడగలం. పక్షుల పాటల మాట వేరే చెప్పనక్కరలేదు. లేతచిగుళ్లు మెక్కిన కోకిలలు చెట్లగుబుర్లలో ఎక్కడో దాగి పాటలు పాడుకుంటాయి. చిలుకలు ఆకాశంలో తేలిపోతూ మనకోసం కాదన్నట్లు వాటల్ని గాలిలో వొదిలేస్తాయి. అయితే యివి బస్తీలవారికి అపురూపం. పల్లెవాసుల్లో చాలమందికి (చెవులుండీ) వినపడవు. ప్రకృతిపరిణామంలోని ఈ ఆనందోత్సాహాల్ని మానవులకంటె పశుపక్ష్యాదులే అధికంగా 'అనుభవిస్తాయట. కవులైతే మేమూ ఉన్నామంటారు. కాని వారు వేపచిగుళ్లు మెసవకుండా, ఇప్పపూదేనె పీల్చకుండా, కాఫీ సిగరెట్లు మాత్రమే పీల్చివాడతారు కాబట్టి, ఆ కావ్యం వేరు ఈ కావ్యం వేరు అవుతాయి.

నిజానికీ పండుగ నవయౌవనంలో అడుగుపెట్టే తరుణవయస్కులదని చెప్పాలి. ఆ దశ మీరినవారికి మధురస్మృతికి వినియోగపడుతుంది. మానవునికి యౌవనోదయంలోని అలౌకికానందం జీవితంలో ఒక్కపర్యాయమే లభిస్తుంది. తెలిసీ తెలియని కొత్త విషయాలు, పూర్తిగా గ్రాహ్యంకాని చిత్రవిచిత్రవిభ్రమాలు, అర్థంకాని ఆసలు, ఇదమిత్థమని తెలియని వాంఛల పరితృప్తికోసం రీతి తెలియని అన్వేషణాలు, అకారణమైన ఆనంద పారవశ్యం, రూపంపొందజాలని భావాలు, భీతికీ, లజ్జకీ, ఉత్సాహానికీ వ్యత్యాసం తెలియని హృదయస్పందనలు, జీవితంలో ఒకే ఒక్కదశలో లభిస్తాయి. ఇంక ఆపైన ఈ మధురానుభవాల్ని అంతరంగంలో పదిలపరుచుకుని తన్మయంపొందవచ్చును. లేక తనలో తాను నవ్వుకోవచ్చును. భూమాతకు మాత్రం వసంతోదయం నిత్యనూతనం. ప్రకృతిలో విజృంభించే ఈ నూత్నచైతన్యాన్ని మనకాపాదించుకోడానికి యత్నిస్తాం.

తెల్లవారకముందే లేచి కాలకృత్యాలు తీర్చుకుని తలంటుకుంటాం. నూతనవస్త్రాలు ధరిస్తాం. వేపపువ్వు, లేతమామిడిపిందెల ముక్కలు, కొత్తబెల్లపుపానకంలో కలిపి అరచేతిలో పోసుకుని అంగిట్లో పోసుకున్నా సరే, నాకివేసినా సరే చిరిచేదు, ఒగరు, తీపి రుచి చూస్తాం. ఇవి పరిపూర్ణవికాసానికి ఆధారమైన తొలిరుచులు.

ధరలు పెరిగిపోయిన ఈరోజుల్లో కొత్తవస్త్రాలు కొని తేవడంతో ఒక తలంటు అయిపోతుంది. పెట్టిన వెలకి ఒగరు ఎక్కువై మగవారికి అంగీట్లో మింగుడుపడదు. వచ్చిన వస్తువు చూసుకున్న ఇల్లాలికి ముఖం మొగ్గలా ముడుచుకుని చెక్కులు పాటల వర్ణరంజితాలౌతాయి. అది చూసి మధుమాస దోషంవల్ల, పొరబడే పతికి ముందుగా పానకం గొంతుకలో దిగజారుతుంది. తరువాత వేపపిందెలు అడ్డుపడతాయి. పండుగ రోజనం అనంతరం సావధానంగా కూర్చొని లోకాన్ని అవలోకించేసరికి, అల్లంత మారాన ఎండలో ఎందుకో తిరిగే ఎదురింటి వారి పడుచు కనిపించవచ్చును. ఆమె భుజాలపైకి సర్దుకుంటున్న వోణీరంగు మందారరంగువలె కనిపిస్తుంది అనుకుందాం.

"అబ్బే. అది ఆకుపచ్చరంగండీ" అంటుంది ఇల్లాలు.

"అదేం. అది మందారరంగే."

"కాదు. సరిగా చూడండి."

కళ్లు నులుముకుని చూస్తే నిజమే ఆకుపచ్చనిరంగే కనిపించిందనుకుందాం.

"వయసు మీరిపోతోంది. చత్వారం అనకుంటాను. సులోచనాలు పెట్టుకోవాలి."

"అబ్బే కాదు. ఋతుప్రభావం కావచ్చులెండి."

"అహ. కాదు. చూడు. అప్పుడే ఎండలు ముదురుతున్నాయి కాదూ. ఎండలోకి చూసేసరికి కళ్లు చిరతలు కమ్ముతున్నాయనుకుంటాను."

"ఏదయితేఏం. కళ్లలో ఇంద్రధనస్సులు మెదుల్తాయిలెండి."

ఆపైన లోకాభిరామాయణం. తరవాత స్వవిషయమై స్వగతం. ఈమారు సంవత్సరాది ఎటూకాకుండా అసందర్భంగా వచ్చింది ఆదివారంనాడు వచ్చికూచుని ఒకరోజు సెలవుని మింగేసింది. అదీ అంత పెద్దవిషయం కాదు. వచ్చివచ్చి జీతం తీసుకున్న తరవాత మూడోవారంలో వచ్చిపడింది. దీనివల్ల ప్రతిమాసం అనుసరించే ఖర్చుఅంచనా తలక్రిందు కావడం. వెనుకఖర్చు తగ్గక పోవడం. పండగఖర్చు అదనంగా పడ్డం. ముందుఖర్చులు అనుకున్నవి సరిగ్గా జరక్క పోవడం. జట్కాలో కూచుంటే ముందు బరువైందని వెనక్కి, వెనక బరువైందని ముందుకి గెంటినట్లు, జరిగిన ఖర్చుకీ, ముందు జరగవలసిన ఖర్చుకీమధ్య జాగా తక్కువై అటో ఇటో ఒరగడం. గుర్రం హరాం చెయ్యడం. ఎలాగో అలా సర్దుకొని సరిగ్గా ఇరుసుమీదుగా కూచోవాలి. ఒక సంవత్సరం అంతమై మరొక సంవత్సరం ఉపక్రమించే ఈ రోజు ఆద్యంతాల మధ్య పడి, నూతనధారణకు కోరుకున్నంత వన్నె కానరాదు.

వికృతిలో ఒకటే చంద్రగ్రహణం. అది చైత్రపూర్ణిమనాడు (ఏప్రిల్ 2). అధికాషాఢమాసం చంద్రుని షోడశకళలు ఇరువదినాలుగుమార్లు కాక ఇరువదియారుమార్లు వికృతికి సమకూరుతున్నాయి. సంక్రాంతి పురుషుడు ఘోరుడు. దున్నపోతువాహనం. తాటిపండ్లు తింటాడట. కొర్రల కూడును ఇత్తడిపాత్రలో తింటాడట ప్రజలకు పీడ అధికంట. రోగాగ్నిబాధలు అధికం. పశువులకు అరిష్టం.

యుద్ధభయం, ప్రజలకు పీడ, ధరల పెరుగుదల, ఒకచోట అతివృష్టి ఒకచోట అనావృష్టి, పెనుగాలి, క్షామం, పప్పులు ఉప్పులు పంచదార నూనెలు మొదలైన వస్తువులకు కొరత. ఇటు వాయవ్యప్రాంతాలకూ, అటు తూర్పుదేశాలకూ అరిష్టంట. ఇవన్నీ కొత్తగావు. రెండో ప్రపంచ యుద్ధంనుంచీ ఈ స్థితిగతులు ప్రకృతిసిద్ధమైపోయినాయి. సంవత్సరఫలమంటూ పంచాంగకర్తలు పనిగట్టుకుని ప్రతిఏటా ఇవి ఏకరువుపెడతారు. పంచాంగకర్తల వరకూ అక్కరలేదు. ఎవరిమటుకు వారు ఫలాలు చెప్పుకోవచ్చును. ఏవి ఉన్నా ఏది లేకపోయినా జనాభా పెరుగుదల తప్పదు. పుట్టిన వారు పుట్టగా, పోయినవారు పోగా ఈ సాలు కనీసం 40 వేలు జనాభా పెరుగుతుంది. ఆహారాదివస్తువులకోసం ప్రజల గోడు తీరదు. మంత్రుల సంచారాలు మరింత జోరుగా సాగవచ్చును. రాజకీయాలు వ్యాపారం ఈడుజోడుగా ఊరేగుతూనే ఉంటాయి. ఆంధ్రరాష్ట్రం రాదు. ఒకవైపున వ్యాపారుల దోపిడీ, మరొకవైపున కమ్యూనిస్టుల దోపిడీ, కొనసాగిపోతూనే ఉండవచ్చును.

హైదరాబాద్ సంగతి ఏమీ తేలకపోయినా సామాన్యవిషయమే పాకిస్తాన్ భారతదేశాలమధ్య తగవులు తరగకపోవచ్చును. అమెరికా రష్యాల మధ్య తలపట్లు, ఇండోచీనా మలయాలలో యుద్ధప్రజ్వలన ప్రమాదం వగైరా వగైరా. ఇంక విరోధికీ వికృతికీ తేడా ఏముంటుంది! మన చూపులో ఉండవచ్చును. పరిస్థితుల్లో మార్పు వికృతిలక్షణంట. ఉన్న పరిస్థితులు ప్రకృతికి చాలావరకు భిన్నంగా ఉన్నందువల్ల మార్పుతో సవ్యం కావచ్చు ననకుంటాం. కాని అదీ కాకపోవచ్చును. ఉన్న వికృతం మరింత విషమించవచ్చును. అయితే మార్పులు అన్నిటా అందరికీ ఒకరీతిగా ఉండవు కాబట్టి అవే కొందరికి సుఖంగా కూడా ఉండవచ్చును. (మరి కొందరికి లేకపోయినా.) వ్యాపారంకిందికీ రైళ్లు పడగొట్టడంకిందికీ మారిపోయిన రాజకీయాల్లో అందరం రాజకీయస్వాతంత్ర్యం అనభవిస్తున్నాం. ఈస్వాతంత్ర్యంవల్ల వ్యాపారులికీ రాజకీయవాదులికీ లాభం. తదితరులకి ద్వితీయం.

విరోధిలో భారతదేశానికి (పాకిస్తాన్ మినహా భరతఖండానికి) డొమినియన్ వ్యవస్థ ఎండుటాకులా రాలిపోయింది. రిపబ్లిక్ వ్యవస్థ కొత్తపువ్వులా పూచింది. చెట్లంతా అలుముకున్న మామిడిగుత్తుల్లా జాతీయతత్వం రాజకీయస్వాతంత్ర్యం విరివిగా వ్యాపించిఉండాలి. కొందరికి వ్యాపించినట్లు కనిపించింది, కొందరికి లేనట్లు కనిపించింది. ఈ సంవత్సరం మామిడిపూత బొత్తిగా రాలిపోయిందంటున్నారు. మన ఆవకాయపంట ఎలా ఉంటుందో తెలియదు.

మగువ మాంచాల

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

శ్రీనాథుని పలనాటి వీరచరిత్రములో మగువ మాంచాల, అనపోతు – మఱపునకు రాని మధురమూర్తులు. బ్రహ్మనాయుని ప్రభుభక్తికంటెను, బాలచంద్రుని బలపరాక్రమములకంటెనుగూడ ముందుగ పాఠకుల హృదయము నాకట్టగలిగినవి మగువమాంచాల మధురహృదయము; అనపోతు అమాయక భక్తి. పాఠకుల సానుభూతి తొలిసారిగా వీరివంకకే మఱలు ననుటలో సందేహము లేదు.

మాంచాల గండువారింటి యాడుపడుచు. ప్రఖ్యాత పలనాటివీరుడు గండు కన్నమనీడు ఈమెకు దండ్రి. రేఖాంబ తల్లి. మాంచాలకు జిన్నతనముననే వివాహము చేసినారు. పలనాటికృష్ణుడు బ్రహ్మనాయుని కుమారుడు బాలచంద్రుని కిచ్చి మహావైభవముగా వివాహమహోత్సవము జరిగినది. వివాహము నాడు.

'.. .. .. ఒక చెనటి విప్రుండు
చూడగాలేక యసూయ పెంపొంద
సౌందర్య మున్నది చానకు సున్న
యెట్లు గావించినా రీ వివాహంబు
అని పల్కెనో యేమొ'—

కాని బాలచంద్రుడు పెండ్లినాటి నుండియే యామె నొల్లలేదు. పెండ్లినాడు కూడ వీరొకరినొకరు సరిగా జూచుకొనలేదు. బాలచంద్రుని మొగము మాంచాల యెఱుగదు. మాంచాలబాలికను బాలచంద్రుడెఱుగడు. వారి యింటికి వీరి యింటికి రాకపోకలు లేవు. బాలచంద్రు డెన్నడు అత్తవారింటికి బోలేదు. మాంచాల గడప విడిచి కాలు కదపని యిల్లాలు. బాలచంద్రుని యత్తవారికి బౌరుషము మెండు. అల్లుడు కూతురి నొల్లక యల్లరిచిల్లరగా దిరుగుచున్నాడని వారు పల్లెత్తుమాట యనలేదు. ఆడుపడుచు నత్తవారింటికి బంపక యింట నుంచుకొన్న నలుగురు నేమైన నని పోవుదురని యలుకలేదు. వియ్యపువారు కలుగజేసికొనకున్నారని కయ్యమాడలేదు. కూతురికి భరణ మిమ్మని గోజాడలేదు. వారు 'అర్థంబు కలవారు.' 'చేసికొన్నవారికి చేసికొన్నంత మహాదేవ'యని వారు ఊఱడి నెందినారు. మాంచాలయు మగని పల్లెత్తు మాట యనదు. ఆమెది ఒక మధురప్రకృతి.

బాలచంద్రుడు మంచి పరువమున నున్నాడు. పరువము కన్నులకట్టి ప్రపంచమే యతనికి గానరాకున్నది. ఇక మాంచాల మాట యేమి? అతనికి దోడుపోయిన యేడుగురు తమ్ములతో నాటపాట లేమో యతడేమో! ఆటపాటలలో నలసి సరసమున కాతడు శ్యామాంగి యింటి కేగును. ఇల్లాలి నొల్లనివారికి వెలయాలు మగనాలు. బాలచంద్రుడు.

'వెలయ భుజించుట వేశ్యగేహమున
విడియంబు చేయుట వెలయాలి యింట
సౌఖ్యంబు పొందుట సానిధామమున'—

ఏడేండ్లుగా బాలచంద్రుని జీవితము సానిదానితోడి సరసముతో జక్కగా సాగిపోవుచునే యున్నది. మాంచాలకు ఒక అచ్చట లేదు, ముచ్చట లేదు. అయ్యో యనువారు అంతకంటెను లేరు.

అపుడు కార్యమపూడికదనరంగములో మలిదేవాదులకు నలగాముని సైన్యములతో సమరము ముమ్మరముగా సాగుచున్నది. బ్రహ్మనాయుడు బాలమలిదేవునికి బట్టము గట్టి బాలచంద్రుని వీటికి గావలి యుంచి మూడునెలలు మితిసెప్పి కులపగ దీర్చుటకై మలిదేవాదులతో గలసి కలని కేగినాడు. వీటిలో బెద్దలంగలు యుద్ధవాటిలో గాటముగా సమరము సాగించుచున్నారు.

బాలచంద్రుడు 'చాలురావుల' కడ బొంగరము లాడుచుండగా వైపుదప్పి యాతని బొంగరము కోమటియన్నమ్మను దాకినది. 'నొప్పి కల్గుటచేత నోరాపలేక' యామె యనరానిమాట లనినది.

'మీయయ్య లెల్లను మించిన బలిమి
చేరి వైరులతోడ శ్రీ యుద్ధభూమి
నుప్పొంగుచున్నవా రుర్విశు నెదుట,
వారిలో గలయు నీవడి కొనవచ్చు'

ననినది. బాలచంద్రుడు రోషపరవశుడై యుద్ధభూమి కేగ నిశ్చయించినాడు. ఐతమ్మ యెంతో వారించినది. బ్రతిమాలినది. బాలచంద్రుడు తన నిశ్చయమునుండి సడలలేదు. ఇక లాభము లేదనుకొని కుమారునితో

'సమరంబునకు నేగు శౌర్యవంతులకు
దల్లి దీవన బొంది తగ భార్యచేత
దీవన గొనిపోవ తేజంబు సుమ్మ
నడచిరి పెద్ద లీ నయమార్గమునను'

అనినది.

బాలచంద్రునిగొంతులో పచ్చి వెలగకాయ పడినది. తల్లి దీవనయయితే నేదో యొకవిధమున గైకొనవచ్చును. కాని 'కులకాంతదీవన గొనుట యేలాగు'నని యతని సందేహము. తన తప్పు తనకు బాగుగా నెఱుకయే. కాని యిపుడు తా నేమి చేయగలడు? ఆడువారిపై నతని కంత సద్భావము లేదు. తల్లిమాటపై తాను వారి యింటికి బోయినపుడిల్లాలు కినిసి తప్పులెన్ను నని, తన కపుడు చిన్నతనమగునని యతని దిగులు. అందులకే–

'పూర్వజన్మఫలంబు పొందికబట్టి
ఆలుమగల జేసె నజుడు మమ్ములను
నా భాగ్య మేమియు నాతి యెఱుంగ
దింతికి దుఃఖంబు హెచ్చుగ నుండె
నపరాధ మధికంబె యమ్మ నాయందు
ఈ సమయంబున నే నేగరాదు'

అని తల్లికి తన మనసు నెఱిగించినాడు. ఐతమ్మకు వ్యవహారములోని చిక్కు తెలిసివచ్చినది. గండువారింటికి బోయి సంగతి సందర్భము లెట్లున్నవో తెలిసికొనివచ్చుటకు తానే బయలుదేఱినది. ఐతమ్మకు గండువారింట ననుకోని సత్కారమే లభించినది. రేఖాంబ యెదురువచ్చి కొనిపోయి కనకపీఠమున గూర్చుండబెట్టినది. 'మము జూడవచ్చుట మా భాగ్య'మనినది. ఐతమ్మకు ఉన్నటులుండి యీ యనుగ్రహము కలుగుటకు గారణమేమో మాంచాలకు దెలియును. మేడపైనుండి దిగివచ్చి యత్తలకు నమస్కరించినది. చందనతాంబూలాదు లొసగి సత్కరించినది. ఐతమ్మ మనసు ఆర్ద్రార్ద్రమైనది. మాంచాల నెట్టులైన నొప్పించినచో – బాలచంద్రుడు గండువారింటికి వచ్చినచో – తనకు రెండుకోరికలు సిద్ధించును. బాలచంద్రుని యుద్ధమునకు బోకుండ నాపుట యొక్క మాంచాలకే చేతనగు పని. మాంచాలయతిలోకసౌందర్యము వీక్షించినతరువాత బాలచంద్రుడు తన ప్రయత్నమునుండి విరమించుకొనునని యామెకు నిశ్చయముగా దెలియును. మాంచాలసౌందర్యముమీద నామె కంత నమ్మిక కలదు. మాంచాలను చూచుట తటస్థించినచో నిల్లాలి నొల్లక యల్లరిచిల్లరగా దిరుగుచున్న బాలచంద్రు డింటిపట్టున నుండి కోడలితో

గాపురము వెలిగించు నని యామెకు కొండంత యాశ. బాలచంద్రుని యుద్ధమునకు బోకుండ నాపుటకు మాంచాల తిరుగులేని దివ్యాస్త్రమని యామెకు దెలిసియే——

'నేరంబు లతనివి నిలుపకు మదిని
రట్టుచేసితి వేని రాడు వా డిటకు
నిన్ను వీక్షించిన నిలువంగ నోపు.'

నని, జరిగినదేదో జరిగిపోయినది. అది మనసున నుంచుకొనక బాలచంద్రుని పిలిపింపుమని ప్రాధేయపడినది.

ఈసందర్భములో మాంచాల కాక మఱి యొక మగువయయియుండినయెడల నైతమ్మకు ఎట్టి సమాధాన మిచ్చియుండునో మనకు దెలియును. మాంచాలమధుర హృదయమిచ్చటనే ముచ్చటగొలుపుచున్నది.

'భోగంబు నొందెడు పొలతులు వారు
చావ నోచినయట్టి సకియను నేను
సరిచేసి యీమాట సభ నెన్నరాదు

* * *

నీ బుద్ధి కెన్నడు నే వెలి గాను
తెరవరో మదిని సందియమును వదలి
పంపుము బాలుని, పగ తీర్చుటకును
పోయెడు పయనంపు బుద్ధి మాన్పింతు.'

నని యైతమ్మకు మాటయిచ్చినది. ఐతమ్మ కోడలికి పుత్తడికమ్మిచీరలు పెట్టి, వియ్యపురాలిచే వీడ్కోలు నంది నిజమందిరమునకు వచ్చినది. చెప్పవలసిన నాలుగుమాటలు చెప్పి బాలచంద్రుని గండువారింటికి బంపినది. బ్రాహ్మణులకు, భట్రాజులకు దాన మిమ్మని మాడలు, చీరలు, మణిభూషణములు పంపినది. బాలచంద్రుడు తిన్నగా మాంచాల యింటికి బోలేదు. మార్గమధ్యముననే కాబోలు శ్యామాంగిగృహమున కేగినాడు. కల్లబొల్లిమాటలు చెప్పి 'ముదివానరమువంటి ముదుసలి' కలిగినది రవంత కాజేసినది.

'ఎన్నినాళ్లగునొకో యీ కార్యసరణి
అన్నపు ఖర్చున నాకు పోకలకు
ఈ సున్న దేమైన నిపుడె యిప్పింపు.'

మని శ్యామాంగి యున్నది రవంత యూడ్చుకొనినది. వట్టిచేతులతో బోవుచున్న బాలచంద్రాదులకు బ్రాహ్మణవర్గ మెదురవచ్చినది. వారికి గోరిన దిమ్మనగా అనపోతు ఆగ్రహపరవశుడై 'కలధన మెల్ల భోగము దాని కిచ్చి' నందులకై యతని దెగడినాడు. బాలచంద్రుడు తలవంచి, చేయునది లేక 'మలిచుట్టు తప్పించి మాణిక్యఖచిత కనకమయాంచిత కటిసూత్ర'ము తీసి వెలమల దోర్నిని చేతి కిచ్చి దాని మూల్యమును బ్రాహ్మణులకు భట్టులకు నిమ్మనినాడు.

బాలచంద్రుడు మహావైభవముగా నలంకరింపబడియున్న గండువారింటికి వచ్చి రత్నకంబళములు పఱచియున్న చవికెలో తమ్ములతో నాసీనుడయినాడు. రాకరాక అల్లుడింటికి వచ్చినందులకు ఇంటిల్లిపాదికి నెక్కడ లేని సంతోషముగా నున్నది. చెలికత్తెలు మాంచాలను చక్కగా నలంకరించినారు. పదములపై పారాణి, కనులయందు కాటుక నీలాలగాజులు నామె కొక క్రొత్త సౌభాగ్యమును దెచ్చిపెట్టినది. అల్లుడు వచ్చినందులకు రేఖాంబ యుప్పొంగిపోయినది. ఆమెయానందమునకు మితి లేదు. ఎవరి సందడిలో వా రున్నారు. కాని మాంచాల కొక గట్టిచిక్కు ఏర్పడినది. ఈవిషయమే యెవరికిని దోచినట్లు లేదు. వారి కెవరికిని ఈవిషయముగూర్చి యాలోచించునంత వ్యవధి చిక్కలేదు. అది పూర్తిగా తనకు సంబంధించినసమస్య. తానితరుల నడిగియైన తెలిసికొనక మాంచాల యెట్లూరకుండగలదు? ఊరకున్న వ్యవహారము చెడును. అందుకే తెగించి తల్లికడకు బోయి——

'అమ్మ! నీ యల్లుని నస లేఱుంగ
ఏరీతి దెలియుదు నే యుపాయంబు
పతి యని యితరుల భావింపగూడ
దాభంగి జేసిన నపరాధ మగును
హాస్యంబు చేయుదు రక్కడివారు
పంపుము గురి సెప్పి పణతిరో!'

యని యడిగినది. రేఖాంబకు వ్యవహారములోని చిక్కు తెలిసివచ్చినది. కాని యామెకు లోకపరిజ్ఞానము హెచ్చు. అందుకు దగిన యుపాయము నే యాలోచించినది.

'నీ వటు పోయిన నిను జూచినపుడు
లేతురు మరదులు లేవడు వరుడు
గుఱుతు సెప్పితి నేగు కూతురా!'

యనినది. మాంచాలకు బట్టుకొన్న సందేహము తొలగినది. తల్లి చెప్పిన గుఱుతు యుక్తిసహముగనే యున్నది. ఇక భయము లేదనుకొనినది. పన్నీరునింపిన గిండిగొని బాలచంద్రు డున్న చవికెలోనికి బోయినది. ఈమెను జూచినదే యామె మఱదులార్వురు లేచి నిలుచుండిరి. కాని అనపోతు మాత్రము 'లేచినపాపంబు లేమకు జెందు'నని లేవలేదు. అప్పుడు మాంచాలకు దిక్కుతోచలేదు. కూర్చున్న యిరువురిలో దనమగడెవడో తనకు దెలియలేదు. అనపోతు బంగారుపసిమిచాయ గలవాడు. అతని జూచి యతడే తన మగడు కాబోలు ననుకొని పన్నీటితో నతనిపాదములు కడుగబోయినది. అనపోతు అదరిపడినాడు. అతనికి విషయము అర్థమైనది.

'నేను బాలుడగాను నిజము మాతల్లి
మఱది బ్రాహ్మణుడను మఱువ నా నామ
మనపోతు'నని తనప్రవర చెప్పుకొని

నాడు. మాంచాల కన్నుగ్రుడ్ల నీరు నిలిచినది. ఆమె హృదయ మపుడొక మహాసముద్రము. ఎంతటి పొంగు వచ్చినను నది చెలియలికట్ట దాటదు. మఱదిని చూచి——

'మఱదియో యెఱుగను మగడొకో యెఱుగ
భయ మొంద నేటికి బ్రాహ్మణోత్తముడ'

అనినది. ఈమాటలలో మహాసముద్రమంత యామె హృదయ మిమిడి యున్నది.

'పరిచయమే లేదు పతికిని నాకు
బాలచంద్రుం డిప్డు వచ్చెను గనక
నేను పూర్వమునందు నియమంబుతోడ
చేసిన తప మంత సిద్ధించె ననుచు
హర్షంబు నొందితి నాత్మలోపలను
బాలుడు మ మ్మిక పాయకయున్న
మా భాగ్య మిల నసమానంబు గాదె'

యని యాశించినది. పన్నీరు దెప్పించి మగనిపాదములు కడిగి——

'ప్రాణాంగనల గనవచ్చెడు నప్పు
డితరుల దెచ్చుట యేపాటి నీతి'

యని మందలించినది. ఈమందలించుటలో వీరి నందఱిని గొనివచ్చి నన్నెంతగా చిక్కులలో బెట్టితివి యను భావమును స్ఫురింపదగును. 'ఏకాంతమున నుందము. వీరి నెల్లర బంపివేయుము' అన్న సూచనయు నిందు సూచితము. బాలచంద్రుడు తమ్ములను దొలగియుండు డనినాడు. వారును దమలోదాము నవ్వుకొనుచు బరిహాసముగా నన్నట్లుగానే కర్తవ్యమును గూర్చి——

"కలనిలో నున్నట్టి ఘను లెవ్వరయ్య
యీ సుఖమే దక్క నెవరు నా కేల
అని చూడగూడునా యపకీర్తి వచ్చు"

నని హెచ్చరికచేసి, యేడుజాములదాక మాంచాలతో నుండుటకు బాలచంద్రునికి మితిసెప్పి వైదొలగి చనినారు.

ఇక నక్కడ నున్నది బాలచంద్రుడును, మాంచాలయు. కట్టతెగిన ప్రవాహమువలె మాంచాలహృదయము ఉఱకలు వేయసాగినది.

(31-వ పేజీ చూడుము)

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౨౩

"శ్రీకంఠాయ నమోనమో నతసురజ్యేష్ఠాయ రుద్రాయ లిం
గాకారాయ నమోనమో విగతసంసారాయ శాంతాయ చం
ద్రాకల్పాయ నమోనమో దురితసంహారాయ తే యంచు ని
న్నాకాంక్షం బ్రణుతించు మానవుడు నీవై యుండు సర్వేశ్వరా!"
(సర్వేశ్వరశతకము)

శివలింగ మచ్చట నట్లు తలవని తలంపుగా అద్భుతముగా నుద్భవించినంతనే భక్తుల కప్పుడు కలిగిన యా వేళమునకు మేరయుండునా? ప్రక్కను పోవుచు పండితారాధ్యచరిత్రమునుండి వైజకవ్వ గాథ స్మృతికి తెచ్చిన వ్యక్తి ఎవరో కూడ వారు పరికింపలేదు. పనివారు తమలో నొకడే యది చదివెనేమో యనియు తలంచియుండవచ్చును.

ఆ లింగమూర్తిని జూచినంతనే భక్తులు పలుగులు పారలు దూరమున నుంచిరి. ఆ మూర్తిచుట్టు నున్న మట్టి ఆ సాధనములతో త్రవ్వినచో లింగమూర్తికి దెబ్బ తగులదా? అందుచే వారు దాని చుట్టునున్న మట్టిని చేతులతోడను వ్రేళ్లతోడనే పెకలింప సాగిరి. లింగమూర్తిరూపము ఎక్కువెక్కువగా ప్రత్యక్ష మగుచుండెను. అదియును తెల్లగా ప్రకాశించుచున్న జ్యోతిర్మయ మగు స్ఫాటికలింగము! అందులో చుట్టు నున్నవారి మూర్తులు ప్రతిఫలించుచు సహస్రలింగమూర్తిగనే భాసించుచుండెను.

"ఈ మహాలింగమూర్తిని జైనహతకులు దొంగిలి తెచ్చి తమ నేమినాథవిగ్రహముక్రింద కుసిరాయిగా ఉపయోగించినారా?— వీరి నేమి చేసిన పాపము లేదు!—" ఇట్టి రోషవచనములు వారు సాగించిరి. కాని యా మహాలింగముచుట్టు నున్న మట్టి తొలగించుటలో వారికి రోషావేశము నొందుటకుగూడ తీరిక లేకపోయెను.

ఆ శివలింగము చాలభాగము బయటపడినది. అట్లు లింగోద్భవమైన కాలముననే సరిగా ఒక నూతనపురుషుడు వచ్చి, 'శ్రీకంఠాయ నమో నమో—' ఇత్యాదికపద్యమును పఠించుచు ఆ స్ఫాటికలింగమున కతిభక్తితో ముమ్మారు ప్రదక్షిణ మొనర్చి సాష్టాంగదండప్రణామ మాచరించెను. అతడు లింగబలిజలలోనివాడు కాడు. సపతులలోనివాడును గాడు. రాజపురుషులలోనివాడు గాని రాజభటులలోనివాడు గాని కాడు! దారిన బోవుచు వైజకవ్వకథ భక్తుల స్మృతికి దెచ్చిన వ్యక్తి యతడే! ఆతడు చూచినంతనే ఆరాధ్యబ్రాహ్మణుడుగా కనిపించుచుండెను.

అతని యాకారమే చూపర నాకర్షించుచుండెను. ఎరుపు కలసిన పచ్చని శరీరచ్ఛాయ, విశాలము లగు నాతని కన్నులు అర్థనిమీలితములై అనవరతశివధ్యానమును వ్యక్తము చేయుచున్నవి. అతని శిరస్సునను కంఠమునను బాహువులను కరములను రుద్రాక్షమాలలు భూషణములుగా విరాజిల్లుచుండెను. దేహమంతయు విభూతిరేఖలు తీర్చియున్నవి. అతని విశాలవక్షఃస్థలముపై బంగారు కవచమున ప్రాణలింగమూర్తి వ్రేలుచు ప్రక్క నున్న బ్రహ్మసూత్రములతో నొరయుచున్నది. ఒకానొక విలక్షణ మగు దివ్యతేజస్సు అతని దేహమున తొణికిసలాడుచున్నది.

ఆ యారాధ్యదేవుని జూచినంతనే అక్కడి భక్తులకు జంగమరూపమున అవతరించిన సాక్షాత్తు శివుడే ఇత డనిపించెను. భక్తులందరు శివలింగమునకు మ్రొక్కువారును ఆ యారాధ్యదేవునకు మ్రొక్కువారును మరల శివలింగమునకును మరల నారాధ్యదేవునకును మ్రొక్కువారునుగా నుండిరి. సమీపమున నున్న కూపములనుండి భక్తులు కుంభములతో జలము తెచ్చి యా యారాధ్యదేవున కందీయ మొదలిడిరి. ఆత డాఘటము లందుకొని శతరుద్రీయము మంద్రగంభీర స్వరమున జెప్పుచు లింగాభిషేకము కావింపసాగెను.

అట్లు భక్తు లెన్ని ఘటములు తెచ్చినను అవి తీసికొని విసుగు విరామము లేక యా జలము లభిషేకించుచునే యుండె నాతడు. సహస్రాధికముగా ఘటములు తెచ్చి యాతని కిచ్చిరి. రెండుచేతుల రెండు ఘటము లందుకొని అందలి జలములతో నాత డాలింగము నభిషేకించుచునేయుండెను. అతనికి బడలికయే లేదు. ఘటములోని నీ రైపోనిది ఎత్తిన చేయి క్రిందికి దింపడు. నీ రైపోయినపిమ్మట ఒక్క క్షణమైనను ఆ కుంభము తన చేతిలో నుంచుకొనక ఇచ్చివేసి మరియొక టందుకొని యభిషేకించును. ఇన్ని ఘటము లందుకొనుచున్నను అతని చేయి ఇంచుకంతయు కంపింపదు. అవి బాహువులా, ఇనుపకమ్ములా? దేహము సొలయదు. పైపెచ్చు క్షణక్షణమును బాహువులలో శక్తి యెక్కువగుచున్నట్లు తోచుచుండెను. తేజస్సును అతిశయించుచుండెను. సాక్షాత్తు శివసన్నిధానములో శివార్చనలో భక్తులకు దేహభాన ముండునా? అభిషేకజలము

ప్రవాహములు కట్టి యా త్రవ్వుచున్న యగడ్తను ఇప్పుడే నింపివేయుదునా యనిపించుచుండెను.

అంతలో భక్తులకు పూజచేయ నిచ్ఛ జనించినది. జనసమూహములలో నీ మార్పు లెట్లుదయించునో చెప్పలేము. అనేకకోట్ల సూక్ష్మజీవులు కలసి మనుష్యదేహమై ప్రత్యేకవ్యక్తిగా కనిపించుట లేదా? అట్లే అనేకజనులు కలసినప్పుడు ఆ సమూహమే ఒక మహాపురుషుడుగా వ్యక్తిత్వము నొందునేమో? ఆ సమూహపురుషునికి నూతనేచ్ఛలు జనించును. ఆ సమూహములోని వారందరు ఆ సంఘపురుషేచ్ఛలు నిర్వర్తించు నంగములుగా మారిపోవుదురు.

పూజ చేయవలె నని యా సమూహపురుషునకు ఇచ్ఛ జనించినంతనే ఎక్కడనుండి తెచ్చిరోగాని, వివిధగంధములు పసుపు కుంకుమము పుష్పములు అందీయసాగిరి. వచ్చినవివచ్చినట్లా యారాధ్యదేవుడు వానితో నా శివలింగము నలంకరింపసాగెను. అతడప్రయత్నముగనే అవి లింగమున కర్పించును. కాని యవి యొక మనోజ్ఞరూపమును దాల్చి లింగమూర్తి నలంకరించెను.

అంతలో భక్తులు ధూపములు దీపములు నందీయసాగిరి. ఆ యారాధ్యుడు అవియెల్ల శివున కర్పించెను. ఒక్కొక్క యర్చన జరుగుచున్నకొలది శివలింగమునకును ఆ యారాధ్యదేవునకును ఒక్కొక్క కళావిశేష ముదయించుచుండెను. అంతట నైవేద్యములు రాసాగెను. ఎన్ని విధముల ఫలములు, ఎన్ని పళ్లు? లెక్కలేదు. వచ్చినవి వచ్చినట్లెల్ల అతడు అవి భవునకు నివేదించి ప్రసాదము భక్తులకు పంచిపెట్టసాగెను.

ఇట్లు కోలాహలముగా శివపూజ సాగెను. ఇన్నాళ్లు నెన్నడు నేమినాథవిగ్రహమున కింత వైభవముగా పూజలు సాగియుండలేదు!

కాని అంబదేవున కిప్పుడు మరియొక చిక్కు వచ్చెను. ఈ శివలింగ మిచ్చటనే ఉన్నచో రాజాజ్ఞప్రకారము అగడ్త పూర్తియగు టెట్లు? ఇందర కింత యావేశముగా ఉన్న వీడు దానిని తొలగించుట సాధ్యమా? అదియు గాక స్వయముగా నంబదేవుడును గొప్పశివభక్తుడు. వారివంశములో అనూచానముగా శ్రీశైల మల్లేశ్వరుడు కులదైవముగా నుండెను.

అంబదేవుడు కొంతతడవు చింతించెను. సదాశివుని హృదయములో ధ్యానించెను. ఒక్క యూహ అట్టె అతనికి స్ఫురించెను.

వెంటనే అంబదేవుడు తన పై యుత్తరీయమును తీసి నడుమునకు కట్టెను. అపై నాతడు వినీతుడై యా లింగమునకును ఆ పూజ్యపురుషునకును ప్రదక్షిణ మొనర్చి సాష్టాంగదండప్రణామ మాచరించెను. అందరును వినయవినమ్రులై దూరము తొలగి నిలుచుండిరి. అంబదేవుడు లేచి భక్తితో నా పుణ్యపురుషుని బ్రశ్నించెను.

"స్వామీ, మీరు నాకు జూడ ప్రత్యక్షమైన శివాకారమున గనుపించుచున్నారు. మీరు మానవులయినచో మీ నామధేయము సెలవిత్తురా?"

"అన్నమయ్య యందురు."

అంబదేవుడు: "మీ గ్రామము?"

అన్నమయ్య: "మును గోదావరీతీరమున పట్టిసము. ప్రస్తుతము పల్నాట పత్రశాల నివాసము!"

అంబదేవుడు ద్విగుణీకృత మగు గౌరవముతో, "సర్వేశ్వర శతకము చెప్పిన యథావాక్కుల అన్నమార్యులు మీరే యని యూహింపవచ్చునా?" అని యడిగెను.

ఆ పుణ్యపురుషుడు అవు నన్నట్లు చిరునవ్వు నవ్వుచు నిట్లనెను. "మొదలనుండి 'యథావాక్కుల' అనునది మా ఇంటిపేరుగా లేదు!"

అంబదేవుడు: "ఏమైన నేమి? మీరు యథావాక్కుల వారే! మీరు వైజకవ్వకథాభాగము చదువగానే ఈ జైనవిగ్రహపీఠములోనుండి ఈశ్వరు డుద్భవించినాడు. వైజకవ్వవాక్కుల నుద్భవించిన ఈశ్వరుడు వైజనాథు డయినట్లే మీ వాక్కులు సత్యముచేయ నవతరించిన ఈ లింగదేవుని అన్నమేశ్వరు డని పిలుచుటకు మా కనుజ్ఞ యిత్తురా?"

అన్నమారాధ్యులవారి నామమును వారి సర్వేశ్వరశతకమహత్త్వమును అక్కడ నున్న భక్తులు పలువురు వినియుండిరి. అతడా శతకములో పద్యములు ఒక్కొక్కదాని నొక తాళపత్రముపై వ్రాసి కృష్ణాప్రవాహమున వేసి ఎదురీదివచ్చిన పత్రములు గ్రంథముగా గ్రుచ్చుచు అట్లు పత్ర మేదేని ఎదురీది రాకున్న గండగత్తెర వైచుకొని కంఠము తెగవేసికొనుటకు కఠోరప్రతిజ్ఞ చేసి చెప్పిన శతకము ఆ సర్వేశ్వరశతకము! ఇప్పటి కాత డది వ్రాసి పదునారేళ్లయినది. ఆ ప్రతీతి యానాడు రాజ్యమంతట భక్తలోకములో మారుమ్రోగియుండెను. ఆయనయశస్సు ముందే దశదిశలు ప్రాకియుండుటచే నా మహానుభావుడే ఈ నా డిట్లిక్కడికి దయచేసినాడని తెలిసినంతనే భక్తులకు కలిగిన యద్భుతాశ్చర్యములు ఏమని వర్ణింపగలము! ఆ మహామహుని వా రెంతగా అర్చించిరో చెప్పనెట్లు?

అంబదేవుడు "తమ పాదవిన్యాసముచే ఈ ఏకశిలాపురము పవిత్రముచేయుటకు నిమిత్తము ప్రశ్నింపవచ్చునా?"

అన్నమారాధ్యులు చిరునవ్వు నవ్వెను. "సర్వేశ్వరేచ్ఛ!" ఈ మహాలింగమే నాకు కలలో కానుపించి నన్నిటు లాగికొనివచ్చెను! ఇటు వచ్చువరకు నాపై పెద్ద బరువున్నట్లు తోచినది!"

ఒక్కమారుగా ఆ మాటలకు భక్తులలో జయజయనినాదములు పిక్కటిల్లెను. అంబదేవు డిట్లు విన్నవించెను.

"ఆరాధ్యదేవా! ఈ అన్నమేశ్వరునికి దివ్యాయతనము కట్టింప స్వయంభూదేవాలయసమీపమున వెంటనే సర్వసన్నాహములు గావింతును. అందు కనుజ్ఞ యిత్తురా?"

ఆ కూడిన జనములో కొందరికి ఆ శివలింగ మక్కడనుండి తరలించుట కిష్టము లేదు. ఇత డొక స్వయంభూతేశ్వరుడు! ఇట్టి మహాలింగమును కదలించుటా? కదలింపదలచినను మనుష్యమాత్రుల కది సాధ్యపడునా?

యథావాక్కుల అన్నమయ్యమాత్రము మాటాడలేదు. కరములు మోడ్చి ఆ శివలింగమునకు నమస్కరించుచు నాతడించుక తడవు ధ్యాననిమీలితలోచనుడై యుండెను. అందరును అన్నమయ్యవంక తిలకించుచు మౌనముగా నుండిరి. అంతటి జనసమూహమునను ఒక్కరును సడిచేయలేదు.

(29-వ పేజీ చూడుడు)

★

సూర్యకాంతి

"సావేరి"

★



పాడు ఆలోచన్లతో మనస్సంతా పాడై పోయింది. అట్లాగే బలవంతంగా కళ్లు మూసుకుని కునుకుతీస్తున్నాను. నా ప్రక్కనే చాపకి కరుచుకుని అడ్డంగా పడుకున్న మా అన్నయ్య ఇంగ్లీషులో ఉపన్యాసమిస్తున్నాడు. రేపు సాయంత్రం జరగబోయే స్కూలువార్షికోత్సవసందర్భాన.......... కాళ్లూ చేతులూ తన్నుకుంటున్నాడు. చాపకి రెండో చివర్న మా మామయ్య పళ్లు కొరుకుతున్నాడు.

ఏం చెయ్యను. భయం వేసింది. చిన్నవాణ్ణి అట్లాగే పడుకున్నాను. నిద్ర పట్టిందేమో, తెల్లవారిందేమో వంటగదినుండి కెవ్వుమని చెల్లెలి కేక విన్పించింది. అదిరిపడ్డాను. నాతోపాటు మేలుకునేవున్నారేమో - నేనూ మా మామయ్యా, అన్నయ్యా ఒక్కసారే లేచాము. ఏమి ఉపద్రవం వచ్చిపడిందోనని గబగబా పరుగెత్తుకుంటూ మా అమ్మా చెల్లెలూ, పడుకునివున్న వంటగదిదగ్గరికి పోయాము. కుక్కిమంచంనుండి క్రిందపడి మోచేతులు పగిలి రక్తం కారుతున్న చెల్లెలు వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"అమ్మ అమ్మ అమ్మ - అమ్మ ఏది?"- అని ప్రశ్నిస్తున్నది.

గాభరాపడ్డాము. ఒకరి మొఖాలొకరు చూచుకున్నాము. ఏమి సమాధానంచెప్పేది?

వంటగదిలో అలికిడయ్యింది, వంట సామాన్లని ఎలికలు దొర్లిస్తుంటే అదిలించడానికి అమ్మ వంటింట్లోకి వెళ్లిందేమో - అనుకున్నాము. వెళ్లి వెతికాము. లేదు. అమ్మ కన్పించలేదు. భావిలో దూకిందేమో. అనుమానం వచ్చింది. భయం వేసింది. మమ్మల్నందర్నీ వదిలిపెట్టి ఇంత అకస్మాత్తుగా అమ్మ ఇట్టి అఘాయిత్యానికి వడిగడుతుందా? తెలియదు. చిన్నవాణ్ణి. ఏమీ తెలియదు. చెల్లెల్ని భుజంమీద పడేసుకున్నాను. కానీ అమ్మని దేవులాట్టానికి, ఆ ఊహని మరొకరికి చెప్పడానికి ఒకరొకరము భయపడ్డాము.

"అమ్మ తాతయ్యగారింటికి వెళ్ళింది, ఇప్పుడే వస్తుందమ్మా. ఊరుకో. అలా ఏడిస్తే అబ్బి పట్టుకుపోతాడు—" చెల్లెల్ని సముదాయిస్తున్నాము. ఎంతకీ వినటం లేదు. ఏడుపు మానడం లేదు. దేవుడా, ఏమిటీ ఖర్మ. ఎన్నాళ్లీకష్టాలు. కనీసం వెతకడానికూడా ఇంట్లో దీపం లేదు. ఉన్న ఆ ఒక్క ఆముదంప్రమిదా ఎప్పుడో కొడిగొట్టి పోయింది. కిరసనాలు లేదు. ఇంట్లో పంచదార లేదు. ఐనా పోయేకాలం కాకపోతే బీదవాడికి ఇన్ని ఆలోచనలు ఎందుకు! కోర్కెల్ని చంపుకోరాదూ! ఎప్పుడైనా హోటల్లో కాఫీతాగే అదృష్టమేగనక వుంటే అక్కడే ఎవరూ చూడకుండా - చాటుగా ఒక చెంచాడు పంచదార బొక్కితే సరిపోదూ! ఐనా మనవి గొంతెమ్మకోర్కెలుగాని, బీదవాడికి పంచదారా కిరసనాలూ ఎక్కడనుంచి వస్తాయి?

అన్నయ్య స్కూల్లో అటెండరు. ఉపవ్యాసాన్ని ఒక కళగా తీసుకొని ఉపాసిస్తున్నవాళ్ళల్లో ఒకడు. చాలీచాలని జీతముతో, కుటుంబభారంతో క్రుంగిపోతున్న భారతీయుల్లో ఒకడు. పెళ్లీ పెడాకాలూ లేక అవస్తపడుతున్న మా మామయ్య...

*   *   *   *

మధ్యాహ్నంవరకు చూశాము. అమ్మజాడ తెలియలేదు. పాతికేళ్లనుండి మాయింటి మొఖం చూడని తాతయ్య వచ్చి, ఆపూట వాళ్ళయింటికి తీసుకవెళ్లాడు. మాకు తెలుసు, వాళ్ళ సంసారంకంటె ఒకరకంగా మాదే మెరుగని. ఒకపూట తినీ ఒకపూట తినక...

చెల్లెలు మాటిమాటికీ అమ్మని అడుగుతుంది. దిగులుపడుతుంది. అమ్మనిగురించి ఏ క్షణాన ఎట్టి దుర్వార్త వినాల్సివస్తుందోనని కుమిలిపోతున్నాము. ఆ పూట అన్నం తినలేదు. సయించలేదు... బలవంతంమీద తిన్న చెల్లెలు, డోకు వచ్చి, జ్వరం వచ్చి, మనస్వరంతితప్పిపడిపోయింది. ఏమీతోచదు. చెరువుగట్టుమీద విస్తుపోయి కూర్చున్నాను.

అమ్మ ఏమిటా మమ్మల్ని నట్టనడిచీకట్లో వదిలి వెళ్లిం దేమిటా అని. ఎక్కడికి వెళ్లింది? ఇన్నేళ్ళనుండీ ఈ సంసారాన్నీ, ఈ సరుకులూ బరువులూ లాడు చేడూ, కష్టాల్నీ ఈదుకొస్తున్న అమ్మ ఎక్కడికి వెళ్లినటు.

నాన్నని చూడటానికా. నాన్న ఇంటిపట్టుకి రావడం మానివేసి నెల్లాళ్లయింది.

అవును. ఆయన్ని చూస్తే కడుపునపుట్టిన బిడ్డలే ఈసడించుకుంటారు. పైనబడి కొట్టబోతారు. దరిద్రాన్ని తిని బ్రతుకుతున్న కొడుకులు. ఇంక నాన్న అట్లాంటి గడపనెలా తొక్కుతాడు?

అప్పటికీ ఎవరికీ తెలియకుండా ఏ అర్ధరాత్రో వచ్చి చెల్లెలి చేతిలో రూపాయి పెట్టిపోతాడు. ఆ విషయం ఎవరికీ తెలియకుండా దాస్తుంది, అమ్మ. దిగులుపడుతుంది. మామయ్యకి కోపం వస్తే మనిషి కాడు. ఊరుకోడు. అమ్మకి భయం. చెల్లెలు ఒట్టి పిచ్చిది. అన్నీ చెబుతుంది. ఐనా అంత చిన్నతనంలో కుళ్లిపోయిన మనస్తత్వాలని చెల్లెలు ఎలా అర్థం చేసుకోగలదు? చెబుతుంది. రోజల్లా చెబుతుంది. తనకి నాన్న కనపడ్డాడని, రూపాయ కాసు యిచ్చాడని. పిచ్చిపిల్ల అన్నీ చెబుతుంది. ఈ భూమ్మీద పడినందుకుగాను ఇతరుల భయపడి నీవు నీ ప్రేమను చంపుకోవాల్సి వుంటుందని చెల్లెలి కేమి తెలుసు.

నాన్న యిప్పుడు మాకు రెండువందల మైళ్ల దూరంలో వున్నాడు. జూదంలో ఓడిపోయాడనీ, తప్పతాగితే పట్టుకుని జైల్లో పెట్టారనీ, రాజమండ్రి పంపారనీ ఊళ్లో పరిపరివిధాల చెప్పుకుంటున్నారు. అంత దూరంలో వున్న నాన్న విషయం మా కెలా తెలుస్తుంది. ఇంతవరకు పరాయి నూరైనా వెళ్లని అమ్మ అంతదూరం వెళ్తుందంటే ఎలా నమ్మను?

పూలు, తల్లీ, చెప్పుకింద పూలు.

*   *   *   *

ముప్ఫయ్యేళ్ల మామయ్య, పనీపాటలూ లేని మామామయ్య. పెరిగి పెద్దయినతర్వాత చెల్లెల్ని చేసుకుని సుఖపెడతాడుగదా అని మా అమ్మఆశ. అందుకు మా మామయ్య ఏమన్నా లోపల్లోపలే ఏడ్చి, పడివుంటుంది గాని, పైకి ఒక్కమాటా పెకలడానికి వీల్లేదు.

పసివాళ్లమే అయినా మూర్ఖులవలె అన్నీ చూస్తూ వూరుకోవాల్సిందే తప్ప, అన్నీ తెలిసికూడా అందరివలెనే సుఖంగా బ్రతుకుతున్నట్టు అందరికీ కన్పించడంతప్ప, బీదవాళ్లు ఏం చేయగలుతారు. డబ్బు లేని వాళ్ల మాటకి చెలామణీ ఎక్కడ. చెల్లెది ఎక్కడ—

మనం వెనకటి జన్మానికి పుణ్యం చెయ్యలేదు. పూజా పునస్కారాలు చెయ్యలేదు. సుఖాలకి నోచుకోలేదు.

వైధవ్యం చెందిన మనస్సులతో దుఖాలు అనుభవించడానికే పుట్టాము అంతే. అన్నీ అనుభవించాల్సిందే. అంతేగాని, నోరు విప్పకూడదు. మాకు ఇది కావాలి - అని అడగకూడదు. అది మర్యాదస్థుల లక్షణం కాదు. మన ఖర్మ అనుకొని మనమటుకి మనం శాంతంగా గట్టుగా కాలాన్ని వెళ్లదీయడమే మనం ఈలోకంలో చేయాల్సింది.

అర్థం కాదు. చిన్నవాణ్ణి. ఒట్టి మూర్ఖం తప్ప, నామీద నాకు అభిమానం తప్ప, ఏమీ అర్థం కాదు. భయం తప్ప, డాంబికం తప్ప, ఏమీ చేత కాదు. ఏం చెయ్యను? కూడు పెట్టని ఈచదువుల్తో ఎలా బ్రతికేది?

ఇప్పుడు అమ్మగనుక లేకపోతే మా గతేం కాను. మమ్మల్ని చూసేవాళ్లు, నవ్వించి కవ్వించి, కష్టాల్ని మరపించి, కడుపులో పెట్టుకుని లాలించేవాళ్లు మా కెవరున్నారు? కిఇంక మేము దిక్కూ దివాణమూ లేకుండా పరాయిపంచన పడి బ్రతకాల్సిందేనా. ఏం చేయను నేను?

అమ్మ పోవడం అలా వుంచి, మామయ్య అమ్మని తిట్టే తిట్లకు ఒళ్లు కంపర మెత్తిపోతున్నది. లోకువ. గత్యంతరం లేదు. ఇంత లోకంలో మామీద ఇంత కనికారం చూపించేవాళ్లెరి? ఏం చేసేది, మరి.

ఈ హిందూదేశంలో పుట్టినందుకుగాను, పేదసంసారాలు ఆడుబిడ్డల్ని కన్నందుకుగాను కుళ్లి కునారిల్లిపోవాల్సిందే కాని, నోరు విప్పకూడదు. ఇది శాపం. నల్లటి చిక్కటి సరీసృపాల్లాంటి శాపం ఇది.

కానీ మా అమ్మ తన నలభయ్యోయేట మతిభ్రష్టురాలయిందని - కొడుకునై వుండీ, ఆమెని నా చిన్ననాటనుండీ ఎరిగివుండి ఎలా అనుకునేది? అనుకోకుండా నన్ను నేను ఎలా వంచించుకునేది. ఐనా ఇందులో అనుకోకపోవడానికి ఏముందిగనక.

అవును. ఇట్టి బాధలవల్ల ఆమెమనస్సు విరిగిపోయింది. ఐతే అమ్మ ఇంక తిరిగి రాదా మమ్మల్ని విడిచిపోయి, మమ్మల్ని ఎలా మర్చిపోగలదు? సంసారాన్ని త్యజించడం అంత సులభసాధ్యమా? ప్రేమనీ వాంఛల్నీ తెగతెంపులు చేసుకోవడానికి సర్వసంగపరిత్యాగం చేసి సన్యాసుల్లో కలిసిపోవడానికి మనిషి కెంత కరుకుతనం వుండాలి.

ఐతే ఇంట్లో ఏ పోట్లాటలు మనస్పర్థలు - ఏ జాతరా లేదుగదా. మరి ఆవిడ ఎందుకు వెళ్లిపోయింది.

ఇవాళ తెలుసుకుంటున్నాను. తల్లి వదనం రోజురోజుకీ విచారగ్రస్తమైపోవడం గురించి. కళావిహీనమైపోవడంగురించి. రోజులోజుకీ కృశించి, పిచ్చిదైపోతున్నదని. కానీ మావల్ల ఏమి అవుతుంది. కడుపునిండా కూటికి నోచుకోనివాళ్లు ఏం చేయగల్గుతారు. అమ్మ మావల్ల, మా అప్రయోజకత్వంవల్ల మాగురించి ఎన్ని బాధల కోర్చేది. ఎన్ని కష్టాలని పడుతుంది. కలకాలం కష్టాలు కాపుర ముండవని నిన్నూ నన్నూ మోసగిస్తా రెందుకు? కడుపునిండిన మాటలు చెబుతారు ఎందు కని!........ అమ్మకి ఇప్పటికైనా మా జంఝాటం వదలడంవల్ల, ఇప్పటికైనా ఆమె ఎక్కడ వున్నా, కొంత సుఖంగానైనా వుండగలిగితే అదే పదివేలు మాకు. అదే పదివందల లక్షల వేలు, మాకు.

(33-వ పేజీ చూడుడు)

ఆల్ఫాన్జో బెర్టిలన్

(ఫ్రాంన్సుదేశపు ప్రఖ్యాత అపరాధ పరిశోధకుడు)

అపరాధపరిశోధకపు కథలంటే, సామాన్యపాఠకులకే కాదు పెద్దపెద్ద పండితులకు కూడా చాలా సరదాయే. అపరాధపరిశోధక కథలకు త్రోవచూపినవాడు మొదట ఎడ్గార్ ఎల్లెన్ పో. ఆ త్రోవలో మార్గదర్శకుడైనవాడు కానన్ డాయిల్. అపరాధపరిశోధకనవలలు ఎడ్గార్ వాల్లేసు మొదలైన ప్రఖ్యాతరచయితలు వ్రాసి, కేవలం పాఠకులకు రంజకత్వమే కాకుండా, పోలీసుశాఖాఉద్యోగులకు ప్రయోజనము కూడా కూర్చిపెట్టారు. కాని ఈ కథలన్నీ కల్పనాచాతుర్యాలుగామాత్రమే నిలుస్తాయి. కథలో కాబట్టి పరిశోధకుడు ఇంత ప్రజ్ఞావంతుడుగా కనబడ్డాడుతప్ప ప్రత్యక్షజీవితంలో కథకుడు అనుకొన్నంతవీలుగా, నిజమైన అపరాధపరిశోధకునికి సంఘటనలు, సూచనలు, కూపీలు, గుర్తుల విశేషాలూ దొరికిరావు. కాబట్టి, సామాన్యఉద్యోగిగానే పోలీసు సి. ఐ. డి. కూడా ప్రజల దృష్టిలో ఏవిధమైన ప్రజ్ఞ లేనివాడుగా కనబడతాడు.

కాని ప్రపంచంలో ఈ వృత్తి నవలంబించిన కొందరు మేధావుల కృషిఫలితంగా అపరాధపరిశోధక వృత్తివిద్య కూడా, యథార్థమైన మానవవిశేషాలతో కూడుకొన్న విజ్ఞానం గల శాస్త్రంగా పరిణతి చెంది, అపరాధపరిశోధకత్వం, అంతంత మేధావులు కాకపోయినా, వృత్తిలోని సామాన్యులుకూడా నిత్యజీవితంలో జయప్రదంగా జరిపేందుకు అనువుగా సంగ్రహించబడి, అందుకు వీలైన పద్ధతులు ఏర్పాటుఅయాయి.

అపరాధపరిశోధకత్వాన్ని ఒకనైమిత్తిక శాస్త్రంగా పోలీసుఉద్యోగులకు అనువుగా మార్చిన మహామేధావులలో బెర్టిలన్ ఒకడు. అల్ఫాన్జో బెర్టిలోన్ 1853 లో ఒక ప్యారిస్ డాక్టరు గారింట ఆయన రెండవకుమారుడుగా జన్మించాడు. ఇతనికి



బాల్యంలో చదువు వంటబట్టకరాలుగాయిగా తిరుగుతూంటే, కులము చెడపబుట్టిన కొడుకు కని ఇంటిల్లపాదీ ఇతన్ని ఈసడింపుగా చూసేవారు. నాలుగుస్కూళ్ళలోనుంచి ఇతన్ని తరిమేశారు. ఆ చదువేదో ఒక కొలిక్కి వచ్చాక ఉద్యోగాలు ప్రారంభించీ, ప్రతిఉద్యోగంలోనూ "ఉద్వాసన" అవటమే. పని అయింది. అయితే చివరికి ఇతన్ని వదిలిపెట్టటానికి వీల్లేని ఉద్యోగం ఒకటి అల్ఫాన్జోకి సంఘటిల్లింది. ఫ్రాంసులో ప్రతియువకుడు నిర్బంధసైనికసేవలో తరిఫీదు అయితీరాలి. ఆ శిక్షణకాలంలో ఇతనికి రాత్రిళ్లు వైద్యపు పాఠాలు చెప్పే ఒకబడిలో చదువుకొనేందుకు కొంత తీరిక కల్గింది. ఏ అదృష్టంవల్లో ఆ చదువులో, మనుష్యుల పుర్రెలనుగురించి చెప్పే.పాఠాలమీద అమితమైన శ్రద్ధ కల్గింది. స్వయంగా పుర్రెలను పరిశోధించసాగాడు. మానవుడి పుర్రెలోఉన్న 222 ఎముకలను, వర్గీకరించి వాట్ల కొలతలు, తీరుతెన్నులూ స్వరూపాలూ, అన్నీ అవగాహనచేసుకో ప్రారంభించాడు. చూడగా చూడగా ఏ రెండు పుర్రెలలోని ఒకేరకపు ఎముకలూ, సరిగ్గా ఒకటే కొలతకలిగి ఉండవనిమాత్రం నిశ్చయించుకొన్నాడు.

1879 నాటికి సైనికశిక్షణ పూర్తి అయింది. పారిస్‌పట్టణపు పోలీస్ ప్రెఫెక్టు హెడ్ ఆఫీసులో, ఒక గుమాస్తాగా ఇతనికి ఉద్యోగం దొరికింది. ఆ ఉద్యోగంలో ఇతని పనిఅంతా ఆరోజున పోలీసుస్టేషనుకు తీసుకొనివచ్చిన నేరస్థుల సాముద్రికవివరాలను రికార్డులో కాపీ వ్రాయటం. అంటే అప్పటికి ఈ నేరస్థులు ఎప్పుడైనా మళ్లీ పోలీసులకు దొరికితే ఈ రికార్డు ఏమన్నా ఉపయోగపడవచ్చునేమో అని నూటికి ఒకవంతు ఆశా, ఛస్తే అల్లా జరగదని 99 వంతులు నిర్లక్ష్యమూ ఉండేది. ఆ తీసికొనే వర్ణనలుకూడా మరీ, మూకకట్టుగా ఉండేదితప్ప ప్రత్యేకతలు తెలిపేవి కావు. కాస్త పేరూ, మొగం మీద రెండుమూడు గీతలో మచ్చలో మార్చుకొంటే, మునుపటి నేరస్థుడే, రికార్డు భయంలేకుండా, పాతకేడీ, అనిపించుకోకుండా తప్పుకొనిపోయే వీలుండేది.

బెర్టిలన్‌కు తన వైద్యపు చదువు మానవఅస్థిపంజరం ఎముకల కొలతల విశేషాలూ జ్ఞాపకం వచ్చాయి. ప్రతీమానవునిలోనూ, 20 నుంచి 60 ఏళ్లదాకా కొన్ని కొన్ని ఎముకల కొలతలు ఏమార్పూ లేకుండా, సామాన్యంగా అట్టే వుంటాయని అస్థిశాస్త్రంలో అతను చదువుకొన్నాడు. ఆ విజ్ఞానవిశేషాలన్నిటినీ బెర్టిలన్ మళ్లీ మళ్లీ పరిశీలించిచూశాడు. ఒక్క "చెవి"లోనే, విశదంగా బైలుపడే 20 విడివిడిభాగాలవల్లా, వేలకొలది పాత నేరస్థులను గుర్తుపట్టవచ్చునని గ్రహించాడు.

పోలీసుఆఫీసులో గుమాస్తాగా, చేరిన ఎనిమిదినెలలకు బెర్టిలన్ ఒక ఛార్టు తయారుచేశాడు. ప్రతీమానవుని అస్థిపంజరంలో మార్పుచెందకుండా ఉండే 11 భాగాలను వర్గీకరించి, ఆవిధానంలో సాముద్రికపు కొలతలను తీసుకోటాన్ని "ఆంథ్రోపోమిట్రీ" అనిపేరు పెట్టాడు. అత్యుత్సాహంతో ఈ నూతనవిధానపు ఛార్టును చేతబుచ్చుకొని, పోలీసుస్టేషను

ముఖ్యోద్యోగి ఆండ్రూదగ్గరకు వెళ్లి, ఛార్టు చూపించాడు. ఆయన తనను అభినందించి పొగడ్తాడని ఆశించాడు. ఆండ్రూ రెండు నిమిషాలు ఛార్టువంక తేరిపార చూచి బెర్టిలన్ మొహాన్నేసికొట్టాడు. “గుడ్డు వచ్చి పిల్లను ఎక్కిరించినట్టు గుమస్తాగిరిలో చేరినవాళ్లుకూడా అపరాధపరిశోధకత్వంలో మాకు పాఠాలు నేర్పేరోజులు వచ్చాయి నీకన్నా మూర్ఖుడు లేడు పొమ్మని” ఉరిమి, గదిమి, గదిలోంచి తరిమాడు.

బెర్టిలన్ తలవాల్చుకొని తన బల్లదగ్గరకు కదిలాడు. మళ్లీ మూడేళ్లదాకా తన ఆంధ్రోపోమిట్రీ విషయం, తన ఛార్టు విషయం ఎవరిదగ్గరా పెదవి కదపలేదు.

మూడేళ్లకు ఆ పోలీసుపై ఫెక్టు(ముఖ్యోద్యోగి) మారాడు. బెర్టిలన్ మళ్ళీ కొంత ఉత్సాహం తెచ్చుకొని క్రొత్త అధికారికి కేమిస్కాసికి తన ఛార్టు చూపించి వినయంతో నిలబడ్డాడు.

కేమిస్కాసి కొంత అభ్యుదయదృష్టి కలవాడు. బెర్టిలన్ వ్రాసిన ఛార్టును ఆమూలాగ్రం పరిశీలించాడు. “బెర్టిలన్ గారూ, మీ కొక్క అవకాశం ఇస్తాను. మూడు నెలల్లోగా, మీ, ఈ ఛార్టుప్రకారం ఒక్క పాతకేడీని మీరు గుర్తించగల్గితే, పోలీసుఅధికారులు మీ పరిశోధనవిధానం ఉద్యోగరీత్యా అమలులో పెట్టేట్టు చూస్తాను. మీకు మూడునెలలే గడువియ్యగలను. మూడునెలల్లో దీనివల్ల ఫలితం లేకపోయిందా, ఈ ఛార్టువిషయం ఇంకెప్పుడూ నోరెత్తకండి. ఏం? మీకు సమ్మతమేనా? అని అడిగాడు.

బెర్టిలన్ ముందు కొంత సందేహించాడు. ఒకసారి నేరంచేసి, ఈవిధానం ప్రకారం గుర్తులూ కొలతలూ ఇచ్చిన మనిషే మళ్లీ మూడునెలల్లోపలే పట్టుబడి ఇక్కడకు వచ్చి, పట్టుబడటం, ఆవిధంగా తన శాస్త్రం మీద నమ్మకం కలగటం చాలా కష్టం. అయినా ప్రయోగానికి ఇంతకంటే ఈమాత్రపు అవకాశమూ దొరకటం కష్టం.

“అయ్యా అల్లాగే ఒప్పుకొంటున్నాను. మీకు చాలా కృతజ్ఞుణ్ణి” అన్నాడు.

ఆనాటినుంచీ తన ఛార్టుప్రకారమే స్టేషనుకువచ్చిన నేరస్థుల రికార్డులు సంగ్రహించసాగాడు బెర్టిలన్. నేరస్థుడిని ఒక తిరుగుడు కుర్చీలో కూర్చోపెట్టడం. (ఈనాటికి ఆ స్టేషనులో ఆ కుర్చీకి ఉంది.) 20×24 అంగుళాల ఫోటోగ్రాపులు తియ్యటం ప్రక్కవాటుగా ఉన్న ఫోటోలు ఎక్కువ తీసేవాడు. అల్లా తీసిన చిత్రంలో, నుదురు, ముక్కు, గడ్డము మొదలైనవి, చాలా నిజాయితీగా కనబడ్తాయని అతని అనుభవం. ఇవేకాకుండా, ఇంకేమైన ప్రముఖంగా కనబడే చిహ్నాలుంటే, అవి కూడా ఫోటో తీసేవాడు. ఆతర్వాత వరుసగా కొలతలు తీసికొనేవాడు.

ఈ భాగాల కొలతలనే ఈనాటికీ (బెర్టిలన్ కొలతలు అంటారు)-తల, కుడి చెవి, ఎడమ చేతి మధ్యవేలు, ఎడమముంజేయి, ఎడమపాదం-వీటి కొలతలు అతి జాగ్రత్తగా సంపూర్ణంగా తీసికొనేవాడు. ఆ నేరస్థుడు ఫైలుకి ఒక గుర్తుకార్డుపెట్టి అందులో ఈ ఫోటోలు కొలతలు, బెర్టిలన్ తయారుచేసిన ఛార్టువిధానంలో, ఎక్కించి, “ఐడెన్టిటీ రికార్డులన్నీ” గదిలో జాగ్రత్తపరచేవాడు. ఈనాటికీ ఆనాడు బెర్టిలన్ మొదలుపెట్టిన అంశాలవారీగానే ఈ రికార్డు తయారుచేస్తున్నారు. ఒక్కొక్క నేరస్థుని రికార్డు, 70 ఏళ్లదాకా అట్టే అట్టిపెట్టి ఉంచుతారు.

బెర్టిలన్‌కు అధికారి ఇచ్చిన మూడు నెలల గడువులో రెండు నెలలు గడిచిపోయాయి. రికార్డులో చేరిన ఒక్క నేరస్థుడూ తిరిగి రాలేదు.

ఇంతలో ఒక నడిసీతాకాలం మధ్యాహ్నంపూట పోలీసుస్టేషనుకు ఒక బలిష్ఠుడైన యువకుణ్ణి లాక్కొని వచ్చారు. ఆ మనిషి తన పేరు “డూపాంట్” అని చెప్పాడు. మనలో రామయ్య, సుబ్బయ్య అన్న పేర్లు ఎంత సర్వసాధారణమో ఫ్రాంసులో డూపాంట్ అన్న పేరు అంత సామాన్యం. ఇది తన ప్రథమ నేరంఅని అతను వాదిస్తున్నాడు. మొదటితప్పిదం అయితే అంత పెద్ద శిక్ష లేదు. కాని రెండవదే మూడోదో అయితే, పెద్దశిక్ష పడకతప్పదు. బెర్టిలన్ తన రికార్డులన్నీ తీసి ఈ నేరస్థుని కొలతలతో సరిచూడసాగాడు. చివరికి ఒక రికార్డు దొరికింది. ఎనిమిదివారాల క్రితం దొంగతనంచేసిన మార్టిన్ అనేవాని రికార్డులో కొలతలు అన్నీ డూపాంట్ కొలతలకు తు, చ, తప్పకుండా సరిపోయాయి.

బెర్టిలన్ ఉద్వేగంతో ఆ ఫోటోగ్రాఫ్‌లను డూపాంట్‌కు చూపి, “అబ్బాయి మార్టిన్! ఈ ఫోటోలు గుర్తించగలవా, కాస్త ముక్కు తీరు మార్చుకోగలిగావుగాని తలపుర్రె ఎముకల కొలతలు మార్చుకోలేకపోయావు. ఇదిగో కొలతలు నువ్వే చదువు” అని చూపించాడు.

ప్రత్యక్షవిషయాలను ఎదుర్కోవలసి వచ్చేటప్పటికి డూపాంట్, విధిలేక మార్టిన్ తనే అని నిజం ఒప్పుకొన్నాడు.

ఈమాత్రం విజయం సాధించగల్గుతానని కూడా బెర్టిలన్‌కు ఆశలు నశిస్తోన్నప్పుడు ఈ అదృష్టం కలిసివచ్చింది. పోలీస్ శాఖ అంతా, ఈ వింతవిధానానికి, ఆశ్చర్యపోయింది. పత్రికలూ ప్రజలూ అంతా ఈ అద్భుతం గ్రహించటానికి బెర్టిలన్ వెంటబడ్డారు. కాని బెర్టిలన్‌కు వీళ్లను చూసే అవకాశం లేదు. తన పనిలో తాను నిమగ్నుడైపోయాడు. పోలీసు ప్రిఫెక్టు కేమిస్కాసి, బెర్టిలన్‌కి ఉన్నతోద్యోగం ఇచ్చి, “ఆంధ్రోపామిట్రీ”ని పోలీసుఅధికారులు ఉపయోగించవలసిన శాస్త్రంగా చేసి, ఐడెన్టిఫికేషన్ (పరిపోల్చటం) శాఖకు బెర్టిలన్‌ని అధికారిగా చేశాడు. మొదటి సంవత్సరంలో 7336 గురు నేరస్థుల బెర్టిలన్ విధానంలో కొలతలూ గుర్తులూ, తీసికొన్నారు. ఈ విధానంప్రకారం వారిలో మళ్ళీ పట్టుబడ్డవారు 49 మంది. రెండవ సంవత్సరంలో మరొక 241 మంది “పాతకేడీలు” ఈ విధానంప్రకారం జైలుకు వెళ్ళారు.

బెర్టిలన్ విధానంలో, అపరాధపరిశోధన సాగించిన విడివిడి కేసులుకూడా చాలా ప్రఖ్యాతిలోకి రాసాగాయి. మార్న్ నదిలో, కుళ్లి వికృతమయిపోయిన ఒక శవాన్ని జాలరులు బైటికి తీశారు. శవపుపుర్రె కొలతలనుపట్టి, బెర్టిలన్ ఆ శవం ఎవరిదో పోల్చగలిగాడు. చచ్చిపోయినవాని పూర్వచరిత్రనుకూడా తక్కిన రికార్డులనుంచి సంగ్రహించగలిగాడు. ఆ రికార్డులో ' దొరికిన విశేషాలనుబట్టి, ఖూనీచేసినవాడెవడో కూపీ తీసి బైలుపెట్టి జైలులో పెట్టించగలిగాడు.

ఇంకోసారి రోలిన్ అనే ఒక తాపీవాడు అకస్మాత్తుగా మాయమయాడు. ఒక శవాన్ని చూసి రోలిన్ భార్య, మిత్రులూ కూడా, రోలిన్ శవమే అని గుర్తుపట్టి చెప్పారు. కాని బెర్టిలన్‌కు తృప్తి కలుగలేదు. ఇంకోగంటకు అంత్యక్రియలు జరుపుతారనగా, శవం కొలతలు తీసికొన్నాడు బెర్టిలన్. ఆ కొలతలనుబట్టి, ఒక ప్రఖ్యాత నేరస్థుని శవమని బెర్టిలన్ గుర్తుపట్టాడు.

(34 వ పేజీ చూడుడు)

నేటి ప్రపంచం:

కాశ్మీర్ సమస్యాపరిష్కారానికి ★ ★ మధ్యవర్తి నియామకం

భారత పాకిస్తాన్ ప్రభుత్వాల సమ్మతి

కాశ్మీర్ సమస్యాపరిష్కారంనిమిత్తం బ్రిటిష్, అమెరికన్, నార్వే, జియన్, క్యూబన్ ప్రతినిధులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భద్రతామండలి ఆమోదించింది. భారత పాకిస్తాన్ప్రతినిధులు ఎవరి మరకుల పైన వారు తమ తీర్మానానికి సమ్మతి ప్రకటించారు.

ఈ తీర్మానంప్రకారం ఒక మధ్యవర్తి నియమించబడాలి. ఆమధ్యవర్తిఆధ్వర్యం కింద కాశ్మీరంనుంచి ఉభయపక్షాలవారు సైనిక దళాల్ని అయిదు మాసాల్లో ఉపసంహరించుకోవాలి. ఈ రీతిగా కాశ్మీరంలో జనవాక్య నిర్ధారణకు అనువైన పరిస్థితులు తేవచ్చునని తీర్మానప్రతిపాదకుల ఆశయం.

తీర్మానంలో ముఖ్యాంశాలు: తమ తమ హక్కులకూ ఆయాప్రాంతాలలోని శాంతి భద్రతలకూ భంగంలేకుండా, అయిదుమాసాల లోగా, జనరల్ మెక్నాటన్ ప్రతిపాదనలను ప్రాతిపదికగా స్వీకరించి, అవసర మనుకున్నచోట ఉభయప్రభుత్వాలకు అంగీకారమైన మార్పులతో, కాశ్మీరంనుంచి సైనికదళాల్ని ఉపసంహరించుకోవాలి.

సైనికోపసంహరణలో ఉభయప్రభుత్వాలకూ తోడ్పడి, ఈ సందర్భంలో ఉభయ ప్రభుత్వాలూ చేసుకోబోయే ఒడంబడికల్ని విశదపరచడానికిగాను ఒక మధ్యవర్తిని భద్రతామండలి నియమించగలదు.

ఉభయప్రభుత్వాలమధ్యనూ సమాధానం చేకూర్చడానికి స్వతంత్రించి సూచనలు చేసే అధికారం ఈ మధ్యవర్తి కివ్వబడుతుంది.

1948 ఆగస్టు 1949 జనవరి మాసాలలో భద్రతామండలితీర్మానాల ప్రకారం కాశ్మీర్ కమిషన్ నిర్వహించిన కార్యభారమంతా ఈ మధ్యవర్తి భరించవలసి ఉంటుంది.

సైనికోపసంహరణ అమలుజరుగుతున్నప్పుడు ఉచితసమయాన్ని చూసి జనవాక్య నిర్ధారకుని కార్యక్రమారంభానికి ఏర్పాటు చేస్తాడు.

మధ్యవర్తినియామకంపై ఉభయప్రభుత్వాల అంగీకారం కుదిరిన ఒక మాసానికి కాశ్మీర్ కమిషన్ రద్దయిపోతుంది.

ఈ తీర్మానంపైన చర్చ జరిగినప్పుడు కొన్నివిషయాలను విశదపరచాలని భారత పాకిస్తాన్ప్రతినిధు లడిగారు. మొదటి నుంచి భారతప్రభుత్వం కాశ్మీరసమస్యపరిష్కారవిషయమై పరిష్కర్తను నియమించ గూడ దని మధ్యవర్తిత్వమే అనుకూలమైనదనీ చెప్తూ వచ్చింది. 1949 డిసెంబరులో భారత ప్రభుత్వవిదేశాంగశాఖ ప్రధానకార్యదర్శి జి. యస్. బాజ్‌పాయ్ మధ్యవర్తి నియామకంవల్లనే సమస్య పరిష్కారం కాగలదని భారత ప్రభుత్వఅభిప్రాయమైనట్లు ప్రకటించాడు. కాని ఎలాగైనా పరిష్కర్తను నియమించి, ఆయా ప్రభుత్వాల సమ్మతితో నిమిత్తం లేకుండా నిర్ణయాలు చేయించాలని బ్రిటన్ అమెరికాలు ప్రయత్నం చేశాయి. ఎడ్మిరల్ నిమిట్జ్‌ను పరిష్కర్తగా అంగీకరించవలసిందని అట్లీ ట్రూమన్ లు భారతప్రభుత్వానికి ఆదేశించారు. కాని భారతప్రభుత్వం ఈ ఒత్తిడికి లొంగలేదు.

తరువాత జనరల్ మెక్నాటన్ చేసిన ప్రతిపాదనలు మధ్యవర్తికి మధ్యవర్తిత్వం



వివిధ ప్రాంతీయ సేనలమధ్య జరిగిన ఆటల పోటీలలో పశ్చిమ ప్రాంతసేనకు 77 పాయింట్లు వచ్చినవి. గెలుపు వారిదే. పశ్చిమ ప్రాంత సేనాని లెఫ్టినెంట్ జనరల్ ఎస్. ఎమ్. శ్రీనగేశ్‌కు సర్దార్ బలదేవ్ సింగ్ ఛాంపియన్‌షిప్ పతకం బహూకరిస్తున్నారు

నెరపడానికి తగిన అధికారాలివ్వక పోవడంవల్లనూ, సైనికోపసంహరణలో ఉభయపక్షాలూ ఏకకాలంలో సైన్యాల్ని ఉపసంహరించుకోవాలని విధించడంవల్లనూ భారత ప్రభుత్వానికి అంగీకారయోగ్యం కాలేదు.

పాకిస్తాన్ ఇంతవరకూ పరిష్కర్త నియామకాన్నే కోరుతూ మధ్యవర్తినియామకాన్ని ప్రతిఘటించింది. మధ్యవర్తిత్వం అంటే ఉభయప్రభుత్వాలమన్ననా అంగీకారం కుదరనిదే నిర్ణయాలు జరగకూడదు. పరిష్కర్త నియమించబడినట్లయితే ఉభయ ప్రభుత్వాల సమ్మతికి విరుద్ధంగా కూడా నిర్ణయాలు జరగవచ్చును.

ఇప్పుడే కొత్తతీర్మానంవల్ల చాలవరకు భారతప్రభుత్వవాదం అంగీకరించబడిందన్న మాట. ఇప్పుడు మధ్యవర్తి ఉభయప్రభుత్వాల మన్ననా సైనికోపసంహరణకి ఒడంబడిక జరగడానికి తోడ్పడాలి. అజాద్ కాశ్మీర్ సైన్యాల సంగతేవో తేలనిదే భారతప్రభుత్వం ఏ ఒడంబడికనూ అంగీకరించ నవసరం ఉండదు. ఏదో కొంతవరకైనా కాశ్మీరంలో సైనికబలాల్ని తగ్గించడానికి మధ్యవర్తి ప్రయత్నిస్తాడు. దీనివల్ల యుద్ధం తిరిగి ప్రజ్వలించే ప్రమాదం తప్పిపోవచ్చును. కాశ్మీరంలో జనవాక్యనిర్ధారణ జరగాలని పాకిస్తాన్ వాస్తవంగా వాంఛిస్తున్నట్లయితే భారతప్రభుత్వంతో ఒప్పందానికి వచ్చి తీరవలసి వుంటుంది.

సైన్యాల ఉపసంహరణకి ఉభయప్రభుత్వాలమన్ననా ఒడంబడిక సాధించడానికి కృషి చేయడం, ఒప్పందం కుదిరిన తరవాత సైన్యాల ఉపసంహరణ సవ్యంగా జరుగుతున్నదీ లేనిదీ అజమాయిషీ చెయ్యడం, తరవాత జనవాక్యనిర్ధారణకు తగిన ఏర్పాట్లుచేసి ఎడ్మిరల్ నిమిట్జ్ ఎప్పుడు కాశ్మీర్ చేరవలసినదీ నిర్ణయించడం, ఇవీ మధ్యవర్తి ముఖ్యకర్తవ్యాలు.

మొదటే సైనికోపసంహరణ గురించి ఉభయప్రభుత్వాలమన్ననా ఒప్పందం కుదరని పక్షంలో మధ్యవర్తి అన్యమార్గాల నన్వేషించవచ్చునని తీర్మానంలో చెప్పబడింది. ఈ రీతిగా మధ్యవర్తికి విశేషాధికారాలివ్వడం పాకిస్తాన్ ప్రభుత్వానికిష్టం లేదు. అంటే ప్లెబిసైట్ (జనవాక్య నిర్ధారణ) జరపడానికి పరిస్థితులు అనుకూలంగా మారవని మధ్యవర్తికి తోచినప్పటికీ అతను అన్యపరిష్కారాలను సూచించవచ్చును. మొత్తానికి, సైనికోపసంహరణలోగాని, జనవాక్యనిర్ధారణవిషయమై గాని రాయబారాలు జరిపి ఉభయప్రభుత్వాలచేతనూ, ఏదో రీతిని కాశ్మీరభవిష్యన్నిర్ణయానికి మార్గం చూపడానికి మధ్యవర్తికి అవకాశం ఉంటుంది. అంటే పాకిస్తాన్ భారతప్రభుత్వంతో సమాధానం చేసుకోక తప్పనిసరి వచ్చిందన్నమాట.

ఇంక కాశ్మీరంలో జరిగితే యుద్ధం, లేకపోతే మధ్యవర్తిద్వారా ఒడంబడిక, అదీ కాకపోతే ప్రస్తుతవిభజన స్థిరపడిపోవడమో జరగాలి.

భద్రతామండలి చర్చసందర్భంలో


(37 వ-పేజీ చూడుడు)




అమెరికా స్కౌట్ సంస్థ ప్రతినిధివర్గంతో అధ్యక్షుడు ట్రూమన్ గోష్ఠి

సింహాచల క్షేత్రంలో, శిల్పవిన్యాసాలు


★




సింహాచల దేవాలయం




269 సం.లో నిర్మించిన స్వర్ణశిఖరం




ఊర్ధ్వకాండము స్థితి ప్రాణంలో మురళీకృష్ణుడు



వరాహావతారం : ముట్టెతో భూభాగాన్ని వహిస్తున్నప్పటి మహావేశచిత్రణం




ఏకశిలారథమున కమర్చిన శిలాశ్వము



శ్రీ కృష్ణదేవరాయలు నిర్మించిన శిలామంటపము




ఏకశిలారథము




రథచక్రముమీద ఖండరించిన శిల్పనైపుణి




ఆకాశధార



ఇంట్లో వ్రవాసామాను, మొదలైన ప్రతివస్తువు శుభ్రపరచేందుకు ఈ సింథెటిక్ సబ్బుపొడి వాడవచ్చును.



ఇంజన్లు, రైలు పెట్టెలూ కూడా డిటెర్జెంటు కలిపిన నీటితోనూ, కిరసనాయిల్ తోనూ తళతళలా మెరిసేటట్టు శుభ్రపరచవచ్చును.




పేపరు తయారీలో, శుభ్రపరిచేందుకు, పేపరుమిల్లులో డిటెర్జెంటుకలిపిన నీళ్ళను పోస్తున్నారు.


సింథెటిక్

మామూలుసబ్బులు తయారు చేయటం అతితేలికే. కొబ్బరినూనె, కొవ్వువంటి నూనెపదార్థము, సున్నం, కాస్టిక్ సోడావంటి కాస్టిక్ వస్తువు, ఈ రెండు ముఖ్యపదార్థాలే మామూలుసబ్బుల తయారీకి అధికంగా అవసరమున్న వస్తువులు. సబ్బుకున్న ముఖ్యప్రయోజనం, నీటితో నురుగు తేలి, ఆ నురుగువల్ల వస్తువులను శుభ్రంచేసే సద్గుణం. ఈ సద్గుణము గల మరికొన్ని రసాయనికపదార్థాలను కూడా ఈ

గత పదిపన్నేళ్లల్లో కనిపెట్టా
ఆర్గానిక కెమికల్సునుంచి
క్రమగల విధానాల
చేయవలసి ఉంటుంది. ?
టిక్ సబ్బుపదార్థా లం
రసాయనాలుకూడా నీ
గును కల్పించి శుభ్రపర
కల్గిఉంటాయి. అయితే
పారిశుద్ధ్యం మా త్ర
పారిశ్రామికంగాఅనేక అ
అనేకవిధానాలలో, శు
మైనచోట వాడటానికి



దుకాణాలు "సింథటిక్ సోప్ పొడి" నీళ్ళల్లో కలిపితే మెలుపొడుగునా
రోడ్డు వేసేముందర శుభ్రపరిచేందుకు చాలుతుంది.




వస్త్రపరిశ్రమలో, రంగుఅద్దకానికిపూర్వం ఈ "డిటర్జెంట్లతో"
బట్టను శుభ్రపరిస్తే, రంగు మరింత బాగాఅంటుతుంది.

సబ్బులు

రు. వీట్లని,
చాలా
తయారు
ల్లని సింథె
గారు. ఈ
త్తో నురు
చే సద్గుణం
ల్లి గృహ
కే కాక
సరాలలో
త్త అవసర
వుతుంది.

పళ్లు, కాయగూరలు, మొదలైన
వాట్లను శుభ్రపరచటం మొదలు
కొని పట్టణాల రోడ్లను, స్ప్రే చే
శుభ్రపరచి నీటుగా ఉంచేటంత పెద్ద
పనివరకూ కూడా వివిధ ప్రయోజ
నాలకు వివిధరకాల సింథటిక్ సబ్బు
పదార్థాలున్నాయి. ఇళ్ళల్లో
చెంబులు తప్పేలాలు మొదలైన
ఈ సబ్బులతో కడిగి ఆర
పెట్టితే, గట్టిగా తోమి గుడ్డతో
మెరుగుపెట్టినవాటికంటె తళతళ

(40 వ-పేజీ చూడుడు)



పొలాలలో చీడపురుగులు పట్టకుండా. ఈ సింథటిక్ సబ్బుపొడి
నీళ్ళలో కలిపి స్ప్రేయంత్రాలద్వారా చిమ్ముతారు.

★ ఉగాది: ★

శ్రీ చిల్లర భావనారాయణరావు

విరోధిలోని అనర్గళమైన
విప్లవశక్తులు విజృంభించగా
అఖండరుధిరారుణకాంతుల
ఉద్ధారకమైన వికృతీ — నా
సుస్వాగత మిదో నీకు —
కాలమహాగ్రంథంలో
కలకాలం మరపురాని
భూతకాలం ప్రసవించిన
పుణ్యపూతనవాబ్దమా ఓ వికృతీ
నా సుస్వాగత మిదో నీకు —
నీ విపుడే ప్రభవించిన పసిపాపవు
నీ కెఱుక లేదు మా స్వతంత్రప్రజల కుతంత్రాలూ - కళ్ళూ గా
గుండెలపై చెయివేసుకొని
నిండు మనస్సులతో బ్రతికే
ప్రజానీక ఆనందమయ అమృతమయ
మధురమధుమాసయామినీ కాలం కాదు నినుకన్నది;
ఓ ఉగాది పసిపాపా
పాపలు పడతులు ముదుసళ్లూ అను
పక్షమైన లేకుండా
చావమొత్తి నెత్తురు లొత్తిన నీ
చాతినీచమానవ రాకాసుల్లో
మండుతున్న కాలమహాగర్భాన్నుండీ ఉద్భవించావు
ఇంకా ఇంకా చెబుతా విను;
రాచకీయ రణరంగంలో
రవినై కవినై పోవాలని
ఆశిస్తున్న ఓ అభాగ్యుణ్ణి నేను
లక్షలాది ప్రజాహృదయాలపై
లక్ష్యంపెట్టి పులకరింపజేసే నా కవిత్వమంతా
నిజం పలకటంవల్ల
నీరసించినరీతి ఉందాం,
ప్రజాహృదయాల్ని
కదలింపదలచిన నా కవితాకలం
నిజం వ్రాయటానికి నిలువలేక
గడగడ లాటాలట యీనాడు!!
నీ వెలుగవు కామాల్లే
బక్కచిక్కిన ఓ ముసలి తాత న్యా
సత్యంతో ఉండమని అనటం ల్ల ఓ
రక్కసిచేతుల్లో పడి
చిక్కని నెత్తురు చిలికా డీధరాతలాన
నీ వింకా పసిపాపవు పాపం!

మా స్వతంత్రానికి
రెండేళ్లకు పైగానే వయస్సు ముదిరింది!
మే మంతా నితాంతస్వతంత్రులం! మరి
ఆవంతైనా బానిసత్వం వప్పుకోము
నీతిః యమబంధాలను త్రెంచేసే స్వేచ్ఛాజీవులం మా
తాహతు నీ కింకా తెలీదు!

చాలినంత కూడు పెట్టలేని
సాక్షాత్తు అన్నపూర్ణ మా తల్లి
చినిగిన కట్టుగుడ్డల్లో
దినదినమూ ఉక్కుయంత్రాల్లో
నలిగిపోయే నరాల్లో
నీరవనిర్నిద్రనిర్ఝర
నిస్సహాయప్రజానీక మొకవంకా!
అసహాయోద్యమంలో
ఆర్థికసహాయం చేసిన అవకాశంతో
అనంతదరిద్రప్రజనెత్తురు పిండుతూ ఇంకా
పెత్తనం చెలాయించే మహాభోగు లొకవంకా
ఆత్మవిచక్షణ లేని నిరక్షరాస్యులందర్నీ
తమ తమ స్వార్థాలకై
విచ్ఛిన్నపంథాల్లో నడిపించి
వినాశనం తెచ్చే ముఠా లొకవంకా
ఇంకా ఇంకా ఎన్నెన్నో
పరదేశీయుల పైశాచికాలు
దేశంలో అల్లకల్లోలంగా
నాశనంచేసే యీ కాలంలో
ఉద్భవిస్తున్నావు ఓ
ఉగాదిపసిపాపా జాగ్రత్త!
ఓ వికృతినవాబ్దమా నీ
మూడొందలరవై రోజుల పొడవైన హస్తాల్లో
అందర్నీ ఆదరించి ఆశీర్వదిస్తావని విశ్వసిస్తున్నా
మా జీవిత మొక నందనచందనవనమై
ఆనందప్రద మైపోవాలని ఆశిస్తున్నా
ఎడతెరపి లేని నీచవర్తనము
ఇంతటనైనా సమసిపోయి
కుతంత్రాలు కుళ్లూ కడిగేసే
నితాంతస్వతంత్రాకాంక్షలు ప్రభవిస్తా యని
ఆశిస్తున్నా ఓ ఉగాదిపసిపాపా
వికృతినవాబ్దమా నా
సుస్వాగత మిదో నీకు —

భారతీయతలోని ప్రత్యేకత

శ్రీ బశిరెడ్డి ఈశ్వరరెడ్డి

మనది ఆర్యావర్తం. తథాగతబుద్ధమహావీరుల ప్రసవభూమి. వ్యాసకణ్వాదులవిఖ్యాత తపోవనం. ఆదర్శోజ్జ్వలస్వరూపులైన శ్రీరామకృష్ణుల క్రీడాక్షేత్రమైన కర్మభూమి. శతసహస్రాబ్దములకు మునుపే యీ పుణ్యభూమిలో సంస్కృతీప్రవంతులు పరాకాష్ఠనొందిన పరిపూర్ణశోభతో ప్రకాశించాయి. సాధనతో .తపస్సుతో పూర్ణతనొందిన దైవస్వరూపులీ దేశమును పునీతంచేశారు. యుగయుగాలుగా అంధకారాచ్ఛాదితములైన ప్రపంచమునకీ పుణ్యభూమియే విజ్ఞానప్రకాశము నందించినది. భౌతికత్వమే సర్వస్వం కాదని జీవితమునంతా పూర్ణత్వసాధనకు వినియోగించిన మానులు నిరూపించినారు. ఊహకూడా అందనంతటి ప్రాచీనకాలములోని భారతీయమహత్త్వాన్ని పాశ్చాత్యులు కూడా తప్పనిసరిగా అంగీకరించినారు. శతాబ్దాలు గతించినా విభవోన్నతమైన సామ్రాజ్యములస్తమించినా నిత్యనవ్యమైన తన ఆదర్శస్వరూపమును విడవకుండా ఉండే ఆదర్శస్వరూపమే భారతదేశం.

భారతచరిత్ర నే విదేశీయుడు పరిశీలించినా యీ దేశంలోని జీవశక్తికి విభ్రాంతుడు కాకమానడు. సహనశక్తి భారతీయతలోని అణువణువులోనా జీర్ణించిపోయినది. వైదికమతాన్నీ మనం కౌగలించుకొన్నాం. అదేవిధంగా వైదికత్వానికీ వైదికహింసకూ పూర్తిగా వ్యతిరేకమై శూన్యస్వరూపమైన బౌద్ధమతాన్ని మనం స్వీకరించాం. అట్లే బుద్ధుని సర్వమాన్యసూత్రములకు విరుద్ధమై కల్మషభూయిష్ఠమైన బౌద్ధాపభ్రంశమును (తాంత్రికమతం)కూడా మనం కాదనలేదు. అసంఖ్యాకములైన మతసిద్ధాంతములన్నిటినీ మన సంస్కారములకు తగినట్లుగా అమర్చుకొన్నాం. చార్వాక కాపాలికుల వికృతక్రీడలన్నిటినీ సహించుకొన్నాం. సభ్యతయే తెలియని విదేశముల బరబరసమూహములన్నీ భారతీయతలో సంశుద్ధమై గుర్తే తెలియకుండా భారతీయప్రవాహంలో కలిసిపోయినవి. హూణులూ శకులూ మొదలైన మూకలన్నీ భారతీయులై హైందవధర్మసంస్కారముల నలవరచుకొన్న విషయం పాఠకులకు సువిదితమే. అలెగ్జాండర్ సెల్యూకస్‌లవంటి గ్రీకులూ చంగేజ్ ఖాన్ తైమూర్లవంటి పైశాచికులూ యిక్కడే వికటవిహారం సలిపినారు. సంపత్తిలోని అత్యధికభాగమును రాజచోరులు హరించుకొనిపోయ్యారు. కాని యాతనలద్వారా భారతీయతలోని మానవత్వమెన్నడూ నశించలేదు. తన మౌలికస్వభావమైన సహనాన్నెప్పుడూ విడనాడలేదు. ప్రాచీనకాలంలోని వికృతసిద్ధాంతములనూ అమానవులైన మానవులనూ ఏవిధంగా జీర్ణంచేసికొని తనలోనే సమైక్యం చేసికొన్నదో గమనిస్తే భారతీయతలోని శాశ్వతజీవనశక్తిని మనం అర్థంచేసికొనగలము.

భారతీయతలోని మరొక్క విశేషం. వివిధత్వంలోనే ఏకత్వం. అతివిస్తృతమైన యీ దేశంలో ప్రాంతీయభేదమును బట్టి శీతోష్ణస్థితులలోనూ ఆచారవ్యవహారములలోనూ అనేకభేదములుండుట సహజమే. కానీ భారతీయుని హృదయం హిమాచలనివాసిదైనా కన్యాకుమారీవాసునిదైనా అంతా ఒక్కటే. "మాతృదేవో భవ పితృదేవో భవ అతిథిదేవో భవ" అనే సూక్తులకు భారతీయుడు ఉదాహరణప్రాయుడుగా ఉంటాడు. సామాన్యనైతికసూత్రములు విద్యాగంధవిహీనుడైన భారతీయునికూడా క్షుణ్ణంగా తెలుసు. ప్రతిభారతీయుడూ యిప్పటికూడా నైతికోన్నతికి ఎక్కువ ప్రాముఖ్య మిస్తాడు. ఎంతసేపూ రైల్వేలూ యింగ్లీషూ జాతీయతను కల్పించినవనే ఆంగ్లునకు భారతీయతలోని అనుక్రమికమైన ఆచారవ్యవహారములూ భారతీయహృదయాలన్నిటా ఉండే ఉదాత్తతా అర్థంకాక మనల్ని అనాగరికులనడానికూడా వెనుదీయడు. ప్రాచీనకాలంలో మనలో ఏకత్వమును స్థాపించడానికి రాజభాషయైన సంస్కృతమూ తీర్థస్థలాలూ ధార్మికమహాపురుషుల లోకోత్తరమైన కృత్యములూ ఎక్కువగా ఉపకరించాయి. యీనాటి జాతీయత ఆనాడు లేకపోవచ్చు కానీ ఆనాటి వారి కల్పనల్లోకూడా గంగా సింధు క్రిష్ణవేణ్యాది పుణ్యనదులతో చతుస్సాగరపర్యంతవ్యాప్తమైన సామ్రాజ్యాలతో రోము సామ్రాజ్యాన్నపహసించే విభవోపేతులైన సామ్రాట్టుల మాతృప్రేమతో విలసిల్లుతూ హిమవన్నగంనుంచీ రామేశ్వరంవరకూ నదీనదములతో జనపదపరిషత్తులతో అలరారి ఆర్యావర్తస్వరూపం స్పష్టంగా విరాజిల్లేది. శారీరకనిర్మాణంలో ఒక ప్రాంతంలోని భారతీయునకూ మరొక్క ప్రాంతవాసికీ ఎంత భేదముండినా ఆధ్యాత్మికభావాల్లో ధార్మికనైతికప్రవృత్తులలో ఇద్దరూ ఒక్కటే.

ఇతిహాసంయొక్క ప్రథమావస్థలోనే భారతదేశం అతిదూరదేశాలకు ఆధ్యాత్మికసందేశాన్నీ విజ్ఞానపు వెలుగునూ పంపగలిగినది. క్రీస్తుసిద్ధాంతములపై బౌద్ధాదర్శముల ప్రభావం ఎక్కువగా ఉన్నదనీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో క్రీస్తు భారతీయసిద్ధాంతములతో సంబంధం కలిగి ఉన్నాడని బాలగంగాధరతిలక్ నిరూపించాడు. అరిస్టాటిల్ మొదలగు పాశ్చాత్యదార్శనికులకు కూడా భారతీయాధ్యాత్మికత్వంతో సంబంధమున్నదను విషయము అనేకులు నిరూపించారు. క్రీస్తుకుపూర్వమే బౌద్ధభిక్షుకులు ఆసియా ప్రాంతాలన్నిటిలోనా యూరప్‌లో ప్రచారం చేశారు. ప్రపంచపరివ్యాప్తమైన ఆదర్శం, భారతీయదార్శనికత్వంలో ఉన్నదనుటలో అతిశయోక్తి లేదు. ప్రపంచరాజ్యములన్నిటా ఒక ఆదర్శమును సృష్టించి ప్రచారము చేసినది భారతదేశమే. యూరప్‌లో కాని ఆసియాలో కానీ ఒక్క గ్రీసును మినహాయిస్తే భారతదేశంవలె ప్రాచీనకాలంలోనే గంభీరదార్శనికవివేచన చేయబడిన దేశములు తక్కువ. యూరప్‌వాసులు ప్రతి విషయానికి ఏ ప్లేటోనో లేక అరిస్టాటిల్‌నో ఉదాహరించవలసివస్తుంది. భారతీయతయొక్క అగాధదార్శనికవివేచనను తెలిసికొనడానికి షడ్దర్శనములే చాలు. ముఖ్యంగా సాంఖ్యదర్శనం మన ప్రాచీన జ్ఞానమునకు ఉజ్జ్వలమైన ఉదాహరణ. అతిగంభీరమైన వేదాంతసర్వస్వాన్ని పామరులకూడా బోధపరుస్తూ జీవితంలోని ఆధ్యాత్మికత్వమునకూ నిష్కామకర్మలోని మహత్త్వమునకూ భాష్యప్రాయమైన భగవద్గీతతో ప్రపంచంలోని మరే గ్రంథమునూ, సరి

పోల్చలేం. మన ప్రాచీన వీరులు కూడా నిష్కామకర్మస్వరూపులే. అతులితవిలాసాబ్ధిలో మునిగే క్షణంలో సర్వసంగపరిత్యాగులయ్యే ఆనాటి సామ్రాట్టుశీలాన్నీ రణరంగంలో కాందిశీకమేమో తెలియకుండా ఒక కర్తవ్యమును ముగించినట్లు నవ్వులతో ప్రాణాలను వదిలే భారతవీరుల స్వభావాన్నీ అర్థంచేసికుంటే గీతలోని, "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అనే సూక్తియొక్క యాథార్థ్యం మనకు బోధపడుతుంది. యూరప్ సామ్రాట్టులలో భౌతికవాంఛల ప్రకోపమే కన్పిస్తుంది కానీ సకలభోగసమృద్ధిలో మునిగే క్షణంలో అంతటినీ తృణీకరించి నిర్వికల్ప స్వరూపులుగా మారిపోయ్యే మన రాజుల ఆధ్యాత్మికస్వరూపం కన్పించదు. మన దేశంలోవలె మరేదేశంలోనా జీవితానికీ ఆధ్యాత్మికత్వానికీ యింత దగ్గరసంబంధం లేదు. ఆధ్యాత్మికదృక్పథం లేనిదే జీవితయాపనే సక్రమంగా సాధ్యం కాదనే సూక్తికి భారతమహాపురుషులే ఉజ్జ్వలప్రతిబింబములు. సరోజగతిజలబిందువులవలె అనురక్తిలో మునిగీ విరక్తితో కర్తవ్యంకోసం ఘృణితసాంసారికాబ్ధిలో మునిగీ మరొక్క క్షణంలో చిదానందాన్ని కూడా ప్రత్యక్షం చేసికొనగలిగే భారతీయవ్యక్తిత్వంలోని రహస్యత్వాన్ని భౌతికమే సర్వస్వమైన యూరప్ అర్థంచేసికొనలేదు.

మానవజన్మ అమూల్యమైనదని భారతీయులు భావించారే కానీ ఎన్నడూ అదే నిస్సారజీవితాన్నంటిపెట్టుకొని ఉండడానికి వారెప్పుడూ ప్రయత్నించలేదు. త్యాగం వారి పరమధర్మం. ఆదర్శం వారి పరమలక్ష్యం. లక్ష్యానికై ప్రాణములను విడవడం వారికి పరమసంతోషం. మహాభారతవీరులను పరిశీలిస్తే మనకీవిషయం బోధపడుతుంది. ఇతిహాసమంతా రాజరాజుల పవిత్రత్యాగములతో నిండియున్నది. ప్రాచీనచక్రవర్తులనుంచీ రాజపుత్రరమణులవరకూ అంతటా యీ త్యాగోత్సర్గభావమే పరివ్యాప్తమైయున్నది. మన పూర్వీకులు హింసాపూరితమైన భయంకరయుద్ధములను కూడా అతిధర్మబద్ధంగా మార్చివేశారు. ఆ కాలంలో ప్రళయయుద్ధం జరుగుతుంటే రణరంగానికి సమీపంలోనే కర్షకులు పొలం పని చేసుకోడానికూడా అవకాశముండేది. కానీ కొంపలను తగులబెడ్తూ జనపదాలను హతమారుస్తూ బీభత్సం చేయటం కూడా రణనీతిలో ఒకభాగంగా భావించే గ్రీకుల దండయాత్రలవల్ల మన రణనీతిలో కూడా కొన్ని మార్పులు కలిగియుండవచ్చు. కానీ యింత ఆదర్శమైన యుద్ధనీతి మరేదేశంలోనా లేదనవచ్చును. పతికోసం పత్నీ, పరివారంకోసం వ్యక్తీ, రాజ్యంకోసం గ్రామం, రాష్ట్రంకోసం రాజూ, న్యాయానికై వీరుడూ త్యాగం చేయడం మనలో సహజమైనదే. ఈప్రవృత్తులింకా ఆనుపూర్వికంగా మనలో యీషణ్మాత్రంగానైనా మిగిలినవనుటలో సందేహం లేదు.

కనీసం ఏ భారతీయకృషీవలుని పరిశీలించినా భారతీయతలోని ప్రత్యేకప్రవృత్తులు అతనిలోనా గోచరిస్తాయి. అతడు స్వార్థియైనా కనీసం తమ సమిష్టికుటుంబసౌఖ్యానికైనా త్యాగం చేస్తాడు. అతడెంత పామరుడైనా కష్టార్జితంలో కనిష్ఠభాగాన్ని ధర్మసౌకుమార్యములకు వినియోగిస్తాడు. అతడెంత విషయలోలుడైనా విషయవాంఛలవ్యర్థము నర్థముచేసికోవడానికే ఆధ్యాత్మికత్వంలోని అంచుల్లోనికి చూడడానికే, వెనుదీయడు. అతడు శంకరాచార్యుని పేరైనా వినకపోయినా భగవంతుడినీ తననూ వేరుచేయున్నది యీ ప్రపంచస్వరూపమైన మాయయేనని విశ్వసిస్తాడు. అతడు క్రమాగతమైన ఆచారములన్నిటినీ ఆచరిస్తాడు. కానీ పొరుగు నున్న విమతస్థుని ఆచారాల్ని కూడా శ్రద్ధతో గౌరవిస్తాడు. అతడెంత మూర్ఖుడైనా సామాజికంగా మతవిషయకంగా ఆచరించవలసిన కర్తవ్యములన్నీ అతనికి క్షుణ్ణంగా తెలుసు.

విదేశీయుల దృష్టిలో మనదేశం విచిత్రమైనది. అతని దృష్టిలో మానసికపవిత్రతకేర్పరచబడిన సాంఘికాచారములన్నీ అర్థంలేనివి. అతడు తప్పుల్ని వెతుకుతాడు. అస్పృశ్యతను ఉత్సాహంతో దూషిస్తాడు. హిందూసంఘాన్ని దుయ్యబట్టుతాడు. కానీ "చండాలోస్తు సతు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ" అనే సూక్తినిగానీ "శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః" అనే సూక్తిగానీ అతడు గమనించడు. భ్రాతృభక్తీ పతిభక్తీ ఏకపత్నీత్వం మొదలగు మన ఆదర్శములను అతడు ఆదర్శములుగానే భావించడు. కాలప్రభావంతో తమ మహత్వాన్ని కోల్పోయి అనుపయోగములైన ఆచారాలపై దాడిచేయడమే అతని పని. మనయొక్క వివిధత్వపూరితమైన ప్రవృత్తిని భిన్నాచారవ్యవహారాల్లో పెరిగిన విదేశీయుడర్థం చేసికొనలేడు. వృత్తులనుబట్టి ఏర్పరచిన వర్గాలూ కులాలూకూడా కొంతవరకూ సాంఘికదార్ఢ్యమునకు దారితీసినవి. బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్యాసాది నాల్గవస్థలూ ఆదర్శముల నతిక్రమించుటకు వీలు లేకుండా స్థిరంగా ఉదాత్తజీవితమును నెరపడానికి సహకరించాయి. పురాణాగమేతిహాసాలూ ప్రారంభికవైదికవాఙ్మయమూ మనలో వివిధత్వపూరితమైన విశాలత్వానికి దోహదంచేశాయి. బౌద్ధవిజ్ఞాననిలయాలైన విద్యాపీఠములూ వైదికసంస్కృతికి కాణాచియైన గురుకులములూ ప్రపంచసంస్కృతుల కలయికతో భరతమాతకు మహిమాన్వితమైన నీరాజనమిచ్చాయి. సంస్కృతితో వైశాల్యమును పొంది సమన్వయభావంతో సంఘర్షణల నణచుకొని యీ బంగారుదేశం ఔన్నత్యంయొక్క ఆఖరి సోపానాన్ని కూడా చూడగలిగింది. విదేశముల అసూయకుకూడా లక్ష్యమై స్వయంశక్తిని పొందనది.

ఇది విద్యుద్యుగం. నాటికీ నేటికీ మన ప్రవృత్తుల్లో అనేకభేదము లేర్పడియుండవచ్చును. మహిమాన్వితమైన దేశం. నిత్యశాశ్వతములైన భారతీయప్రవృత్తులు పరిమాణములో మారవచ్చునుగానీ పూర్తిగా పరివర్తితమైపోవు. ఆదర్శమూలకమైన మన జీవితలక్ష్యం అంతరించిపోదు. యాంత్రికయుగంలో కూడా అహింసాసత్యములకు స్థానమున్నదనీ వైజ్ఞానికయుగంలో కూడా ఆధ్యాత్మికత్వమునకతిప్రముఖప్రాధాన్యమున్నదనీ సుస్పష్టమే. నిరంతరబానిసత్వములో కూడా జీవశక్తిని కోల్పోని యీ దేశం స్వతంత్రములో సర్వతోముఖమైన వికాసమును పొందవచ్చును. పాశ్చాత్యనాగరికతతో తబ్బిబ్బయ్యే యీ సమయంలో భారతదేశం ప్రాచ్యపాశ్చాత్యశక్తుల సమన్వయంతో పురోగమిస్తే ఉజ్జ్వలభవిష్యత్తు చేకూరగలదు. అప్పుడే దీనికి ఆర్యావర్తం కర్మభూమి అనే పవిత్రనామములు సార్థకం కాగలవు.



మహాత్త్యమున్న మంచపుకోళ్లు

శ్రీ విజనపల్లి వెంకటరత్నంశెట్టి

పూర్వము శత్రుంజయుం డను రాజు మంత్రుల సామంత్రులతో కొలువుదీరియుండ వడ్లబత్తుడు ఒకడు మంచముబద్దెలను తెచ్చి ఎగుడుదిగుడుగ మోపుగట్టి సభయందు రాజు ముందర వైచి రాజునకు మ్రొక్కెను.

ఆ మోపును చూచి రాజు "ఓయీ! ఎవడవు నీవు? పనితనము లేని కొయ్యల మోపును తెచ్చుటకు కారణమేమి" అని యడిగెను.

వడ్రంగి రాజును చూచి వినయముతో రాజా! నే నొక వడ్రంగిని. ఈ కట్టెల మోపును విడదీసి అమర్చినచో మంచముగా నేర్పడి శయనించుటకు అనువుగా వుండును. చూచుటకు మోటుగా యున్నను దీని మహాత్త్యము అద్భుతము దీని వెల పదివేలవరహాలు అని నుడివెను.


రాజు ఆశ్చర్యముతో ఎట్లూ? ఒక ఎగుడుదిగుడుగా నుండెడి ముతక కొయ్యమంచము అంత వెలయా? అని పకపక నవ్వెను. వడ్రంగి జంకక దేవరా, ద్రవ్యాపేక్షచే నేను పొల్లుమాటలు పలుకలేదు. సత్యము చెప్పినాను. నేచెప్పినవెలకు గవ్వ తక్కువైనను దీని నివ్వజాలనని గట్టిగా పలికెను.

అది విని మంత్రి "మహాప్రభూ దీనియందు, ఏదో మహాత్త్య ముండి తీరవలయును. కాన దేవరవారు తప్పక దీనిని పరీక్షించవలయు నని చెప్పుటచే రాజు మంచము తీసుకొనుటకు సమ్మతించెను.

యా రాత్రి రాజు భోజనము చేసి, యా మంచముమీద కదలక మెదలక నిద్రబోవువానివలె పరుండెను. జాము గడచినతరువాత యా మంచముకోళ్ళు నాలుగును ఒకదానితో నొకటి మనుష్యభాషలో సంభాషింప నారంభించెను. ఆ అద్భుతసంభాషణకు రాజు ఆశ్చర్యపడి ఏమి జరుగునో యని ప్రసంగమును జాగ్రత్తగా యాలకించుచుండెను. అంతలో యొకటి తక్కినవాటిని పిలిచి చెలులారా! నా వాడుకప్రకారము నే పోయి పట్టణములోని విషయములను తెలుసుకొనివచ్చెద. అంతవరకు రాజును జాగ్రత్తగా చూచుకొనుచుండు డని చెప్పి యా కోడు పట్టెనుండి వదలి ఎగిరిపోయి రెండవజాము లోగా తిరిగివచ్చి తన స్థానమునందు నిలచి తన పర్యటనవిశేషములను చెప్పదొడగెను.

సఖియలారా! నేడు నేను యిచ్చటినుండి పోయి పురమంతయు తిరిగి తుదకు తూర్పువీథిలోజొచ్చితిని. అందొకచోట నొక చిన్న దేవాలయ ముండుట గాంచి యచ్చట కొంచెము సేపు విశ్రమించుటకు నిలచితిని. యింతలో అయిదుగురు యోధులు

వచ్చి యట కూర్చుండిరి. రహస్యముగా వారిలో నొకడు తక్కినవారితో మిత్రులారా! మన రాజైన వీరవర్మ ఈశత్రుంజయుని చంపుటకు మనలను పంపి వారముదినము లైనది. యిప్పటివరకు మన పని నెరవేరినది కాదు. అనుచుండ ఇంతలో మరియొకడు యీ రాజునకు వేటయందు బహు ప్రీతిగనుక మనము వేటగాండ్రవేషములతో పోయి రాజును వేటకు పురికొల్పి యడవికి పిలుచుకొనివచ్చి మన రహస్యఆయుధములతో చంపవచ్చును అని తలంచి సిద్ధమయిరి.



“మరికొంత సేపటికి రెండవకోడు తిరిగి వచ్చి చెలులారా! నేను పురమంతా తిరిగి దక్షిణపువీధి ప్రవేశించితిని. అట్టిసమయమున నొక యువతి తల విరబోసుకొని గోడు, గోడు మని ఏడ్చుచు పోవుచుండెను. నేను చెంతకుపోయి అమ్మా ఎవరిదానవు? నీవు ఏడ్చుటకు కారణ మేమని యడుగగా యది నేను యీ పట్టణపు గ్రామదేవతను. ఈ దేశపు రాజుకు కొన్ని దినములకు సర్పము గఱచుటచే ప్రాణాపాయము కలుగు ననెను. ఆ మాటలకు నేను చింతిల్లి తల్లీ రాజు బ్రతుకుటకే యుపాయయి లేదా అని యడిగితిని. ఏల లేకపోయినది! కలదు. ఈ వనములో పడమటి దిక్కున ఒక పుట్ట పున్నది. దానిపై ఒక క్రొత్తరకపుతీగ కలదు దానివేరు నూరి నీటిలో కలిపి మృతుడైనప్పుడు రాజునోటిలో పోసిన మరల రాజు బ్రతుకును. ఇది పరమరహస్యము. దీనిని ఇతరుల కెట్లు తెలియునా యని దుఃఖించుచున్నాను చెప్పెను.

మొదట రెండిటివలె మూడవది కూడ తిరిగివచ్చి సఖులారా! నేడు నేను పడమటివీధికి పోయితిని. అచ్చట భయంకరమైన ఒక వ్యక్తిని చూచితిని. ఆ వ్యక్తి గ్రుడ్లు త్రిప్పుచు నెత్తిన దగదగ మండుచున్న నిప్పు కుంపటి పెట్టుకొని చేత ఖడ్గము నుంచుకొని తిరుగుచుండినది. నేను ధైర్యముతో ముందర నిలచి “నీ వెవరు? అని యడుగగా అది నేను ఢాకిని యను భూతమును. బహు కాలమునుండి యీ పట్టణములో రాత్రులందు తిరుగుచు ఎదుటపడ్డ వారిని మ్రింగుచుంటిని కాని వారము దినములనుండి యాహారము దొరకక యాకలిగొని యున్నానని బలికెను.

దాని మాటలకు నాకు కోపము కలిగి ఓ దుష్టభూతమా యిదియా నీ వృత్తాంతము? ఇప్పుడే పట్టణము నుండి వెడలిపో! లేకుంటివా చచ్చెదవని దాని తలపై దగులునట్లు పఢితిని తటాలున దాని తలపై నున్న కుంపటి క్రింద పడిపోవుటచే యది నాకు మ్రొక్కి నేను వెడలిపోయెదను క్షమించుమని ప్రార్థించినది. అంతట దాని ఖడ్గమును తీసి దగ్గఱ నున్న కాళికాలయములో నుంచితిని యని చెప్పినది.


ఇంతలో నాల్గవజాము ప్రారంభించినది. నాల్గవకోడుసహితము తక్కినవానివలె పోయి జాముఅవగనే వచ్చి తన చోట నిలచి తను చూసిన వృత్తాంతములను వానితో నిట్లు చెప్పెను. నేడు నేను రాజుగారి గుజ్జుపుశాలవైపు పోయితిని. యందొక గదియందు ఒక సంభాషణ వినబడెను. ఏమిటా యని వినగా యా స్త్రీ ఆ పురుషునితో “మనోహరా! నిన్ను కలుసుకొనుటకు చాలా కష్టము ఏర్పడినది. ఏమి చేయుదును? నా మగడైన రాజు నెలదినములనుండి ప్రతిదినము నా యంతఃపురమునకు వచ్చుటచే నీవద్దకు రాలేకపోయితిని. నేడు ఎవడో కంసాలి యొక మంచము నిచ్చుటచే దానిని పరిక్షించుటకై ఎక్కడనో పరుండియున్నాడు. కాన నేడు నాకు సమయము దొరికినది. అయినను ఇక మన కీ రాజుబాధ యుండదు.

రేపు అతనికి భోజనము పెట్టిన పుడు అందులో విషము కలుపుటకు నమ్మకము గల పరిచారికనొకదానిని నియమించి యున్నా నని పలికెను.

అని నాల్గవకోడు చెప్పినంతనే తక్కిన కోళ్లన్నియు అయ్యో పాపము! ధర్మాత్ముడైన యీ రాజున కన్నియు గండములుగానే యున్నవే! భగవంతుని దయ యెట్లు యున్నదోకదా అని మౌనము దాల్చి యూరకున్నవి.

రాత్రియంతయు జరిగిన విషయములను తలచుకొనుచు రాజు కాలకృత్యములు తీర్చుకొని తన పరివారముతో కాళికాలయమునకు పోయి దేవిని దర్శించి యచ్చట మంచము కోడు చెప్పినట్లే యున్న కత్తిని తీసుకొనివచ్చెను. అటుతరువాత రాజు సభాకూటము జేరి సింహాసనాసీనుండై యుండగా అయిదుగురు యోధులు కొలువుకూటమున కరుదెంచి రాజునకు నమస్కరించి మహాప్రభూ మేము వేటయందు కడు ఆరితేరిన వారము. మా విద్యలను ప్రభువులవారు సమక్షములో చూచి మమ్ములను మీవద్ద వేటగాండ్రుగా నియమింతు రని కోరుచున్నాము. అని చెప్పగనే రాజు రాత్రి వినినదంతయు జ్ఞప్తికి తెచ్చుకొని తన సేవకులచే వారిని బంధించి పరీక్షింపగా వారి వద్ద రహస్యమైన ఆయుధములు పట్టుబడెను.

అటుతరువాత రాజు భోజనమునకు వెళ్ళెను. రాణి వినయముతో పతి కుపచారములు చేసి భోజనము తెప్పించిపెట్టెను.



గుంటూరు మండల కోవాపరేటివు మహాసభ సందర్భంలో తీయబడిన ఛాయాచిత్రం: గా॥ నీలం సంజీవరెడ్డి, శ్రీ కళా వెంకట్రావు, గా॥ కల్లూరి చంద్రమౌళిగార్లు వున్నారు.

ఆ భోజన రహస్యము నెఱిగి యున్న రాజు ఆ యన్నము కొంచెము కాకికి వేయగా యది యా యన్నము దిని తక్షణమే గిరగిర దిరిగి పడి ప్రాణములు విడిచెను. తోడనే రాణిని బంధించి గుఱ్ఱపువానిని రావించి గడచిన రాత్రి తన భార్యకును వానికినిజరిగిన సంభాషణ తెలుపుమని బెదిరింపగా యతడు జరిగినదంతయు మనవి చేసుకొనెను.

రాజు భార్యను చూచి "ఓసి పాపీ! కపటాత్మురాలా! తుదకు నన్ను చంపుటకే ప్రయత్నించితివా? తక్షణమే యీ దుర్మార్గురాలను కొనిపోయి ఉఱిదీయుడు అని యాజ్ఞాపించెను.

తరువాత రాజు నాలుగుదినములు గడపి యైదవనాడు. తన మంత్రితో కలిసి పడమటివైపు యుద్యానవనములోని పుట్టయు దానిపై నల్లియున్న తీగయు నతనికి చూపి తనకు పాముకాటుచే మరణము కలుగుననియు తాను చావగనే యా తీగయొక్క వేళ్లను తవ్వి నూరి నీటిలో కలిపి తన నోటిలో పోసిన బ్రతుకుదు నని రహస్యముగా చెప్పెను. అచ్చటనుండి మాటలాడుకొనుచు మరలి వచ్చుచుండిరి. అపుడు ఎండుటాకులు దట్టముగా రాలియున్న యొక్క చెట్టుక్రిందగా నడుచుచుండగా ఇంతలో త్రాచుపామొకటి రాజుకాలును కఱచి పాఱిపోయెను. ఆ విషము దేహమంత ప్రాకుటచే రాజు మృతి నొందెను. చెంత నున్న మంత్రి యంతయు చూసి రాజు చెప్పినవిధముగా వేరును నూరి నోటిలో పోయగా యథాప్రకారముగా రాజు లేచికూర్చుండెను. ఇదియంతయు చూచి మంత్రి ఈ అద్భుత మేమని యడుగగా రాజు తాను వడ్లబత్తునివద్ద కొనిన మంచముపై పరుండినమొదలు నడచిన వృత్తాంతమంతా చెప్పి వడ్లబత్తుని పొగడి. మరల బహూకరించెను.

గ్రహ బలము

శ్రీ ఆర్.యస్. వెంకటరమణ

ఒకపూరిలో ఒక బ్రాహ్మణుడు కలడు. అతడు దైవభక్తి కలవాడు. పూర్వాచారపరాయణుడు. ఏదైనను మంచి కలిగినపుడు "అదృష్టదేవతవలన" అని వేనోళ్ళ పొగడుచుండెను. ఏదైన చెడు కలిగినచో "ఇది నా కర్మ" అని విచారించుచుండెను. ఇట్టి చిత్రస్వభావము కలిగియుండెను.

ఆ దేశపు రాజు నిరంకుశుడు. ప్రతివిషయమును ఇతరులఅభిప్రాయము వినక తన అభిప్రాయమునే కొనసాగించుచుండెను. కాని, అతడు పండితులను ఆదరించు మంచి స్వభావము మాత్రము కలిగియుండెను. అందువలన పెక్కురు పండితులు అతనిని ఆశ్రయించుచుండిరి. బ్రాహ్మణుడు చాలా బీదవాడు. అందువలన రాజును ఆశ్రయించి అతనిని తృప్తిపఱచి అతనిచ్చిన ధనముతో తన జీవితమును గడుపుచుండెను. రాజు ఆ బ్రాహ్మణుని తనకు వలసినప్పుడెల్లా పిలిపించుచుండెను.

ఇట్లుండ ఒకనాడు ఆ రాజు మఱియొక రాజుతో కొన్ని ముఖ్యమైన విషయములను మాటాడుటకు బయలుదేరతలచెను. బయలుదేఱుముందు బ్రాహ్మణునకు సందేశమంపెను. బ్రాహ్మణునకు మఱియొక అలవాటు కూడ కలదు. అదేమన తాను ఎక్కడికైన పోవుముందు తన గ్రహస్థితి చూచి బయలుదేఱుచుండెను. కాని రాజు పిలిపించినపుడు తన గ్రహస్థితి చూచెను. తనకు తృప్తి కలుగలేదు. కనుక కొంసేతపు అయినతర్వాత రాజువద్దకు బయలుదేఱెను. కాని రాజు అప్పటికే వెడలిపోయియుండెను. కనుక బ్రాహ్మణుడు ఆ మఱుసటిదినము రాజాస్థానమునకు పోయెను. రాజు కోపముతో గర్జించెను. బ్రాహ్మణుడు వున్నవిషయము రాజుతో మనవి చేసుకొనెను. రాజు నిరంకుశుడు ఐనందున అతనితో "నీ గ్రహస్థితి బాగున్నదని గదా నీవు వచ్చినది. ఇప్పుడు నిన్ను శిక్షింపదలచితిని. నీ గ్రహస్థితి ఏమి చేయగలదో చూచెదననెను." అపుడు బ్రాహ్మణుడు విచారముతో అది నా కర్మ అని పలికెను. అపుడు రాజు కొద్దిసే పాలోచించి "అట్లయినచో నీ కర్మను తప్పింప శక్తికలవాడను నేను. నిన్ను శిక్షింపను" అని పలికెను. అపుడు బ్రాహ్మణుడు అది "అదృష్టదేవత ఫలము"ని పలికెను. అపుడు రాజు చిరునవ్వుతో అతని పాండిత్యమునకును, వాక్చాతుర్యమునకును మెచ్చుకొని ధనము నిచ్చెను. అపుడు బ్రాహ్మణుడు ఇదంతయు తన గ్రహస్థితిఫలమని పలికెను. ఆవిధముగ బ్రాహ్మణుడు రాజుబాగడ్త వడసి అతని ధనముతో జీవితమును గడుపుకొనెను.

సోమరిపోతు

శ్రీ స్వయంపాకుల సీతారామయ్య

ఒకానొకప్పుడు ఒక ఈగ ఒక తేనెటీగవద్దకు వచ్చెను. ఈగ తేనెటీగను "నాకు ఇప్పుడు ఆహారము లేదు. నీవు తినుటకు కొంచెము ఆహారము, నివసించుటకు కొంచెము స్థలము ఇచ్చినట్లైతే నేను నీ బిడ్డలకు పాడుట, ఆడుట నేర్పెదను" అని అడిగెను. అందుకు తేనెటీగ "వచ్చునది శీతాకాలముగదా? గడచిపోయిన వేసవికాలం, వానాకాలములలో నీకు కావలసిన ఆహారమునెందుకు నిలవయుంచుకొనలేదు?" అని అడిగెను.

ఈగ "గడచిపోయినకాలములలో నా కాలమును ఆడుటపాడుటలతో గడిపితిని. నాకు ఇప్పుడు అహారము లేదు. కాన తినుటకు ఆహారము, నివసించుటకు స్థలము ఇచ్చినచో నీ బిడ్డలకు ఆడుట, పాడుట నేర్పెదను." అని పలికెను.

ఈ మాటలు విని తేనెటీగ కోపముతో "ఏమి? నా బిడ్డలకు గూడ నీవు ఆటపాటలు నేర్పినట్లైతే వారు నీవలె ఆటపాటలతో సోమరులై వారికి కావలసిన ఆహారము సంపాదించుట మాని తరువాత చిక్కులు పడతారు. కాన నీవు నా బిడ్డలకెంతమాత్రము ఆటపాటలు నేర్పనక్కరలేదు. ఇంకొకనదెకు బొమ్మ్మ" అని కసరెను. ఈగ సిగ్గుబడి అప్పటినుంచి ఆటపాటలు మాని కష్టపడి పని చేసుకొనుచుండెను.

"కష్టపడితేనే ఫలం."

రుద్రమదేవి

(12-వ పేజీతరువాయి)

అంతలో అన్నమయ్యవాక్కున ఈ పద్యము నృత్యమే చేసెను.

'రారా, స్ఫాటికలింగ ! నీ కుదురునన్
రత్నాలు సొన్నాలు వో
నీరా ! నీ కవి యేల రయ్యా ? పడికా
పిట్లుండి యీ బస్తిప్రా
కారం బూనుచు నారుబైల నిలువన్
నీ కర్మ మేమయ్యా ? అ
బ్బో ! రారా, చలి వేయురా యిట, స్వయం
భూదేవపార్శ్వంబునన్—'

ఆ పద్యము విన్న దేతడవుగా అంబదేవుడు ఆనందాతిశయముతో, "అన్నమారాధ్యుల యాజ్ఞ యైనది! ఈ లింగమూర్తిని స్వయంభూదేవనికేతనము ప్రాకారమున నీశాన్యభాగమునకు చేర్పింపుడు !" అని యాజ్ఞ యిచ్చి ముందు వేగరుల బంపి యక్కడ మండపస్తంభములు నిల్పి వానిపై పలకలు వేసి యాయతనము జాములోపల సిద్ధముచేయ నాజ్ఞాపించెను.

ఒక్కసారిగా శివభక్తులందరు జయజయనాదములు చేయుచు భక్తితో ప్రేమతో నా శివలింగము నక్కడనుండి పెకలింప ప్రయత్నించిరి వారు తమ బాహువులతో, పలువురు పుత్రులు తండ్రిని ఆలింగనము చేసుకొనునట్లే, ఆ లింగమూర్తిని పొదివి లేపజూచిరి. ఆ తకిడికి ఊపుకు పాదునుండి కదలినది గాని అసలులింగము ఎంతకును విడి రాలేదు. టెంకాయలు కొట్టిరి. నైవేద్యములు చెల్లించిరి. బహువిధముల తరలింపులు పాడిరి. లాభము లేకపోయినది.

అది చూచి అంబదేవుడు అన్నమయ్యను ప్రార్థించెను.

"ఆరాధ్యదేవా, అంతశ్శుద్ధి కల మీరు పట్టిననే గాని ఈ స్ఫాటికలింగమూర్తి కదలదు !"

యథావాక్కుల అన్నమయ్య స్ఫాటికలింగమునకు ప్రదక్షిణ మాచరించి మ్రొక్కెను. అంతట నాతడు లింగమును సమీపించి తన వామబాహువును ఆ లింగశిరస్సుపైనుండి రానిచ్చి కుడిచేతితో గడ్డము పట్టుకొని, చెప్పినమాట వినక మారాముచేయు పిల్లవానిని బ్రతిమాలునట్లే, బ్రతిమాలసాగెను.

'లేవయ్యా, నను గన్నతండ్రి, వినరా,
లెక్కింపరా యన్న ప
ల్కువాక్యంబులు, లేడుతే వసదిలో
కీలింప బాణుండు, నీ
సేవాసక్తులు కూడి రిందు గదలిం
చేబుద్ధి, మారాముచే
నే వేమయ్యా !—ఎరుంగవో యవల మా
చేతల్ ప్రకోపించినన్'

అట్లు బ్రతిమాలి అన్నమయ్య యా స్ఫాటికలింగమును కదలించెను. లేవ ననుచున్నట్లుగా ఆ స్ఫాటికలింగము ఈ ప్రక్కకు నాప్రక్కకు కదలాడెను. మరల నట్లే రెండుమూడుమారులు అతడు బ్రతిమాలుచు లింగమును కదలించెను. మరల నట్లే లేవ ననుచున్నట్లు లింగమూర్తి తల యాడించెను.

అంతవరకు పరమశాంతమూర్తిగా నున్న అన్నమయ్యకు ఏదో ఆవేశ మంకురించినది. ఓషధులు కనబడక పోగా సంజీవి పర్వతము పెరుక నుద్యోగించిన హనుమంతునివలెనే యాతడొక్కసారి పెరిగినట్లు విజృంభించినాడు. లేచిరమ్మని హుంకరించుచు అన్నమయ్య తన విశాలవక్షస్థలము లింగమున కానించి సుదీర్ఘము లగు తన రెండుబాహుశాఖలతో నా లింగమూర్తిని ప్రేమతో భక్తితో పూనికతో ఆవేశముతో కోపముతో దృఢముగా చుట్టిపట్టి బంధించినాడు, హుమ్మని యార్చినాడు ! ఘీంకారము చేయుచు మహాగజము కరముతో లాగునట్లే అతడు దాని నొక్కలాగు లాగినాడు !

పాదు కదలి విచ్చిపోయినది. అల్లరిచేసిన పిల్లవాడు కోపించిన తండ్రిచేతులలోనికి వచ్చినట్లుగానే ఆ లింగమూర్తి అన్నమయ్యచేతులలోనికి వచ్చినాడు ! మహానందావేశముతో బొటబొట నాతని కన్నులవెంట నీరు కారి యా స్ఫాటికలింగమునకు ఉష్ణోదకస్నాన మాచరించెను !

భక్తులు ఆవేశముతో శివనినాదములు చెలంగ ధూపదీపము లిచ్చి నానావిధనైవేద్యము లర్పించిరి.

ఆ యథావాక్కుల అన్నమయ్య కన్నీరే రత్నములుగా సొన్నాలుగా మారి రూపొందినవో, కాక అక్కడ కుదురులోనే అవి యున్నవో గాని యా లింగ మెత్తిన పాదులో రత్నములు స్వర్ణములు నున్న రాశి కానవచ్చినది. చూచినవారి యాశ్చర్యమునకు మేర లేదు. లింగమూర్తి కదలకముందే అన్నమారాధ్యులు రత్నాలు సొన్నాలు ఉన్నవని ప్రస్తావించి యుండెనే ? ఈయన నిజముగా దివ్యపురుషుడే, యథావాక్కే ?

ఆ రత్నస్వర్ణముల రాశి వెంటనే అంబదేవుడు శ్రద్ధగా తీయించి వేరుగా నుంచినాడు !

అప్పటికే నవనందులు పూనిన శకట మొకటి సర్వాలంకృతమై సిద్ధమైనది. అందుపై నా స్ఫాటికలింగముతోపాటు అన్నమయ్య ఆరోహించినాడు. ఆ శకటముననే పాదులోనుండి తీసిన రత్నములు సొన్నాలు ఉంచి తరలించునట్లు అంబదేవు డాజ్ఞాపించెను.

అంతకుము న్నెన్నడు ఏకశిలానగరపౌరులు చూచిగాని వినిగాని ఎరుగని యొక మహోత్సవము పురవీధుల నూరేగెను !

ఆనాటి కిక అగడ్తపని యాగిపోయినది. ఆ పనిలో నున్న భక్తులే కాక నగరమున మూలమూలల వాడవాడల గల శివభక్తులెల్లరు స్త్రీలు పురుషులు ఆబాలగోపాలము నక్కడ చేరిరి. సొన్నాయివాద్యముల జట్టులు సిద్ధమై ఒకరిని మించవలెనని ఒకరై వాయించుచుండిరి. అందుల డోల్లశబ్దములు వినువారి హృదయములలో ప్రమథగణములు పదవిన్యాసములనే యనుకరించు నొక యదరుతో కలసిన యానందము కలిగించుచుండెను. వాని

కెదురై ఖడ్గములు చెప్పుచు కొందరు సాగుచుండిరి. బహుప్రదేశముల నారసములు గ్రుచ్చుకొని నటించువారు మరికొందరు! భక్తుల కథలు పాడువా రింకను గొందరు. అందును ప్రాచీనభక్తులు జైనుల పరిభవించిన కథలు విశేషముగా సాగినవి. పొట్లచెరువులో దేవర దాసయ్య జైనతర్కమును కొట్టి వారి ఐదువందలవసదులు వ్రచ్చి వేయించిన కథ; కోవూరిలో జైనులు తమ మంత్రమహిమచే మఱ్ఱిచెట్టును కాల్పగా గోవూరిబ్రహ్మయ్య వీరగణమును స్మరించి సర్వమంత్రమూల మగు మంత్రరాజ మనుష్ఠించి భస్మమైన యా మఱ్ఱిని మరల నిలిపి యా యూరిలోని వసదులు వ్రచ్చివేయించిన కథ! ఏకాంతరామయ్య అబ్బలూరిలో జైనుల నుక్కడగించి ఆ పురి వసది యానాడే పడిపోవునట్లు కఠోరశాప మొసగిన కథ!—ఇట్లు కథకులు కథలు చెప్పుచుండగా తాళములు ప్రయోగించుచు చప్పటలు కొట్టుచు భజనలు చేయువారు వేరొకకొందరు! మరియు గొందరు వేదసూక్తములు పఠించువారు! ఆవేశముతో వెఱ్ఱికేకలు వేయువారు మరికొందరు! అందరును స్ఫాటికలింగమును అన్నమారాధ్యులను పరమభక్తితో నర్చించువారే!

యథావాక్కుల అన్నమయ్య! యథావాక్కుల అన్నమయ్య! వీరిది సిద్ధవాక్కు! అట్టివారే యథావాక్కులవారు! ఇట్టి యథావాక్కులు అందరకు ఆరాధ్యులు కారా మరి? వీరు వైజకవ్వకథ పఠింపగానే జైనప్రతిమపాదునుండి ఈ స్ఫాటిక లింగము ఉద్భవించినది. ఆనాడు వైజనాథుడు పుట్టిన నీనాడు ఈ అన్నమేశ్వరుడే వెలసినాడు! ఈ కుదురులో రత్నాలు సొన్నాలు ఉన్నవని ముందే వీరు చెప్పుచు శివుని ప్రార్థించినారు ఆ పద్యములో అన్నట్లే లింగము పాదులోనుండి రత్నస్వర్ణరాసులే పుట్టుకొనివచ్చినవి. ఎంత మహానుభావు డీ యథావాక్కు! అంతేనా? ఇందరము కలసి పెకలింపలేని మహాలింగము నీత డొక్కడే తన రెండుబాహువులతో పెకలించినాడు. స్థాణు వగు శివుడే ఈ భక్తుని కోపమునకు భయపడి అదరి బెదరి అల్లరిచేసిన పిల్లవానివలెనే అన్నమయ్యతండ్రిచేతిలోనికి వచ్చినాడు!

ఇట్లు పరిపరివిధముల నందరు పొగడువారే! ఆ చేరినవారికి నిజముగా లింగమూర్తియందు ఎక్కువ భక్తియో, అన్నమయ్యయం దెక్కువ భక్తియో రూపింపరా కుండెను.

ఆ మహోత్సవము ఏకశిలానగరవీధులం దెల్లెడ సాగెను. ఇంటింట నారతు లిచ్చువారే! ఆనాడు ఆ ఏకశిలానగరమే కైలాస మన్నట్లు ఆ ఉత్సవము చూచినవారికి భాసించెను. ఆ యుత్సవములో నున్నవారును తాము కైలాసములో నున్న ప్రమథగణముల మనియే తలంచుచుండిరి.

సూర్యాస్తమయ మయ్యెను. దీపములు వెలిగించువేళ వచ్చెను. వెన్నెలరాత్రియే అది; ఐన నేమి? దివిటీలు లేనిది రాత్రియుత్సవము శోభగా నుండునా? దివ్వెలు అసంఖ్యాకముగా కొనిరాబడినవి. కనబడిన కఱ్ఱలు దివిటీకఱ్ఱలుగా మారెను. ఎదురైన వస్త్రములు వానికి చుట్టు గుడ్డలయ్యెను. అందుకు ఇది విలువగలది ఇది చౌకది యను విచక్షణ లేదు. ఎన్నో పట్టువస్త్రములే దివిటీలకు చుట్టిరి. మరి వానికి తైలమో! అన్నిరకముల తైలములు నేతులుగూడ ఉపయోగించిరి. ఆ దివిటీలు పట్టువారికి గూడ కులవివక్షు లేదు; పెద్దలు చిన్నలు అనుభేదము లేదు. సదాశివునికి ఏ సేవ చేసిన నీచ మనిపించుకొనును! అంబదేవుడే యొక దివిటీ గొని శివుని ముందు సాగు వీరభద్రావతార మట్లు ఆ శకటముముందు పాదచారియై నడచెను. ఎవరు నెట్టి ప్రయత్నము ముందుగా చేయ నవసరము లేకుండగనే సద్యస్స్ఫూర్తితో సర్వము మహా వైభవముగా జరిగిపోవుచుండెను.

నగరవీధుల తిరిగితిరిగి యా యుత్సవము మహారాజ మందిరము మోసాలముందు 'శోభనాల బావికిని' 'గడియారాల బావి'కిని మధ్య యొక్కింత నిలిచినది. అక్కడ వాద్యములు ఘోషించెను. నృత్యములు సాగెను. జయజయఘోషలు చెలరేగెను. సంగీతములు ప్రవర్తిల్లెను. రాజమందిరమునుండి రుయ్యాను కొందరు దాసదాసీజనులతో వచ్చెను. దాసదాసీజనము లింగమూర్తికి రాజసదనమునుండి వచ్చిన కానుక లర్పించిరి. రుయ్యాను స్వయముగా అన్నమలింగమునకు ఆరార్తికము దర్శింపజేసి మంగళగీతము పాడెను.

రాజమందిరముప్రక్కనే స్వయంభూదేవాలయప్రాకారము! లింగోద్భవకాలము సమీపించుచున్నది! ఆసమయమున నా యుత్సవము స్వయంభూనికేతనమును సమీపించెను!

ఆ మహాప్రాకారమునకు నలువైపుల విశాల మగు వీథులును నాలుగుమూలల విశాలము లగు నాలుగు చత్వరములును గలవు. ఆ యాలయమునకు ఆ ఉత్సవము ముమ్మారు ప్రదక్షిణించి తిరిగెను. అప్పటికి దాని యీశాన్యభాగమున అన్నమలింగమునకు చక్కని చిన్న యాలయము సిద్ధమై యున్నది. ఓరుగల్లుశిల్పులకు అవ్యాధి యేమిటి? ఆ యాలయముముందు ఆ ఊరేగింపు మహార్భాటముతో సాగినది.

అన్నమారాధ్యుడు బండిపైనుండి క్రిందికి దిగెను. ముం దాత డొక దివ్వె గొని యా నూతనాలయమున నెల్లెడ దాని త్రిప్పెను. నూతనాలయమునకు ఈ సంస్కార మవసరము. దానితో ఆ యాలయము నాశ్రయించి యున్న భూతప్రేతపిశాచాదులు వదలి వేరొక యాచ్ఛాదనము చూచుకొనును. అంతట అన్నమయ్య స్వయముగా స్వయంభూసరోవారి కనకకుంభములతో తెచ్చి యా నూతనాలయమెల్లెడ సమంత్రకముగా ప్రోక్షించెను. అంతట నక్కడ లింగమూర్తిని ప్రతిష్ఠించుటకు సిద్ధముచేసియున్న గర్తములో బండిలో లింగమువెంట వసదిప్రక్క నున్న లింగము పాదునుండి తెచ్చిన రత్నములును స్వర్ణములును అంబదేవుని యనుజ్ఞతో నిక్షేపించి యాతడు రత్నశిలాన్యాస మొనర్చెను. దారిలో కానుకలుగా వచ్చిన స్వర్ణాదు లన్నియుగూడ నందే యాత డుంచెను. అప్పుడు మరియును చేరిన భక్తులెల్లరు యథాశక్తిగా నాగర్తములో తమ కానుక లుంచిరి. ఇక లింగమూర్తిని ప్రతిష్ఠించుటే మిగిలి యున్నది.

అన్నమారాధ్యులు ఇంచుకతడవు చింతించెను. ధాన్యస్వర్ణాద్యధివాసములు లింగమూర్తికి కాలేదే! మరియు ననేక సంస్కారములు కాలేదే! ఇట్టి సందేహములు అన్నమారాధ్యుల కంకురించి యుండవచ్చును. పరక్షణములో నా సంశయములు పటాపంచలయ్యెను. సిద్ధలింగమూర్తికి మానవకృతసంస్కారములు కావలెనని తలంచుట ఎంత భ్రాంతి! అన్నమయ్యా, నీకెంత అజ్ఞానమయ్యా? మరల నింకొక సంశయ మాతని కుదయించి యుండవచ్చును. ఈ లింగమూర్తి ఎంతకాలముగా ఆ జైనవసది నానియుండెనో గదా!

ఆ నేమినాథప్రతిమ పృష్ఠముక్రింద నలిగిపోయియుండెనుగదా! అయ్యో, స్ఫాటికలింగమూర్తి మైలపడలేదా? అన్నమయ్యకు జైనులపై గల ద్వేషముచే నీ సందేహము పోవుటకు ఎక్కువ వ్యవధి కావలసివచ్చెను. నిత్యపవిత్రుడగు శంకరునికి మైల సోకుటేమి? మైల సోకినచో ఈ స్ఫాటికమూర్తి ఇట్లు దేదీప్యమానముగా ప్రకాశింపగలడా? ఏమి యజ్ఞానమయ్యా నీకు? భక్తులు తెచ్చిన సహస్రాధికఘటములతో నీవు స్వయముగా లింగమూర్తి నభిషేకించితివి. దానితోనైన నీ మనస్సులోని మాలిన్యము పోలేదటయ్యా? లింగోద్భవకాల మైనది! ఆకాశమువంక అన్నమయ్య చూచి లింగోద్భవకాల మైనట్లు నిశ్చయించినాడు. అన్ని సందేహములును దానితో విరిసిపోయినవి.

సరిగా లింగోద్భవకాలమున అన్నమయ్య స్వయముగా నా స్ఫాటికలింగమూర్తిని శకటముపైనుండి తెచ్చి యా యాలయమున ప్రతిష్ఠించి భక్తులందర యనుమతితో నా లింగనికి అన్నమేశ్వరుడని నామకరణము చేసి పూజించి తీర్థప్రసాదములు భక్తులకు పంచిపెట్టెను. ఆ యారాధ్యదేవుడు తన శతకములోనుండి యీపద్యము స్పష్టముగా శ్రావ్యముగా నిట్లు పఠించెను.

"బలవంతుండును దుర్బలుండును మహా
ప్రౌఢుండు మూఢుండు నుం
గులజుండున్ గులహీనజాతుడు
ఘన క్రూరుండు శాంతాతిని
శ్చలచిత్తుండును నొక్కరూప మది నీ
సద్భక్తి చిత్తంబులో
పల వర్ధిల్లినమీద నేవిధమునన్
భావింప సర్వేశ్వరా!"

వంగువమాంచాల

(10-పేజీ తరువాయి)

బాలచంద్రుని మేడమీదికి బిలుచుకొని పోయినది చిత్తరువుల జూపినది. చిలుకల బలికించినది. శృంగారోద్యానమును గానిపించినది. తనకు (బొద్దువోవుటకై పెద్దలు పొందించిన ధర్మపాంచాలికా వ్రాతము జూపి యందొక బొమ్మ నాడించి మగనికి వినోదము గొలిపెనది. బాలచంద్రుడు మాంచాలముగ్ధమోహనమయిన సౌందర్యమును జూచి ముగ్ధుడయినాడు. హంసతూలికాతల్పమున శయనించియున్న మగనికి మాంచాల ముత్యాలపీటపై గూర్చుండి తములపాకులు చిలుకలు చుట్టి యొసగినది. బాలచంద్రుని యధరమాత్రమే కాక హృదయమును రాగరంజితమయినది. బాలుని భావ మెఱిగి యాయత్తపడి వత్తునని లేచిపోయినది. పన్నీట నీళ్ళాడి సింగారించుకొని 'బిడ్డల యాశల బ్రియమున దీర్ప, జననితో సమమైన జంతువులేదు.' కావున దనకున్న కష్టమెల్ల వెళ్ళబోసికొనుటకై తల్లి చెంత చేరినది. తల్లితో తనమనసు విప్పి చెప్పుకొనినది.

'కాంచక కాంచక కాంచితి బతిని
గాంచితినే కాని కలలోని వార్త
కదనరంగమునకు గదలుచున్నాడు
చిరవియోగము మాకు సిద్ధించు నొక్కొ
అడవి గాసిన వెన్నెలాయెను బ్రతుకు
తల్లిరో నేనెట్లు తాళగలాను
బాలుని బోకుండ బట్టుట యెట్లు
దరియేమి నాకని'

తల్లడ మందసాగినది. తల్లి రేఖాంబ తనయకు గర్తవ్యముపదేశించిన యీ ఘట్టము ఆంధ్రుల చరిత్రమున అనుపమానము. ఆనాడామె యట్లుపదేశింపకుండిన మాంచాలను నేడు మన మింతగా ననుకొనవలసినపని యుండదు. చరిత్రయే మఱొకతీరున లిఖింపబడవలసి యుండెడిది. రేఖాంబ—

'ముద్దులమాంచాల ముదమున వినుము
జన్మవృత్తమునకు జవిగలయట్టి
పటుతరకమనీయఫలములు రెండు
కెరలు భోగము లొండు కీర్తి రెండవది
తొలుపండు చవిచూచి తొలగు నొకండు
మలుపండు చవిచూచి మలగు నొకండు
వీర లిద్దఱికిని భేదంబు హెచ్చు
మొదటి ఫలంబున మొనసెడు రసము
క్షణభంగురం బది సమసిపోగలదు
రెండవ ఫలమున రెక్కొనురసము
శాశ్వతం బాను దిశల్ గలదాక'

కావున,

'నీవు భోగములపై నిరతి దృజించి
బాలచంద్రుని భద్రభావం బెఱింగి
భావిమానవుల హృద్భవనంబు ందు
తావకీనయశోలతా వివర్ధనము
సేయంగ గోరుము చెలువరో యిపుడు
బాలచంద్రుని నాగ బట్టంగఁగలదు'

అని బోధించినది. మాంచాలహృదయములో కర్తవ్యము మేలుకొనినది. భోగవాంఛయొక్క పొంగు అడగాఱిపోయినది. హృదయము కలకదేఱినది. కర్తవ్యోద్బోధముతో, నిశ్చితహృదయముతో మగని యెదుటికేతెంచినది.

బాలచంద్రుడు అతిలోకసౌందర్యవతి యయిన తన సతి మాంచాలను చూచి గతమునకు బశ్చాత్తప్తుడయినాడు. మాంచాల యతనికి దగ్గరగా గూర్చుండినది. బాలచంద్రుడు మోహపరవశుడయినాడు. ఆమె చీరచెంగు నొడిసి పట్టినాడు. అయ్యో! ఆ చీరపైనున్న ముత్యాలచేరులు మొదటికి దెగి యందలి ముత్యములు చెదరి నేల రాలినవి. మాంచాల చిన్నబోయినది. ఆమెమనసున ఎందులకో చివుక్కు మనినది. చెదరి నేల రాలిన ముత్తెములు తనకు గర్తవ్యముపదేశించుచున్నవి వోలె నున్నవి. బాలచంద్రునికి మాంచాల హృదయములోని సాగరమథనము తెలియదు. ఆమె కట్టుకొనిన చీర మడుపు నలగిపోయినందులకు జిన్నబుచ్చుకొన్నది కాబోలు నని యతడు తలచినాడు. అంతకంటె నింకను షోంకముగా చీరను సింగారింతునని లేచినాడు. మాంచాల చెక్కు నిమిరి చెదరి నేల రాలిన ముత్తెముల నేరి, దారము చిక్కు సడల్చి యందు ముత్యముల గూర్చుచుండినాడు. ఇంతలో బుణ్యకాలము దాటిపోయినది. బాలచంద్రుని తమ్ములు చెప్పిపోయిన యేడుజాముల మితి గడచిపోయినది. మాంచాల మగని జూచి

'నాతో బెనంగినయమేమి లేదు
కడువడి గలనికి గదలుడి మీరు
కులవైరమం దీర్చు గురుసాహసుండు
పరికించి చూడ నెవ్వరు మీరు దక్క'

అని కర్తవ్యోద్బోధము చేసినది.

ఇంతలో బాలచంద్రుని యనుజులు రానే వచ్చినారు. వచ్చి యూరకుండలేదు. పెల్లుగా గోలచేసిరి. బాలు డది యేమని మాంచాల నడిగినాడు. "మేడపిచెన్నుని మేలైనసేవ'

యని మాంచాల ప్రత్యుత్తర మొసగినది. బాలచంద్రు డామాట వినిపించుకొనలేదు. వినిపించుకొను స్థితిలో గూడ నతడిప్పు డున్నట్లు లేడు. ముత్తెముల గూర్చుచునే యుండినాడు. తమ్ములతనికంటె నొక్కయీడు నెక్కువగనే చదివినవారు. 'పురము తల్లడమంద భూభ్రములు కదల' వారు పెడబొబ్బలు పెట్టసాగినారు. బాలుని కది దుస్సహముగా దోచినది. ఇక సహింపజాలక వారికి గట్టిగా బుద్ధిసెప్ప దలచినాడు. ఓడకోడకు డని యువిదలకు ధైర్యము గొలిపి కటారి పెరికి యనుజులమీద దట్టహాసము చేసినాడు. అనుజు లంతకన్న గడుసువారు.

'అన్న మెట్టులు లోని కరుగును నీకు
గంటికి నిదుర యేగతి వచ్చు నయ్య
బంటుతనంబును బాడియు విడిచి
కులవైరముం దీర్చుకోరిక వదలి
యింటి కాసించుట యే నీతి యగును'

అని బాలుని తూలనాడినారు 'నీవు రాకున్న మానె, మమ్ము యినను బంపుము. కులపగ తీర్చి నీకు గీర్తి తెచ్చెద' మనినారు. బాలచంద్రుడు సిగ్గుచే జిదికిపోయినాడు. కాని మనసు మాంచాలపై పునకు లాగుచున్నది. ప్రబలవాంఛ బలవంత పెట్టినది. మనసును త్రొక్కిపట్టలేక పోయినాడు. కోరిక పరుగుల్ద్రొక్కుచున్నది. కాదనలేక పోయినాడు. మాఱుమాటాడక మాంచాలమంది మార్గము పట్టినాడు. మాంచాల మగనిరాకడ గ్రహించినది. వాకిటికి నెదురేగి వచ్చినది. బాలుడు తన చేతికత్తిని మాంచాలచేతి కిచ్చినాడు. మాంచాల కత్తి చేత దీసికొని నవ్వుచు మగని నాశీర్వదించినది.

'రతిరాజసుందరా రణరంగధీర
కమలబాంధవతేజ కరుణాలవాల
వినతాత్మజునిలావు వెస నీకు గలుగు
సామీరి కుండిన సాహసం బబ్బు
కృష్ణుని కీడుగా కీర్తి ఘటిల్లు
రవికాంతియుతు డవై రంజిల్లుచుండి
అలరాజు పగదీర్చు మనుజులదోడ
పటుతర విక్రమవైభవం బలర
శ్రీగిరిలింగంబు చెన్నకేశవుడు
వరము లొసంగంగ వర్తిల్ల గలరు
శాత్రవవిజయంబు సమకూరు మీకు
ఈ యాయుధము వడి నిచ్చును జయము
కలియుగంబున మీకు ఘనపూజ లమరు'

ఖడ్గము మగనిచేతి కందించినది. తనకర్తవ్యము నెఱవేర్చినది. కాని యామె నొక్కవిషయము బాధించుచున్నది. అనపోతు బ్రాహ్మణుడు. అతడు కూడ యుద్ధమునకు సిద్ధపడుచున్నాడు. అతని నెవ్వరును కాదనలేరు. వలదని వారింపలేరు. యుద్ధరంగములో నతడు మరణించినచో బ్రహ్మహత్యాదోషము తన మగనికి గలుగును. ఆ బ్రహ్మహత్యాపాపమును

'పరమేశ్వరుండైన పార్వతీజాని
పాపికొనగ లేక పలుపాట్ల బడియె
ఇక మనుజు లెంతటివారు? కావున
'కలహంబునకు మీరు కదలుచున్నారు
జయ మపజయము నీశ్వరునకు దెలియు
విప్రు డాయనపోతు వెంటరా దలచు
బ్రహ్మహత్య ఘటిల్లు పాపము వచ్చు
మగుడంగ బంపుము మాయచేనైన'

నని మగని హెచ్చరించినది. బాలచంద్రునికిని అది యథార్థమనియే తోచినది. సరియని సమ్మతించినాడు. మాంచాల తొలిసారి కోరిన కోరికయది. అదే కడసారి కోరిక కూడ. మాంచాల తనకు మడిమాన్యము లిమ్మని యడుగలేదు. నగలు, నాణ్యములు చేయించిపెట్టమని చెవికొలుకలేదు. మగని నింటనే యుండుమని మారాము సేయలేదు. అనపోతు మరణించిన బ్రహ్మహత్య ఘటిల్లునని యతని నెటులైన మాయచే వెనుకకు బంపుమన్నది. తన సుఖము చెడనాడుకొని, చెడని కీర్తిఫలము నాసించి, ఖడ్గము నందించి, 'కులపగ' దీర్చుటకై మగని గదనభూమికి బంపినది. మాంచాల యెంతటి త్యాగమూర్తి!

'చతురంతధారణీచక్రంబు శాసించు
వీరప్రతాపు లీ వేళ లేరు
పరవీర్యలుంటాక బాహాబలప్రౌఢి
గల బాలచంద్రు లీ గడియ లేరు
ఖడ్గంబు నందిచ్చి కదనభూమికి నాగు
నడపు మాంచాల లీనాడు లేరు
కండల గదలించు కైత లామెత లిచ్చు
తిక్కనయజ్వ లీ దినము లేరు
లేరు పండితులో కావలేపజలద
మండలీ చండవాయువుల్ మల్లినాథు
లూచ వోయిన సంతాన మేచునట్లు
దీవన ల్గురియింపవే తెలుగుతల్లి!'

సూర్యకాంతి

(14 పేజీ తరువాయి)

అట్లా కోరడంకంటే, పదుగురి మంచిని అభిలషించడంకంటే, మేము చేయగల్గిందేమి వుంది. కానీ భయం క్షణక్షణానికి మనస్సుని తినివేస్తున్నది. అమ్మ తిరిగి రాదేమో ననే భయం. ఏం చేయను. ఇట్లా బ్రతకాల్సిందేనా. మేం చేసిన తప్పేమిటి? మేము కూడా నలుగురిలో తలఎత్తుకు తిరగడానికి, సుఖంగా బ్రతకడానికి మేం చేసిన తప్పేమిటి?

ఇట్లా ఆలోచిస్తున్నాను. ఏమీ తెలియదు? ఒట్టి మూర్ఖం తప్ప. అన్యాయమూ పుణ్యమూ ఎరుగను.

ఆ రోజల్లా ఎక్కడెక్కడో తిరిగాను. పిచ్చిపిచ్చిగా ఎక్కడెక్కడో తిరిగాను. చీకటి పడుతున్నది. ఎన్ని కష్టాలు వచ్చినా ఇల్లు తప్ప శాంతి నిచ్చే వస్తువు మరొకటి కన్పించదు. ఇల్లు చేరుకున్నాను. బావురుమంటున్న ఇల్లు. ఖడ్గమృగంవలె ముని గాళ్ళమీద కూర్చుని కబళింప నుంకించే యిల్లు! చెల్లెలు అలిసిపోయి మగతగా జ్వరంలో, తెలివి తప్పి నిద్రపోతున్నది.

భయం. రాత్రిళ్లు నిద్రపోకుండా నాన్న తిరిగివస్తాడనే ఆశతో భయంభయంగా ఎదురు చూసే అమ్మకళ్లు నన్ను వెంటాడుతున్నవి. ఇంటి చుట్టూ అమ్మకళ్లు. భయం. వెడల్పయిన అమ్మకళ్లు. నిద్రలేక మతిస్థిరత్వం లేక జబ్బుచేసి డాక్టర్లు లేక మందులు లేక మనోవ్యాధితో కృశించి క్రుంగిపోతున్న అమ్మకళ్లు భయంకరంగా ఆందోళనగా నన్ను పీడిస్తున్నవి. భయం. వొణుకు.

మెల్లగా పిల్లిలా ఇంట్లోకి మునివ్రేళ్ల మీద వెళ్లాను. చెల్లెలు దీర్ఘనిద్రలో మునిగి వుంది. మా మామయ్యా అన్నయ్యా అమ్మని వెతకడానికి పోయినవాళ్లు ఇంతవరకు రాలేదు.

"చిన్నీ!" - కేక విన్పించింది.

"అమ్మా. వచ్చావా" - ఆత్రుతగా తలుపు తీశాను. గట్టిగా అమ్మకాళ్లు పెనవేసుకుని, తల్లి ఒడిలో తల పెట్టి వెక్కివెక్కి ఏడ్చాను. మనశ్శాంతి. ఓదార్పు మాటలు.

"మా నాయనగదే, నేను ఎక్కడికి వెళ్తాను రా. మిమ్మల్నిందర్ని వొదిలిపెట్టి నే నెక్కడికి పోతాను. మా బాబుగదూ. ఊరుకో. భయపడ్డావా. పిచ్చినాయనా, నేను వుండగా భయ మెందుకూ........"

"చిట్టి నిద్రపోతున్నదా?" - అమ్మ భారంగా అడుగులు వేసుకుంటూ చెల్లెలి కోసం గబగబా పోతున్నది. వెనక నేను.

ఇంత కాళరాత్రివేళ భారమై సాగిపోతున్న అమ్మ అడుగులవెంట సూర్యరశ్మి పోతున్నది.

చెల్లెలికి జ్వరం తీవ్రంగా వచ్చింది. మాటా మంతీ లేకుండా పడివుంది. నాకు భయంగా వుంది.

నాకు తెలుసు. అమ్మ తిరిగివస్తుందని నాకు నమ్మకమే. ఇంత సంసారాన్ని వదిలిపెట్టి, సర్వం తెగతెంపులు చేసుకుని పారిపోవడానికి కన్నతల్లికి ధైర్యం చాలదు. ప్రేమ పోనీయదు. అది ఒట్టి కథల్లో తప్ప, ఒట్టి మా భయం తప్ప, తన బిడ్డల్ని, తన బిడ్డల జీవితాన్ని ఎలాగోలాగ ఈడ్చుకు పోవాల్సిందే తప్ప, జీవితాన్ని తునాతునకలు కానీయదు. తప్పుల్ని, నాన్నమీద దూషన్లనీ నిందించదు. అన్నీ చూస్తుంది. ఆలోచిస్తుంది. అంతేగాని...

ఐతే తల్లిని తిరిగి యిచ్చిన భగవంతుడు, 'బదులు తీర్చుకుంటాడా. చెల్లెల్ని తీసుకుపోతాడా, కష్టాలమీద కష్టాలు. ఎట్లా భరించేది?

ఒట్టి మా భయం తప్ప, తుప్పుడు పట్టిన కష్టమయసంసారంతో వేగిపోయి, పిచ్చియెక్కి, ఇక్కడికి కొద్దిదూరంలో వున్న బంధువుల యింటికి మనశ్శాంతి కోసం కొంత విశ్రాంతికోసం తల దాచుకో బోయింది. అంతేగాని, తల్లి తన బిడ్డల్ని విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లగలదు. ఎలా వెళ్లగలదు.

ఉదయంనుండి మూసిన కన్ను తెరవని చెల్లెలు, తల్లిస్పర్శ తగిలేసరికి అమ్మా అమ్మా, అమ్మా, అమ్మా, అమ్మా! గట్టిగా కౌగిలించుకుంది అమ్మ సముదాయిస్తున్నది. చెల్లెలి జ్వరం తగ్గుముఖం, పట్టే సూచన కన్పించింది మాకు. మళ్లీ ఆశాసంతోషములు వికసించాయి మాలో.

మళ్లీ మా జీవితాలకి సూర్యకాంతి చూసే అదృష్టం వుంది. తల్లినీ చెల్లెల్నీ..

—



డెన్మార్కు రాజు ఫ్రెడరిక్ IX జన్మదినోత్సవసందర్భంలో ఢిల్లీలోని డెన్మార్కు మంత్రివర్గ రాయబారి టాయిబర్గు, ఫ్రాండ్ జక్ ఢిల్లీ జంకానా క్లబ్బులో విందుచేసిరి. టాయిబర్గుదంపతులు ప్రధాని నెహ్రూను సంభావించుచున్నారు.

ఆల్ఫాన్జో బెర్టిలన్

(16 వ- పేజీ తరువాయి)

కోలిన్ ఇంకా బ్రతికే ఉన్నాడని తేల్చగలిగాడు.

విదేశనగరాలలో, బెర్టిలన్ విధానాన్ని ప్రప్రథమంగా అవలంబించినవారు ఛికాగో పోలీసుశాఖవారు తర్వాత న్యూయార్కు పోలీసుఇన్స్పెక్టరు. అపరాధపరిశోధకుడు అయిన థామస్ బర్నీస్ ఈ విధానం అవలంబించి, "రోగ్స్ గాలరీ" అని నేడు ప్రపంచప్రఖ్యాతివహించిన నేరస్థుల రికార్డుల మందిరాన్ని నిర్మించాడు.

తన కీర్తిప్రతిష్ఠలు పెరిగాక బెర్టిలన్ అపరాధపరిశోధకవృత్తిలో కొత్త కొత్త పద్ధతులకోసం నిత్యం కృషిచేసేవాడు. ఎక్కడా కూపీ అందకుండా, నిద్దాగా చేసిన ఖూనీలలోకూడా, తన ప్రతిష్ఠపోతుందేమో నని వెరవకుండా నేరస్థుడని నిర్ణయించేందుకు కృషిచేసేవాడు.

చీరన్ జీస్లర్, అనే ఖండాంతరఖ్యాతిగల ఒక ప్రముఖవ్యక్తి ఒకనాడు తన గుఱ్ఱాలశాలలో చచ్చిపడిఉన్నాడు. ముగం మీదా, తలనిండా గుఱ్ఱపులాడాల దెబ్బల గుర్తులున్నాయి. ఆ సాలలోనే ప్రక్కనే అతని కొత్తగుఱ్ఱం, సకిలిస్తూ హరాంచేస్తూ కట్టుకొయ్యదగ్గర నిలచిఉంది. నిజంగా పెద్ద ప్రమాదమే అని అందరూ అనుకొన్నారు. కాని బెర్టిలన్ తృప్తిపడలేదు. "అయ్యా ఇది ప్రమాదవశాత్తు సంభవించిన చావు కాదు. ఎవరో సంకల్పించి చేసిన ఖూనీ. ఇటు చూడెండి, బేరన్ తలమీద మొగం మీద కనబడుతూ ఉన్న లాడాల గాయాలు ఈ గుఱ్ఱపు డెక్కల లాడాలనుంచి తగిలి ఉండటానికి వీల్లేదు. అలా జరగాలంటే చేరన్ శీర్షాసనం వేసికొని గుఱ్ఱపు వెనుక కాళ్ల వద్ద తలక్రిందులుగాఉండి ఉండవలసింది." అనిచెప్పాడు. బెర్టిలన్ కూపీలు తీసి చివరికి హంతకుణ్ణి పట్టుకొన్నాడు. అతను బేరనును మాయమాటలతో గుఱ్ఱాలశాలలోకి తీసుకువచ్చాడు. అక్కడ ఒక్కకొయ్యసుత్తికి గుఱ్ఱపులాడాలు బిగించి దానితో బేరన్ తలా మొగం, చిదుకగొట్టాడు. హత్యనేరం, అమాయకపు గుఱ్ఱానికి అంటగట్ట చూశాడు. కాని బెర్టిలన్ తెలివివల్ల అది ఫలించలేదు.

"ఒక హత్య జరిగినప్పుడు, రెండు ముఖ్య విషయాలు ప్రశ్నించుకొని గమనించండి" అంటాడు బెర్టిలన్. "ఒకటి, ఈ మనిషి చచ్చిపోతే లాభం ఎవరికి? రెండు, ఈ హత్యాకథనానికి మూలమైన ఆడది ఎవరు?" ఫ్రాంసులో జరిగిన హత్యలలో నూటికి 90 పాళ్ళు, స్త్రీమూలకంగా జరిగినవేనని బెర్టిలన్ నిరూపించాడు. ఇంకో చిన్నసూత్రంకూడా పరిశోధకులకు నేర్పిపెట్టాడు. "సత్యం చిరునవ్వు నవ్వేవాణ్ణి ఎంతమాత్రం నమ్మకద్దు"అంటాడు బెర్టిలన్.

మనిషినడకలో అంగల ప్రమాణాన్ని బట్టి, మనిషిఎత్తును సరిగ్గా నిరూపించవచ్చునని మొదట బెర్టిలనే కనిపెట్టాడంటారు ఫ్రెంచివారు. అదేకాకుండా, నేరం జరిగినచోటు వెంటనే ఫోటోగ్రాఫ్ తీసిఉంచాలని నిబంధంపెట్టిందీ అతనేనంటారు. క్రిమినల్ ఫోటోగ్రాఫ్లను, ఇతరమైన అనేక పరిశోధనల ప్రయోజనాలకోసంకూడా బెర్టిలన్ ఉపయోగించేవాడు. 1911 లో "హూనాలిజా" అనే ప్రభుత్వ పురాతనచిత్రాన్ని ఎవరో దొంగలించారు. తర్వాత మళ్లీ దొరకింది. కాని అది అసలో, నకలో తేల్చుకొనేందుకు, మొదటి చిత్రం ఫోటోగ్రాఫ్లను పెద్దవిచేసి, బ్రష్మార్కులు పరిశీలించి, ఈ దొరకిన చిత్రం బ్రష్మార్కు ఫోటోలతో పోల్చి చూసి, అదే ఇది అని నిశ్చయించుకోగల్గారు.

వేలిముద్రలను రికార్డుచేసే పద్ధతికూడా బెర్టిలనే ప్రారంభించాడని పాశ్చాత్యదేశాలలో అపోహఉంది. కాని ప్రాచ్యదేశాలలో వేలిముద్రలు మనిషిగుర్తుగా, పూర్వకాలంనుండి వస్తున్నాయి. మొగలాయిదర్బారుకాలంలో ఫించన్లు పుచ్చుకొనేవారి పనివేళ్ల ముద్రలను పరిశీలించి, ఫించనుడబ్బు ఇచ్చేవారు.

అపరాధపరిశోధకునికి, వేలిముద్రలు ఉపయోగపడినంత మరేవీ ఉపయోగపడవు. మనుష్యుల చేతివేళ్లు నిత్యం చెమటపట్టూనే ఉండబట్టి, కొత్తనున్నని జాగా ఏది తగిలినా ముద్రపడక తప్పదు. అల్లాంటి ముద్రలను స్ఫుటంగా బైటపెట్టి, ఫోటోగ్రాఫ్ తీసేందుకు బెర్టిలన్ కూడా కొన్ని కొత్తపద్ధతులు మొదలుపెట్టాడు. ఒక మనిషి వేలిముద్ర మారదు. తల్లిగర్భంలో నాల్గవ నెలలో వేలిమీద ఏముద్ర ఉంటుందో, అదే యీజిప్షియన్ మమ్మీలాగ శరీరాన్ని 5,000 ఏళ్లు దాచినాకూడా అదే ముద్రగా మిగిలిఉంటుంది.

బెర్టిలన్కి ముందు వేలిముద్రల విధానంలో ఎక్కువ నమ్మకం కలగలేదు. ఆ పద్ధతి సరిగ్గా ఇంకా అమలులోకి రాలేదు. తన "ఆంథ్రోపామిట్రీ" సర్వ్యంగా ఫలితాల నిస్తూనేఉంది. ఇల్లా ఉంటూండగా బెర్టిలన్కు వేలిముద్రల్లో నమ్మకం కల్గించేందుకు ఒక విషయం తోడైంది.

కంసాస్ జిల్లాపోలీసులు, విల్ వెస్టు, అనే నేరస్థుడికి బెర్టిలన్ విధానంలో ఫోటోలు తీస్తున్నారు. ఫోటోతీసేగుమాస్తా, ఈ మనిషిని మునుపు చూసినట్టు గుర్తు అని అనుమానంవెలువర్చాడు. ఫైళ్ళువెదకటం మొదలుపెట్టారు. అన్నీ సరిగ్గా అమరిన ఫైలు దొరికింది విలియమ్‌వెస్టు అనే పేరిట. నేరస్థుడు ఫోటోలూ కొలతలూ అన్నీ తన పోలికనే ఉన్నమాట నిజమేగాని తను ఇంతకుముందెప్పుడూ ఇక్కడకు రాలేదని నిశ్చితంగా చెప్పాడు. గుమాస్తాకు కోపంవచ్చి రికార్డు పూర్తిగా తిరగవేశాడు. రికార్డులో వెనకవైపు వ్రాసిఉంది. "విలియమ్‌వెస్టు హత్యకేసు . సెప్టెంబరు 9 1901 న ఖైదు చేశాము" క్లర్కు తెల్లబోయాడు. విలియమ్ వెస్టు జైలులోనే ఉన్నాడు. ఇద్దరినీ ప్రక్కపక్కనే నిలబెట్టిచూశారు. ఒక్క అచ్చునే ఉన్నట్టు ఉన్నారు. బెర్టిలన్ కొలతలలో 11 కొలతలలో 7 కొలతలు ఇద్దరికీ సరిసమానంగా ఉన్నాయి. తక్కిన నాల్గింటిలోనూ విభేదం స్వల్పంగా ఉంది. కాని వాళ్ల వేలిముద్రలుమాత్రం పూర్తిగా వేర్వేరుగా ఉన్నాయి.

బెర్టిలన్ వెంటనే తన విధానంలోని లోపం గ్రహించి నిజాయితీతో, వేలిముద్రలనకూడా ప్రతిరికార్డుకు చేర్చవలసిందని వెంటనే అనుజ్ఞ యిచ్చాడు. వేలిముద్రల ఫోటోలు తీయటంలోకూడా కొత్త పద్ధతులు కనిపెట్టాడు. వేలిముద్రలవల్ల అంతవరకు బైలుపడ్డ పెద్ద నేరాలేవీ లేవు. కాని 1902 లో, ఒక దొంగ దంతవైద్యుని షాపులో దూరి, బీర్వాఅద్దాలు పగలగొట్టి విలువగల వస్తువులు సేకరించుకొని పారిపోతున్నాడు. షాపునౌకరు కర్మవశాత్తూ ఎదురుపట్టాడు. ఇద్దరూ ఘోరంగా దెబ్బలాడారు. చివరికి దొంగ, నౌకరుతల రూపు తెలియకుండా చితకగొట్టి పారిపోయాడు.

బెర్టిలన్ ఆ జాగా అంతా పరిశీలిస్తూ, పగిలిపోయిన బీర్వాఅద్దపుముక్కలన్నీ పోగుచేసికొని తీసికెళ్లాడు. ఒక ముక్క

★ గ్రంథ సమీక్ష ★

వాల్మీకి రామాయణ విమర్శనము

కొడాలి లక్ష్మీనారాయణ బి. ఏ.

ఇది వాల్మీకరామాయణాన్ని గురించిన విమర్శకగ్రంథము.

మోపర్రు. గుంటూరుజిల్లా.

మీద నాలుగు వేళ్ల ముద్రలు ఉన్నవి. వంటనే ఫొటోతీసి పెద్దదిచేసి, రికార్డులు వెదకసాగాడు. ఒక పాతముద్దయి షెఫ్ఫర్ అనేవాడి వేలిముద్రలతో ఈ నాలుగు వేలి ముద్రలు సరిపోయాయి. కొద్దిరోజుల్లో హంతకుని పట్టుకొన్నారు. షెఫ్ఫర్‌కు, ఆ షాపులో నౌకరంటే ద్వేషము. వాడిని చంపి, కేవలం ఎవడో చిన్నదొంగ చేసిన దొంగతనంలాగా కమ్మీచేసేందుకు ప్రయత్నించాడు కాని బెర్టిలన్ ఉన్నాడన్న విషయం మర్చిపోయాడు. ఈ కేసు దేశదేశాల పేపర్లూ వింతగా చెప్పసాగాయి.

ఈశతాబ్దారంభంలోనే, ఒకన్యూయార్కు ప్రచురణకర్త, పారిస్‌వెళ్లి, బెర్టిలనును కలుసుకొన్నాడు. ఆయనజీవితవిశేషాలను వ్రాసియిస్తే ఒక్కొక్కమాటకు ఒక్కొక్క డాలరు ఇస్తానన్నాడు. ఆ వచ్చేసొమ్ము పోలీసుడైరక్టరుగా బెర్టిలన్‌కు వచ్చే సంవత్సరాదాయానికే ఎన్నోరెట్లు ఉంటుంది. కాని బెర్టిలన్ "నాకు టైము లేదని" చెప్పి తప్పించుకొన్నాడు. చనిపోయేదాకాకూడా తన జీవితవిశేషాల ప్రజ్ఞను వెల్లడించుకొనే ఉబలాటంగాని అందుకు తీరుబడిగాని బెర్టిలన్‌కు లేకపోయింది.

61 వ ఏట, 1914 లో ఫ్రాంసుప్రఖ్యాత అపరాధపరిశోధకుడు బెర్టిలన్ మరణించాడు. నేరస్థుల సంఖ్యను తగ్గించే కృషిలో మహోపకారం చేసే విధానం సృష్టించి, మనకు కొంత శాంతిని చేకూర్చాడు బెర్టిలన్.

(రీడర్సు డైజెస్టువ్యాసం ఆధారంతో)

వాల్మీకి రామాయణకాలవిమర్శనంకోసం సుప్రసిద్ధపాశ్చాత్యవిద్వాంసు లనేకులు పెద్ద పెద్ద పరిశోధనలు జరిపారు. శ్రీ లక్ష్మీనారాయణగారు పాశ్చాత్యుల గ్రంథాలు సమగ్రంగా పఠించి, రామాయణకాలనిర్ణయంలో తమ అభిప్రాయం కూడా తెలియజేశారు. రామాయణరచన క్రీస్తుపూర్వం 14 వ శతాబ్దిని ప్రారంభింపబడినదనీ, క్రీస్తుపూర్వం 2, 3 శతాబ్దాలలో అందులో కొన్ని ప్రక్షిప్తభాగాలు చేరాయనీ గ్రంథకర్త ఊహిస్తున్నారు. రామాయణగాథ చారిత్రికం కాజాలదని కూడా శ్రీ కొడాలి లక్ష్మీనారాయణగారు భావిస్తున్నారు.

రామాయణకాలనిర్ణయంలో పెద్ద పెద్ద విద్వాంసులచే అనేకమైన భేదాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. వీరి కాలనిర్ణయాల్లో కొన్ని శతాబ్దాలతేడా కనబడుతున్నది. శ్రీ లక్ష్మీనారాయణగారి ఊహ కూడా పాశ్చాత్యవిమర్శకుల ఊహవంటిదే కాని, ఇవి గట్టిగా విశ్వసించడానికి తగిన కొత్త ఆధారా లేవీ కనబడవు.

రామాయణగాథ చారిత్రకం కాకపోవచ్చును. ప్రస్తుత రామాయణంలో కొన్ని ప్రక్షిప్తభాగా లుండవచ్చును. కాని రామాయణం సాంస్కృతికంగా భారతనాగరికత కొక మూలస్తంభంవంటిది. అందుచేత గ్రంథకర్త కేవలం చారిత్రకవిమర్శతో తృప్తిపడక వాఙ్మయదృష్టితో కూడా రామాయణాన్ని విమర్శించిఉంటే ఇది ఇంకా సమగ్రమై ఉండేది.

అయితే విమర్శగ్రంథాలు తక్కువగా ఉన్న మన భాషలో ఈ గ్రంథంలాంటి వాటిని వ్రేళ్లమీదనే లెక్కపెట్టవచ్చును. చారిత్రకంగా రామాయణాన్ని పరిశీలించివారు ఈ పుస్తకం తప్పక చదవాలి.

గ్రంథస్వీకారము

అభిషేక నాటకము

ఆంధ్రీకృతి. శ్రీ బులుసు వేంకటేశ్వర్లు. వెల 2-0-0. ప్రతులకు, రచయిత రామారావుపేట, కాకినాడ.

అహల్యా గౌతమము

పద్యకావ్యము. కర్త శ్రీ బులుసు వెంకటేశ్వర్లు. వెల 2 రూ. ప్రతులకు రచయిత రామారావుపేట కాకినాడ.

అవచి దేవయతిప్ప

రచన తడికమళ్ల కోటీశ్వరగుప్త, త్రిపురమల్లు లక్ష్మమ్మగుప్తగారలు, గుంటూరు. వెల. 0-4-0. తెలుగువారిలో సముద్రవాణిజ్య వ్యాపారాదులలో ప్రఖ్యాతిగాంచినవాడు, శ్రీ సాధుని సమకాలికుడునగు అవచిదేవవీయతిప్ప చరిత్రము బహుసంక్లిష్టముగా ఈ రచయితలు సమకూర్చిరి.

శ్రీమద్రామాయణము బాలకాండము

పద్యకావ్యము కర్త శ్రీ కోపల్లి శివకామేశ్వరరావు. ప్రాప్తిస్థానము, గ్రంథకర్త పీఠికాపురకళాశాల, కాకినాడ. వెల, 2-0-0.

రాజ్యకాంక్ష

నాటకము. కర్త, శ్రీ అంకరాజు శంకరరావు. ప్రకాశకులు, డా. గురుమూర్తి. ఆశయనిర్వాహకసంఘం. రాజమహేంద్రవరం. వెల రూపాయి. రాజస్థానకథావళిలోని కథమూలముగా రచించబడిన నాటకము.

పండితరాయలు

పద్యకావ్యము. రచయిత విద్వాన్ కొండూరి నరశింహం. వెల 1-4-0. ప్రతులకు వాణీ బుక్‌డిపో, భీమావరం.

గాంధీజీకి శ్రద్ధాంజలి

గ్రంథకర్త వినోబావే. అనువాదం శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి. వినయాశ్రమ గ్రంథమాల, వినయాశ్రమం. వయా పొన్నూరు.

చీకటినీడలు

కవితాసంపుటి. రచన బైరాగి. ప్రజాసాహిత్యపరిషత్తు, తెనాలి. వెల 0-12-0.

పాతూరి పంచాంగం

వికృతి: కర్తలు శ్రీ పాతూరి సుబ్బరాయశాస్త్రి శ్రీ రామమూర్తిగార్లు. వెల 0-4-0. దొరకుచోటు - పంచాంగకర్తలు, పాతూరి శాస్త్రి, మూర్తి. 147 మింటుస్ట్రీటు, మద్రాసు 1.

ప్రకృతిలో జీవాల ప్రజ్ఞావిశిష్టతలు

(6 వ పేజీ తరువాయి)

కొమ్ములున్న దుప్పులు, నూటికి 60 మైళ్ళ వేగంతో పరుగెత్తగలవు. నల్లజింకలు 65 మైళ్ళ వేగం అందుకోగలవు. అన్ని జంతువులకన్నా చిరుతపులి అతివేగంతో గంటకు 70 మైళ్ళ వేగంతో పరుగెత్తగలదు. నేలమీది వాట్లల్లో చిరుతపులి వేగాన్ని మించింది లేదు.

పక్షుల్లో, గంటకు 200 మైళ్ళు వేగంతో ఎగిరిపోతూన్న భరతపక్షిని రెండు మైళ్ళ దూరందాకా అనకరించి వేగం నిర్ణయించారు. డేగ, ఆహారం చూసినప్పుడు దిగివచ్చే వేగం గంటకు 180 మైళ్ళ వేగం ఉంటుంది. ఉష్ట్రపక్షికూడా నేలమీద పరిగెత్తేవాట్లల్లో మంచి పరుగుఅందుకో గలదే. ప్రపంచంలో బాగా పరుగెత్తగల ఏ వేటకుక్కకన్నా కూడా, గంటకు పదిహేను మైళ్ళ చొప్పున ఎక్కువైన వేగంతో పరుగెత్తగలదు.

* * *

దుమకటంలో కూడా విశేషప్రజ్ఞ ఉన్న జంతువులున్నాయి. లాంగ్ జంపులో మానవుల రికార్డు, 26 అడుగుల 8¼ అంగుళాలు, కంగారు. అతితేలికగా 30 అడుగులు దూకుతుంది. గేజెల్లి జింక 40 అడుగులు దూకుతుంది. అన్నిటికన్నా జెరోబా అన్న ఒకరకంచిట్టెలకదే విచిత్రం. ఈ ఎలుక నాలుగు అయిదు అంగుళాలుకన్నా పెద్దది ఉండదు. కాని కూర్చున్నది కూర్చున్నట్టుగా 15 అడుగుల దూరం దూకుతుంది. ఈమాత్రం దూకేందుకు, మనిషయితే, 200 అడుగుల వెనకనుంచి పరుగెత్తుకురావలసిఉంటుంది.

* * *

ఇవన్నీ కేవలం ఆంగికవిశేషాలు కావచ్చును. కాని ఇంతకన్నా, గిజిగాళ్ళ గార్హస్థ్యజీవితమే విచిత్రము. ఈ పక్షులు, స్వంతంగా ఒక పొదరిల్లు నిర్మించుకొని, చెట్టుమొదల్లో రెండడుగుల ఎత్తున ఇల్లు కట్టుకొంటాయి. కొన్నిచోట్ల మగపక్షి ఒకటే కదులుతుంది. కాని సామాన్యంగా రెండుపక్షులూ కలిసేకట్టుకుంటాయి. అల్లా కట్టాక రంగురంగులపువ్వులూ దుంపలూ తెచ్చి, తమ పొదరిల్లుఅంతటా అమరుస్తాయి. అది నివసిస్తూన్నకాలం ఆపొదరిల్లు, అందం చెడకుండా నిత్యం కాపాడుకొంటాయి.

నిత్యం ప్రకృతి కొత్తకొత్త అద్భుతాలను చిత్రిస్తూనే ఉంటుంది. ఇవాళ కొత్తగా కనబడ్డవి, రేపు పాతబడిపోయే అంత శీఘ్రంగా కూడా అద్భుతాలు నిర్మించుకొంటూవస్తుంది!

("నేచర్" పత్రిక ననుసరించి)

నేటిప్రపంచం

(18 వ-పేజీ తరువాయి)

భారతప్రతినిధి బి. యన్. రావుగారు ఒక్క మధ్యవర్తిని నియమించేబదులు, ముగ్గుర్ని చేర్చి మధ్యవర్తిత్వసంఘాన్ని నియమించడం మేలని సూచించారు. ఉభయప్రభుత్వాలకీ హితుడు విశ్వసనీయుడైన ఒక్క వ్యక్తి లభించడం కష్టమనే ఉద్దేశంతో భారతప్రతినిధి ఈ సూచన చేశారు. భద్రతామండలి కిది నచ్చలేదు. ఒక్కనినే నియమించడానికి నిర్ణయించింది. కాని వారంరోజులు గడవకుండానే భారతప్రతినిధిహెచ్చరికలోని సత్యం తెలిసివచ్చింది. జనవాక్యనిర్ధారణనిర్వాహకుడుగా ఎంచబడిన ఎడ్మిరల్ నిమిట్జ్ నే మధ్యవర్తిగా నియమించడానికి బ్రిటన్ అమెరికాలు యత్నించాయి. ఇదివరలో పాకిస్తాన్ ప్రభుత్వం ఎడ్మిరల్ నిమిట్జ్ నియామకానికి అత్యంతోత్సాహం ప్రకటించింది. దీనినిబట్టే, బ్రిటన్ అమెరికాలవైఖరిని బట్టీ, భారతప్రభుత్వం నిమిట్జ్ ను విశ్వసించలేకపోయింది. పాలస్తీనాలో మధ్యవర్తిగా పనిచేసి అందరి మెప్పునూ పొందిన డా॥ రాల్ఫ్ బంచ్ నియామకానికి భారతప్రభుత్వం సుముఖత చూపింది. బంచ్ అమెరికావాసి. నీగ్రోజాతికి చెందినవాడు. ఆంగ్లో-అమెరికన్ తంత్రాలు అతనికిష్టం కావు. 'అమెరికన్ ప్రభుత్వం విదేశాంగశాఖలో సహాయకార్యదర్శిపదవిని అతని కివ్వజూపినప్పుడు, నీగ్రోలపట్ల అమెరికన్ ప్రభుత్వవైఖరికి అసంతృప్తి చెందిన బంచ్ ఆ ఉద్యోగాన్ని నిరాకరించి ఐక్యరాజ్యసమితి ఉద్యోగంలోనే ఉండిపోయాడు. అందువల్ల బంచ్ నియామకానికి భారత పాకిస్తాను ప్రభుత్వాలు రెండూ సుముఖంగా ఉన్నప్పటికీ, బ్రిటన్ అమెరికాలు అంగీకరించలేదు. ఇప్పటివరకూ మధ్యవర్తి నియామకంపైన ఎటువంటి నిర్ణయమూ జరగలేదు.

భద్రతామండలి చర్చసందర్భంలో యుగోస్లావియా ప్రతినిధి ఒక్కడే తీర్మానంపట్ల సంకోచం ప్రకటించాడు.

భారతపాకిస్తాన్లలో చేరే విషయమయ్యే కాశ్మీర్ ప్రజల అభిమతాన్ని ప్రకటించమనడం ఉచితంకాదనీ, భారతపాకిస్తాన్ ప్రభుత్వాల తగవులతో నిమిత్తంలేకుండా కాశ్మీర్ ప్రజల వాస్తవమైన అభిమతమేమో తెలుసుకోవాలనీ అన్నాడు. దీనిఅర్థం సర్వస్వతంత్రప్రతిపత్తిని కూడా కాశ్మీర్ వాసులు కోరడం సంభవమేనని సూచించడం కావచ్చును. భారతపాకిస్తాన్లలో చేరే విషయమయ్యేగాకుండా ఉభయప్రభుత్వాలతోనూ చేరకుండా సర్వస్వతంత్రప్రతిపత్తిని కోరుతున్నారా అనే విషయాన్ని కూడా జనవాక్యనిర్ధారణలో తెలుసుకోవాలని అతని అభిప్రాయం కావచ్చును. ఇది కూడా మధ్యవర్తిపైనే ఆధారపడిఉంటుంది. ప్రస్తుతపరిష్కారవిధానా లేవీ పనిచెయ్యవనీ, స్వాతంత్ర్యం విషయమై, కాశ్మీర్ దేశనాయకుల అభిప్రాయాన్ని తెలుసుకోవాలనీ మధ్యవర్తి సూచించే అవకాశం కూడా ఉంటుంది.

ఇదివరలో కాశ్మీర్ కమీషన్ చేసిన నిర్ణయాల సందర్భంలో ఇదమిత్థమని నిరూపించే అధికారం ఈ మధ్యవర్తి కివ్వరాదని భారతప్రతినిధి సూచించాడు. బ్రిటిషుప్రతినిధి సర్ టెరెన్స్ షోన్ ఆ అధికారం మధ్యవర్తి కివ్వడం తీర్మానప్రతిపాదకుల ఉద్దేశం కాదని స్పష్టపరిచాడు. పాకిస్తాన్ ప్రతినిధి అలా కాకుండా ఆ అధికారం మధ్యవర్తి కివ్వబడాలని పట్టుబట్టాడు. భారతప్రతినిధి మాటే అంగీకరించబడింది. అయితే ఇక్కడొక విషయం స్పష్టపడలేదు. ఉత్తరప్రాంతాల పరిపాలనాధికారంగురించీ, ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంలో పరిపాలనాధికారం, దాడిమూకల నిరాయుధం చెయ్యడం, ఆజాద్ కాశ్మీర్ దళాలనుగురించి ఇదివరలో కాశ్మీర్ కమీషన్ కు భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు అనుబంధనివేదికలు (ఎయిడ్స్ మెమోయిర్స్) సమర్పించాయి. ఈ నివేదికలలో సూచనలకు రెండు ప్రభుత్వాలకూ రెండురీతులుగా కాశ్మీర్ కమిషన్ వాగ్దానాలిచ్చింది. 'కమిషన్ ఆ రీతిగా చేసినందువల్లనే వారి పరిష్కారయత్నం విఫలమయింది.' జెకోస్లొవాక్ ప్రతినిధి చెప్పాడు. ఇప్పుడు మధ్యవర్తి కాశ్మీర్ కమిషన్ నివేదికలు, భద్రతామండలితీర్మానాలతోపాటు, భారత-పాకిస్తాన్ ప్రభుత్వాలు అనుబంధనివేదికలలో సమర్పించిన పరస్పరవిరుద్ధసూచనలకూ, కమిషన్ ఇచ్చిన పరస్పరవిరుద్ధవాగ్దానాలకు లోబడే నిర్వహించాలా? లోబడే నిర్వహించవలసినట్లయితే కమిషన్ మాదిరిగానే మధ్యవర్తికూడ విఫలుడు కాక తప్పదు. ప్రతిష్టంభన తప్పదు. మధ్యవర్తి కివ్వబడిన అధికారాలు విస్తృతమైనవైనప్పటికీ ఈ విషయంలో తీర్మానం ఉద్దేశం స్పష్టపడలేదు.

తీర్మానానికి అందరికీ అంగీకారం కుదిరింది. కాని ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో రష్యా పాల్గొనలేదు. శాశ్వత సభ్యత్వంగల రష్యాప్రతినిధి లేకుండా భద్రతామండలిచేసే తీర్మానాలు నిర్ణయాలు కేవలం నియమాలకు సంబంధించినవేఅయితే అవి చెల్లుతాయి. రాజకీయసమస్యలకు సంబంధించినవైతే, రష్యాసమ్మతి ఉంటేకాని చెల్లవు. అందువల్ల ఒకవంక మధ్యవర్తి ఎవరనేవిషయంపైన సమాధానం కుదరనందువల్లనూ, మరొకవంక రష్యా తాత్కాలిక నిర్గమనంవల్లనూ కాశ్మీర్ సమస్య తిరిగి ప్రతిష్టంభనలో పడిపోగలదనే సంకోచానికి తావిస్తున్నది.

వర్షరాణి

అత్తింట అడుగుమెట్టే కొత్తకోడలి వల్లనే తమ అదృష్టం రాజూ రాణులపైన ఆధారపడిఉంటుందని నమ్ముతారట బమంగ్వాటో నీగ్రోలు. తెల్లరాణి దేశంలో అడుగుపెట్టగానే వర్షాలు కుర్సినందువల్ల శుభసూచకమని ఆనందించి ఆమెను రాణిగా అంగీకరించి ప్రీతితో 'వర్షరాణి' అని ఆమెకు పేరుపెట్టారు. ఆమె పేరు 'రూత్ విలియమ్స్'. బమంగ్వాటో జాతినీగ్రోల నాయకుడు సెరట్సేఖామా లండన్ లో విద్యనభ్యసిస్తున్నప్పుడు టైపిస్టుఉద్యోగం చేస్తున్న రూత్ విలియమ్స్ తో ఖామాకు పరిచయం కలిగింది. తరువాత వారు ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. నీగ్రోజాతికి చెందినవానితో శ్వేతజాతిస్త్రీవివాహం జాత్యహంకారు లందరికీ కంటగింపయింది. కామన్వెల్తులో భారతదేశం పాకిస్తాన్ సింహళాలకి బ్రిటన్ కెనడాలవంటి దేశాలతో సమానప్రతిపత్తినిస్తున్నట్లు నటించే బ్రిటిష్ ప్రభుత్వంలోనివారి అసలురంగు బయటపడింది.

మొదట బ్రిటిష్‌వనితను వివాహమాడిన ఖామాను తమ రాజుగా అంగీకరించడానికి బమంగ్వాటో నీగ్రోలలో చాలమంది అంగీకరించలేదు.

ఇలా అంగీకరించనివారికి సెరట్సేఖామా పినతండ్రి అయిన ట్సెకెడీ నాయకుడు. అంతఃకలహాలు చెలరేగగలవనే వంకతో ఆ పినతండ్రిని బ్రిటిష్‌పాలకులు అయిదేళ్లు బెచువానాలాండ్ లో ఉండరాదని నిషేధించారు.

ఆతరవాత బమంగ్వాటో నాయకులందరూ చేరి రాజును ఎంచవలసిన సమయం వచ్చింది. ఎలాగైనా ఖామాను రాజుకానివ్వరాదని బ్రిటిష్‌పాలకులు తంత్రం పన్నారు. దేశాంతరవాసశిక్షవిధించిన అతని పినతండ్రిని రాజుగా చెయ్యడానికి యత్నించారు. ముందుగా బమంగ్వాటో నాయకులే ఖామాను రాజు గాకుండా చేస్తారని బ్రిటిష్‌అధికారులు ఆశించారు. కాని ఖామాకు సుముఖులైనవారి బలం అధికంగా ఉన్నదని తెలిసివచ్చినప్పుడు ఒక దుస్తంత్రం పన్నారు.

సెరట్సేఖామా భార్యతో సహా స్వదేశం వెళ్లాడు. వెళ్లినతరువాత రాజుపదవివిషయమై చర్చించాలనే మిషతో ఖామాను లండన్ ఆహ్వానించారు. ఆహ్వానించినప్పుడే బ్రిటిష్‌ప్రభుత్వానికి దురుద్దేశం ఉన్నట్లు అందరూ గ్రహించారు. ఖామా వెళ్లడానికి సంకోచించాడు. కాని అతన్ని తిరిగి స్వదేశంవెళ్లడానికి అభ్యంతరపెట్టబోరని బ్రిటిష్‌ప్రభుత్వం ప్రకటించింది. ఖామా వెళ్లాడు. రెండుమూడురోజులు అతనితో సంప్రదింపులు జరిపినట్లే జరిపి, ఖామా అయిదేళ్లవరకూ స్వదేశం వెళ్లరాదని నిషేధాజ్ఞ విధించారు. ఖామా స్వదేశం వెళ్లి రాజు కావాలని యత్నించినట్లయితే బెచువానాలాండ్‌లో అంతఃకలహాలు సంభవిస్తాయని మిష చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వం ఈరీతిగా వాగ్దానభంగం చేసి అనుచితంగా ప్రవర్తించడానికి దక్షిణాఫ్రికామలాన్ ప్రభుత్వం ఒత్తిడి కొంత, బ్రిటిష్‌ప్రభుత్వంలోనివారిలోనే గల జాత్యహంకారం కొంత కారణాలు.

ఈ దుస్తంత్రానికి బ్రిటిషుప్రభుత్వాన్ని లోకమంతా దూషించింది. ప్రజాసామ్య సూత్రాలకీ, సర్వజాతివర్ణ సమత్వసిద్ధాంతాలకీ ఇది పరీక్షయింది. బ్రిటిషువారి ఈ అవివేకంవల్ల బమంగ్వాటో జాతిలోని సర్వ వర్ణాలవారూ ఏకమైనారు. మొదట ఖామా రాజు కావడానికి నిరాకరించినవారుకూడా ఖామాకు తోడైనారు. నిషేధాజ్ఞను ప్రకటించడానికి బ్రిటిషుపాలకులు బమంగ్వాటో నాయకులందర్నీ సమావేశానికి పిలిచారు. ఒక్కరుకూడా రాలేదు. ఖామానే రాజుగా ఏకగ్రీవంగా నిర్ణయించారు.


ఖామాపై నిషేధాజ్ఞను తొలగించి, స్వదేశానికి తిరిగి రానివ్వాలని బ్రిటిషుప్రభుత్వానికి చెప్పారు. నిషేధాజ్ఞను తొలగించేవరకూ సత్యాగ్రహం ప్రకటించారు. పన్నులు కట్టకూడదని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

బ్రిటిషుప్రభుత్వం ఈ ఒత్తిడికి లొంగింది. కాని వారి దురహంకారానికి తగినట్లు కొన్ని షరతులు విధిస్తూ, తాత్కాలికంగా నిషేధాజ్ఞను తొలగించారు. ఖామా వారసత్వానికి సంబంధించిన కేసులో స్వదేశంలో సాక్ష్యాన్ని సేకరించుకోడానికిగాను అతన్ని స్వదేశం వెళ్ళనిస్తున్నారని చెప్పారు. బెచువానాలాండ్‌లో అంతఃకలహాలు సంభవించకుండా ఉండేవరకూ, అతని ప్రవర్తన (తమకు) తృప్తికరంగా ఉన్నంతవరకూ ఖామాను స్వదేశంలో ఉండనిస్తారనీ, ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించి, అవసరమని తోచినప్పుడు తిరిగి నిషేధాజ్ఞను విధించగలరనీ బ్రిటిషుప్రభుత్వం ప్రకటించింది.


తమ నిర్ణయానికి దేవుడు హర్షించినట్లుగా సకాలంలో వర్షాలు కురిసినందువల్ల బమంగ్వాటో నీగ్రోలు ఆనందించారు.

రుత్ విలియమ్స్ తమ దేశానికి సిరిసంపదలు తేగలదనడానికి అది శుభసూచనగా భావించి ఆమెను తమ రాణిగా అంగీకరించారు. జాత్యహంకారులకి భంగపాటయింది.

(సూర్యనారాయణ)



గుంటూరు మండల సహకార మహాసభ సందర్భంలో అధ్యక్షులు శ్రీ కళావెంకటరావు, గౌ॥ నీలం సంజీవరెడ్డి, గౌ॥ కల్లూరి చంద్రమౌళిగార్లను తెనాలిపుర వీధులలో ఊరేగింపు చేయుచున్నారు.



మాజీ సైనికుల సహాయార్థం ఇటీవల గుంటూరులో ప్రత్యేక ప్రదర్శనం జరిగింది. రాష్ట్ర ఆర్థికమంత్రి గోపాలరెడ్డిగారు బ్రిగేడీర్ జంకత్ సింగ్, పి. వి కృష్ణయ్యచౌదరిగార్ల సహకారశాఖోద్యోగులతో చర్చలు జరుపుతున్న చిత్రం

మనరాష్ట్రం మనదేశం

(4-వ పేజీ తరువాయి)

గురించి భారతప్రభుత్వం కాని జోక్యం చేసుకోరాదని దీని తాత్పర్యం. ఇదిక్రియలో అసాధ్యమనే విషయం అనుభవంవల్ల స్పష్టమే. దాదాపు నూరింట 40 వంతుల చొప్పున హిందువుల్ని తూర్పుపాకిస్తాన్‌లోనూ, మహమ్మదీయుల్ని పశ్చిమబెంగాల్లోనూ విడిచివేసిన దేశవిభజన ప్రజలకు మహోపచారం. దేశవిభజన జరిగిన రీతినిబట్టే పాకిస్తాన్ స్థాపన హిందూమహమ్మదీయ సమస్యపరిష్కారంకోసం జరగలేదనీ, బ్రిటిష్ రాజనీతిజ్ఞులు, వారి కీలుబొమ్మలైన ముస్లింలీగర్ల దుస్తంత్రాల ఫలితంగా జరిగిందనీ, జ్ఞప్తిలో ఉంచుకోవలసిన అవసరం ఉన్నది. ఇటువంటి దేశవిభజనవల్ల హిందూ మహమ్మదీయ సమస్య పరిష్కారం కాకపోగా, భరతఖండంలో ఉభయమతాల వారి మధ్యనూ వైరం స్థిరపడిపోయింది. మహమ్మదీయసంఖ్యాధిక్యతనుబట్టి బెంగాల్ అంతా తమకే లభించవలసి ఉన్నదనేభావం అటు పాకిస్తాన్ నాయకులలో ప్రబలమయింది. నాఖాలీ, త్రిపురాదురంతాలకు కారకులైనవారి పరిపాలనకు లక్షలాది హిందువులను పాల్పడచేసిన దేశవిభజన విధానం అన్యాయమనీ, ప్రత్యేక సంస్కృతి, ప్రత్యేకజాతీయత, విశిష్టత గల వంగరాష్ట్రం విభజించబడటం ఎన్నటికీ అంగీకారం కాజాలదనీ, ఎన్నటికైనా వంగజాతీయత పునరుద్ధరించబడాలనీ బెంగాలీలో అభిప్రాయం ప్రబలమౌతోంది. ఈ అభిప్రాయాలేవీ ప్రభుత్వానికి రుచించకపోవచ్చును. కాని లక్షలాదిహిందువుల దుర్గతిని యోచించికాని యోచించక కాని, లక్షలాదిప్రజల సమ్మతిలేకుండా జరిగిన ఈ దేశవిభజనవల్ల ఆప్రజలు తమ రక్షణకు భారతదేశంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతవహించాలని కోరడంలో అన్యాయమేమీ లేదు. భారతరిపబ్లిక్‌లో అల్పసంఖ్యాకులైన మహమ్మదీయుల రక్షణబాధ్యతను వహించినట్లే, దేశవిభజనఫలితంగా అన్యదేశమనిపించుకుంటున్న ప్రాంతంలోని అల్పసంఖ్యాకులైన హిందువుల రక్షణకుకూడా బాధ్యత కొంతవరకైనా వహించవలసిన ధర్మం భారం భారతప్రభుత్వంపైన ఉంది. మతసమస్యను పరిష్కరించగలరను వాదంతో దేశవిభజన సాధించిన బ్రిటిష్ తంత్రజ్ఞులనూ, పాకిస్తాన్ పాలకులైన ముస్లింలీగర్లనూ పంజాయిషీ అడగడం ప్రజలపట్ల భారత ప్రభుత్వం నిర్వర్తించవలసిన కనీసధర్మం. అంతేకాదు. ఈ మతసమస్య నియమితకాలంలో పరిష్కారం కానిపక్షంలో బెంగాల్ విభజనను రద్దుపరచడానికీ, బెంగాల్‌లో తిరిగి శాంతపరిస్థితులను స్థాపించడానికి భారతప్రభుత్వం యత్నించడం అన్యాయం కాజాలదు. కాని జరిగిపోయిన దేశవిభజనను ఇప్పుడు రద్దుపరచడం అసంభవం. కాబట్టి పాకిస్తాన్‌లోని మహమ్మదీయేతరుల రక్షణకు కొంతవరకైనా బాధ్యతవహించడం కనీసధర్మం. దీనిని అన్యదేశపరిపాలనలో జోక్యంగా

భావించడం, నేటి రాజకీయాలగతిని అర్థం చేసుకో లేకపోవడమే. ప్రపంచంలోని ఇతరదేశాలమధ్య వ్యవహారవిధానమే పూర్తిగా భారత పాకిస్తాన్‌లమధ్యకూడా అనుసరించబడాలంటే సాధ్యం కాదు.

కాబట్టి పాకిస్తాన్‌లోని హిందువులను గురించి పండిట్ నెహ్రూ చేసిన మొదటి ప్రకటనే అనుసరణయోగ్యమైనది. సంయుక్త ప్రకటనలవల్ల ఆవంతైనా ప్రయోజనం ఉండదని ఇంతవరకూ అనేకపర్యాయాలు అనుభవమయింది. ఇటువంటి ప్రకటనల్ని పాకిస్తాన్ నాయకులు అమలుజరపగలరనే విశ్వాసం ఎవరికీ లేదు. భారతప్రభుత్వాన్ని వాగ్దానాలకు నిర్బంధించి తాము వాగ్దానభంగాలుచేయడం పాకిస్తాన్ నాయకుల రాజనీతి. హిందువుల నెన్నడూ పాకిస్తాన్ పౌరులుగా అంగీకరించలేదు అంగీకరించదు. వారంతా మహమ్మదీయమతం పుచ్చుకున్నప్పుడే పాకిస్తాన్‌లో శాంతి ఏర్పడుతుంది. పాకిస్తాన్ పూర్తిగా, ఇస్లాం దేశంగా మారాలని ముస్లిం లీగ్ నాయకుల ఆశీమతం. వారికి ప్రజాస్వామ్యసూత్రాలతోగాని సర్వమతసమత్వసిద్ధాంతాలతోగానిఅల్పసంఖ్యాకవర్గాలకు పౌరసత్వాల నిచ్చే సిద్ధాంతాలతోగాని నిమిత్తం లేదు. అన్యమతసహనం ముస్లింలీగర్లకు సర్వత్ర త్యాజ్యం. ఇస్లాం మతప్రధానమైన దేశస్థాపనే వారి ఉద్దేశమైతే దేశవిభజన ఈ రీతిగా జరిగిఉండకూడదు. నూటికి నూరింట మహమ్మదీయ మతానుయాయులేగల ప్రాంతాలను వారికి విడిచిపెట్టాలి. మిగతా ప్రాంతాలలో ప్రజల రక్షణబాధ్యత భారతప్రభుత్వం త్యజించకూడనిది.

"ఏ దుష్టశక్తులను అంతరింపచేయడం కోసం దేశవిభజనమొదలైన కాండకు సమ్మతించామో, అవి అంతరించనే లేదు. ఈనాడు చూస్తే దీనికోసం ఎంత ధర చెల్లించామో ఎంతమందిని బలిచేశామో బోధపడుచున్నది. ఇంత బలిదానం చేసికూడా చివరకి శాంతిస్థాపనాశయం నెరవేరనేలేదనే సత్యం అకస్మాత్తుగా తెలిసివచ్చింది." అని పండిట్ నెహ్రూ పార్లమెంటులో అన్నారు.

శాంతికోసం భారతీయులు చెల్లించిన రక్తమూల్యం కన్నులకు కట్టినట్లయితే మతిభ్రమ సంభవిస్తుంది. రెండేళ్లలో 16 లక్షలమంది హిందువులు తూర్పు బెంగాల్ నుంచి కట్టుబట్టలతో వచ్చారు. అనేక వేలమంది దారుణహింసలకు పాలై ప్రాణాలు విడిచారు. దేశవిభజనానంతరం నాలుగు వేల కోట్ల రూపాయల ఆస్తిసంపదకు తిలోదకాలు విడిచి హిందువులు భారతదేశంవచ్చారు.

పాకిస్తాన్‌లో హిందువులరక్షణకు పాకిస్తాన్ ప్రభుత్వం బాధ్యతవహించలేని పక్షంలో దేశవిభజనవిధానాన్ని తిరిగి తోడవలసిన అవసరం కలుగుతుంది. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మతించకపోతే భారతదేశంలోనే దుష్టశక్తులు ప్రబలమై ప్రభుత్వానికి ముప్పుతేగల ప్రమాదం ఉంది.

[సీతారాం]

'సింథెటిక్ సబ్బులు'

(21 వ-పేజీ తరువాయి)

లాడుతుంటాయి. ఈ సింథటిక్ సబ్బపదార్థాలు చలినీటిలో కూడా పూర్తిగా కరిగి అడుగున ఏమీ మిగులకుండా ఉంటాయి కాబట్టి, వీట్లతో కడిగిన వస్తువుమీద మరక మిగలదు. అంటే సబ్బుమరకను మళ్ళీ తుడిచేసుకోవలసిన అవసరం ఉండదు. వీట్లని డిటెర్జెంట్సు అని కూడా అంటారు.

అయితే ఇవి మామూలు సబ్బులులాగా బిళ్ళలుగా తయారుకావు. మామూలుసబ్బులలో కలిపి తయారుచేస్తే తప్ప ఇళ్లల్లో తల అంటుకొనేందుకు పట్టు, ఉన్ని, దుస్తులను శుభ్రపరచుకొనేందుకూ కూడా 'డిటెర్జెంట్సు పనికివస్తాయి. గచ్చునేలలు మొదలైనవి శుభ్రంగా కడుక్కొనేందుకుకూడా ఈ డిటెర్జెంట్లుకలిపిన నీళ్లు బాగా వినియోగిస్తాయి.

పరిశ్రమలలో వీట్ల ఉపయోగం ఎక్కువ. బొగ్గుగనులలో గాలిలో బొగ్గు దుమ్ము కలిసిఉండి పనివారి శ్వాసకోశాలు పాడుచేయటమే కాకుండా, బొగ్గులో అగ్నిప్రమాదము కూడా ఎక్కువ ఉంటుంది. ఈ డిటెర్జెంటుకలిపిన నిరు గనులలోకి వానజల్లులాగా 'స్ప్రే' చేసినందువల్ల, గాలి శుభ్రపడి, గనులలో అపాయాలు తప్పుతాయి.

బట్టల మిల్లులలో, రంగుల అద్దకాలకు పూర్వం, బట్టను త్వరగా శుభ్రపరచి రంగును సరిగ్గా బట్ట పీల్చుకొనేందుకు ఈ సింథటిక్ సబ్బ నీళ్ళతో యంత్రంలో తయారులో ఉన్న బట్టను తడుపుతారు. తోళ్ళ పరిశ్రమలోనూ ఈ ఉపయోగం ఎక్కువేకలప, బట్ట, ఇది నిప్పువల్ల ప్రమాదం అందకుండా, పూతపూసేటప్పుడు కూడా ఈడిటెర్జెంటు సబ్బులు బాగా ఉపయోగిస్తాయి. ఇవి నీళ్ళల్లో బాగా కలిసిపోవటం వల్ల బట్టలోగాని, కొయ్యలోగాని, ప్రతి చిన్నరంధ్రంలోకి పాకి అగ్నిమాపకపదార్థాన్ని కూడా అంతటా ఆవరించుకొనేటట్టు చేస్తాయి.


పట్టణాల రోడ్లనిర్మాణంలో కూడా ఈ డిటెర్జెంటుపదార్థాలను కలపటంవల్ల ఎండవానల తాకిడికి ఎక్కువకాలం ఆటి నిలవగల సత్తా రోడ్లకు వస్తుంది. కాంక్రీట్ పేమెంట్లలో మధ్య గాలిబుడగలను మిగిల్చితే ముద్దగా ఉన్న కాంక్రీటుకంటె బలంగా పగుళ్లు లేకుండా నిలుస్తుందని ఇంజనీర్లు కనిపెట్టారు. ఈ డిటెర్జెంటులు కలపటంవల్ల, సిమెంటుకు ఈ సుగుణం అలవడుతుందట.

ఈ సింథటిక్ సబ్బులు, స్నానాల సబ్బుల స్థానం ఆక్రమించుకోలేకపోవచ్చును. గాని వీట్ల ప్రయోజనాలు ఉపయోగాలు, గతఎనిమిదేళ్లల్లో ఆరురెట్లు పెరిగిపోయినాయి. ఒక్క అమెరికాలో ఏటా 600,000,000 పౌనుల డిటెర్జెంటులు తయారుఅవుతున్నాయి.



మార్చి 11 న జరిగిన పురావస్తుపరిశోధన కేంద్రసలహాసంఘపు 7 వ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు : ఎడమనుండి కుడికి— డా॥ ఎస్. ఎస్. సేన్; పి. ఎస్. కృపాల్; (విద్యాశాఖ ఉపకార్యదర్శి) మౌలానా అజాద్; డా॥ తారాచందు (విద్యాశాఖ కార్యదర్శి) డా॥ ఎస్. పి. చక్రవర్తి; (పురావస్తుశాఖ డైరెక్టరు జనరలు) ఎమ్. ఎస్. వాట్స్; (డిప్యూటీ డైరెక్టరుజనరలు).

బాల్కంజీబారీ ఢిల్లీశాఖవారు : అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గారికి సన్మానపత్రాన్ని సమర్పించారు.



Regd No. M. 4479

ఆంధ్రపత్రిక

వికృతి ఉగాది సంచిక

వెలువడినది

అందమైన అయిదు త్రివర్ణ చిత్రములు, రాయ్ చౌదరి రమణీయ శిల్ప చిత్రాలు.

కథలు, నాటకాలు, వ్యంగ్యరచనలు, 'విరోధి' సమగ్ర. రాజకీయాలు, చెళ్లపిళ్లవారి చివరి రచన...'వికృతి' పంచాంగం.

విషయ వివరణ

వెల రు. 2 లు మాత్రమే.

పోస్టుద్వారా పంపుటకు ప్యాకింగు, పోస్టేజీలకు అ. 8 లు అదనము.

మీ సమీపమున నున్న ఆంధ్రపత్రిక ఏజెంట్లు అందరివద్ద లభించును.

మానేజరు,

ఆంధ్రపత్రిక.

పోస్టుబాక్సు 212 — మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press 7. Thambu ChettySt, Madras.